మువ్వన్నెల పండుగకు ముస్తాబు

స్వాతంత్ర్య వేడుకలకు జిల్లా సిద్ధమైంది. ఒంగోలులోని కలెక్టరేట్, ప్రభుత్వ భవనాలు మువ్వన్నెల విద్యుత్ వెలుగులతో ధగధగలాడుతున్నాయి. పోలీస్ పరేడ్ గ్రౌండ్ సర్వాంగసుందరంగా ముస్తాబైంది. మర్కాపురంలో దీక్షా యూత్ ఆధ్వర్యంలో వంద అడుగుల జాతీయ జెండాతో ముందస్తుగా గురువారం తిరంగా ర్యాలీ నిర్వహించారు. ఇందులో సబ్ కలెక్టర్ వెంకట త్రివినాగ్ పాల్గొన్నారు. అన్ని మండలాల్లోని ప్రభుత్వ కార్యాలయాల్లో జాతీయ పతాక ఆవిష్కరణకు ఏర్పాట్లు చేశారు. 8, 9 పేజీల్లో



కాంతివంతంగా కలెక్టరేట్

ముస్తాబైన పోలీస్ పరేడ్ గ్రౌండ్

బ్రిటీష్ పాలనపై గర్జించిన దరిశి చెంచయ్య

- తెల్లోడి పాలన వద్దని పోరాడిన ధీరుడు
- కనిగిరి చారిత్రక ఘట్టాలకు సజీవ సాక్ష్యంగా నిలిచిన మహనీయుడు

9

స్వాతంత్ర్య సమరంలో గిరిజన ధీరులు

- అమృత్ మహోత్సవ్‌లో గుర్తింపు
- తుమ్మలబైలులో విగ్రహాల ఏర్పాటు
- పోస్టల్ కవర్ విడుదల

9



మార్కాపురంలో..



యర్రగొండపాలెంలో..

కోలాహలంగా కృతజ్ఞతా ర్యాలీలు

ప్రభుత్వం అన్నదాత సుఖీభవ నగదు జమ చేయడంతో రైతులు, తెలుగు తమ్ముళ్లు వేడుకలు చేసుకుంటున్నారు. సీఎం చంద్రబాబు నాయుడుకు కృతజ్ఞతలు తెలుపుతూ నియోజకవర్గాల వారీ ప్రదర్శనలు నిర్వహిస్తున్నారు. గురువారం మార్కాపురంలో ఎమ్మెల్యే నారాయణరెడ్డి, ఎర్రగొండపాలెంలో టీడీపీ ఇన్‌చార్జి ఎరిక్షన్‌బాబు ఆధ్వర్యంలో ర్యాలీలు జరిగాయి. పెద్దఎత్తున రైతులు ట్రాక్టర్లు, ఎడ్లబండ్లపై తరలివచ్చి ఉత్సాహంగా పాల్గొన్నారు. వివరాలు 8వ పేజీలో..

ఉచిత ప్రయాణానికి స్త్రీకారం

నేటి నుంచి స్త్రీశక్తి పథకం అమలు

ఒంగోలులో ప్రారంభించనున్న మంత్రి డీఎస్‌బీవీ స్వామి

రాష్ట్రంలో ఎక్కడికైనా ఆర్టీసీలో ప్రయాణం

జిల్లాలో 316 బస్సుల్లో.. 13 లక్షల మందికి లబ్ధి



మహిళలు ఎప్పుడెప్పుడా అని ఎదురుచూస్తున్న పథకం అమలుకు వేళైంది. చెప్పిన మాట ప్రకారం ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణానికి రాష్ట్ర ప్రభుత్వం అన్ని ఏర్పాట్లూ చేసింది. 'స్త్రీ శక్తి' పేరుతో అమల్లోకి తీసుకొస్తోంది. మంత్రి డోలా శ్రీబాలవీరాంజనేయస్వామి శుక్రవారం ఒంగోలులో ప్రారంభించనున్నారు. రీజియన్ పరిధిలో వివిధ రకాల 316 ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణానికి అవకాశం కల్పించారు. దీంతో జిల్లాలోని 13 లక్షల మంది యువతులు, మహిళలకు లబ్ధి కలుగుతుంది.

ఒంగోలు, కార్పొరేషన్, ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి) : ప్రజా ప్రభుత్వం హామీలను అధికారంలోకి వచ్చిన ఏడాదిలోపే ఒక్కొక్కటిగా నెరవేరుస్తోంది. శుక్రవారం నుంచి 'స్త్రీశక్తి' పథకానికి శ్రీకారం చుడుతోంది. రాష్ట్రంలో ఎక్కడికైనా మహిళలు ఆర్టీసీ బస్సుల్లో ఉచితంగా ప్రయాణించే సౌకర్యాన్ని అందుబాటులోకి తీసుకొస్తోంది. ప్రకాశం రీజియన్‌లో 484 బస్సులు ఉండగా, 316 బస్సులను మహిళల ఉచిత ప్రయాణానికి సిద్ధం చేశారు. అందుకోసం రీజియన్ పరిధిలోని ఐదు ప్రధాన డిపోలు, 20 గ్రామీణ అనుసంధాన బస్టాండ్‌లను ముస్తాబు చేశారు.

నేడు ఒంగోలులో లాంఛనంగా ప్రారంభం

విజయవాడలోని ఎన్టీఆర్ బస్‌స్టేషన్‌లో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు మధ్యాహ్నం 3 గంటలకు కార్యక్రమాన్ని ప్రారంభించనున్నారు. దాన్ని ప్రయాణికులు వీక్షించేందుకు జిల్లాలోని అన్ని డిపోల్లో ఎల్‌ఈడీ టీవీలలో లైవ్ ప్రదర్శనను అధికారులు ఏర్పాటు చేశారు. ఆ తర్వాత సాయంత్రం 5 గంటలకు ఒంగోలులోని ఆర్టీసీ బస్టాండ్‌లో మిగతా 8లో...

ఎవరెవరికి ఎలా ప్రయోజనం అంటే..

- పల్లె వెలుగు, అల్ట్రా పల్లె వెలుగు, సిటీ ఆర్డినరీ, ఎక్స్‌ప్రెస్, మెట్రో ఎక్స్‌ప్రెస్‌లలో రాష్ట్రంలో ఎక్కడి నుంచి ఎక్కడికైనా ఉచిత ప్రయాణానికి అవకాశం కల్పించారు.
- బస్సులో ప్రయాణించడానికి ఆధార్ ఓటర్, రేషన్ కార్డులలో ఏది చూపినా ప్రయాణించొచ్చు.
- చదువుకునే విద్యార్థినులు, ఆడపిల్లలు వయస్సుతో సంబంధం లేకుండా ఇకపై ఉచితంగా ప్రయాణించొచ్చు.
- ట్రాన్స్‌జండర్లు కూడా ఐదు రకాల బస్సుల్లో ఉచితంగా ప్రయాణించొచ్చు.
- సూపర్ లగ్జరీ, ఏసీ, గరుడ, అమరావతి వంటి ప్రీమియం బస్సులలో ఈ పథకం వర్తించదు. వీటితోపాటు ఇతర రాష్ట్రాల సర్వీసులలో ఉచిత ప్రయాణం వర్తించదు.
- ఉచిత ప్రయాణం పొందే ప్రతిఒక్కరికీ బస్సులో కౌంటింగ్ కోసం టికెట్ ఇస్తారు. డబ్బు కట్టాల్సిన పని లేదు.

ఉచిత ప్రయాణానికి 316 బస్సులు సిద్ధం

ప్రకాశం రీజియన్ పరిధిలో ఒంగోలు, మార్కాపురం, కనిగిరి, గిద్దలూరు, పొదిలి, ఆర్టీసీ డిపోలు ఉన్నాయి. వాటి పరిధిలోని 866 గ్రామాలకు అనుసంధానంగా 20 బస్‌స్టేషన్లు ఉన్నాయి. 484 ఆర్టీసీ బస్సులు ఉండగా వాటిలో 95 అద్దె ప్రాతిపదికన (హయ్యర్) నడుస్తున్నాయి. మహిళల ఉచిత ప్రయాణం కోసం 316 బస్సులను కేటాయించారు. ఇప్పటివరకు ఉన్న బస్సులన్నీ సుమారుగా రోజుకు 2లక్షల కిలోమీటర్లు ప్రయాణికుల కోసం రాకపోకలు సాగిస్తుండగా, అందులో 1.5 లక్షల మంది ప్రయాణిస్తున్నారు. దీంతో రోజుకు ప్రకాశం రీజియన్‌కు రూ.77.51 లక్షల ఆదాయం వస్తుండగా, అందులో సగం మంది మహిళలు కావడంతో వారికి ఉచిత బస్సు ప్రయాణ సౌకర్య అందించనుండటంతో రూ.38.5 లక్షల భారం ప్రభుత్వంపై పడనుంది.



పాలేరులో నీటి ప్రవాహం (ఫైల్)

కొండపి నియోజకవర్గానికి వెలిగొండ నీళ్లు

- తూర్పు ప్రధాన కాలువ ద్వారా పాలేరు, ముసి నదులకు సరఫరా
- మంత్రి స్వామి వినతిపై ప్రభుత్వం సానుకూల స్పందన
- తగు చర్యలకు అధికారులను ఆదేశిస్తూ ఉత్తర్వులు
- ఇటీవలే ముసికి 0.60 టీఎంసీల సాగర్ నీరు ఇస్తూ ఆదేశాలు

ఒంగోలు, ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి) : శాశ్వత సాగునీటి సౌకర్యం లేని కొండపి నియోజకవర్గ ప్రజలకు ప్రత్యేకించి రైతులకు ఉపకరించే నిర్ణయాన్ని ప్రజా ప్రభుత్వం తీసుకుంది. నియోజక వర్గంలో సుదూర ప్రాంతం సాగే పాలేరు, ముసి నదులకు వెలిగొండ జలాల సరఫరాకు గ్రీన్‌సిగ్నల్ ఇచ్చింది. ఆ మేరకు ఉత్తర్వులను గురువారం జలవనరులశాఖ ఉన్నతాధికారులు జారీ చేశారు. వారం క్రితమే 0.60 టీఎంసీల సాగర్ జలాలను ముసి ద్వారా కొండపి నియోజకవర్గానికి ఇచ్చేలా కూడా ఉత్తర్వులు వచ్చాయి.

మంత్రి స్వామి కృషి ఫలితం

జిల్లాలో వర్షాలు, వాటి ఆధారంగా ముసి, పాలేరు నీరు ద్వారా ఎత్తిపోతల పథకాలు.. చెరువులు తప్ప కాలువల ద్వారా నీరు వచ్చే సౌకర్యం ఏమాత్రం లేని నియోజకవర్గాల్లో కొండపి ముందు వరుసలో ఉంది. నియోజకవర్గం మొత్తం వ్యవసాయమే కీలకమైనప్పటికీ సాగునీటికి గ్యారెంటీ లేక రైతులు ఇబ్బంది పడుతున్నారు. తాగునీటికి కూడా అలాంటి పరిస్థితే ఉంది. ఈనేపథ్యంలో వరుసగా మూడు విడతలుగా ఆ నియోజకవర్గం నుంచి ప్రాతినిథ్యం వహిస్తున్న డాక్టర్ స్వామి గతంలో టీడీపీ అధికారంలో ఉన్న 2014-19 మధ్య కాలంలో తాగునీటి పథకాలపైదృష్టి సారించి ఫలితాలు సాధించారు. పెండింగ్‌లో ఉన్న సంగమేశ్వరం ప్రాజెక్టు నిర్మాణంపై దృష్టి పెట్టినా అప్పటి ప్రభుత్వ ఆర్థిక ఇబ్బందులతో ముందుకు కదలలేదు. ఈసారి తిరిగి ప్రజాప్రభుత్వం అధికారంలోకి రావడమే కాక డాక్టర్ స్వామి మంత్రి కూడా కావడంతో ఇటు సాగర్, అటు వెలిగొండ నీరు నియోజకవర్గానికి అందించి శాశ్వత హక్కు కల్పించే వైపు దృష్టి పెట్టారు. దాదాపు ఐదారు మిగతా 8లో...



శ్రీశైలం ఘాట్ రోడ్డుపై ఆందోళన నిర్వహిస్తున్న చెంచు గిరిజనులు

కరెంట్ సౌకర్యం కల్పించాలి

శ్రీశైలం ఘాట్ రోడ్డుపై ఆందోళనకు దిగిన చెంచు గిరిజనులు

పెద్దదోర్నాల, ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి) : నల్లమల అడవిలోని తమ గూడేనికి కరెంట్ సౌకర్యం కల్పించాలని మండలంలోని చిన్నారుట్ల ప్రజలు శ్రీశైలం - దోర్నాల ఘాట్ రోడ్డుపై గురువారం ఆందోళనకు దిగారు. వాహన రాకపోకలు జరుగకుండా రాళ్లు అడ్డం పెట్టి గంటపాటు నిరసన తెలిపారు. ఏళ్ల తరబడి ఎదురు చూస్తున్నా మా గూడేనికి కరెంట్ లేకపోవడంతో రాత్రివేళల్లో విష సర్పాలు, క్రూరమృగాలు ఇళ్లలోకి వస్తున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. తమ బాధను అర్థం చేసుకోవాలని నినదించారు. దీంతో వాహనాల రాకపోకలు స్తంభించిపోయాయి. సమాచారం అందుకున్న ఎస్‌ఐ మహేష్, అటవీ శాఖాధికారులు ఘటనా స్థలానికి చేరుకొని గిరిజనులతో చర్చించారు. విషయాన్ని ఉన్నతాధికారులతో మాట్లాడి పరిష్కారానికి కృషి చేస్తామని హామీ ఇచ్చారు. దీంతో గిరిజనులు ఆందోళన విరమించారు.

వీరయ్య చౌదరి హత్య కేసులో

'ముప్పా' సరెండర్

ముందస్తు బెయిల్‌ను తిరస్కరించిన సుప్రీం కోర్టు

మెయిన్‌లో..

మూడేళ్ల చిన్నారిపై

చిరుత దాడి

- నోట కరుచుకొని తీసుకెళ్తుండగా కేకలు వేసిన తల్లిదండ్రులు
- అక్కడే వదిలేసి వెళ్లిన పులి
- తప్పిన ప్రాణాపాయం

మెయిన్‌లో..

అనర్హులకు చెక్!

వచ్చే నెల నుంచి పింఛన్ రద్దు

వైసీపీ హయాంలో ఇష్టానుసారం జారీ

దివ్యాంగులు, మంచానికే పరిమితమైన కేటగిరీలపై ప్రజా ప్రభుత్వం విచారణ

బయటపడిన విచ్చలవిడి అవకతవకల బాగోతం

అర్హత లేని వారిని తొలగించాలని నిర్ణయం

వారికి సచివాలయాల నుంచి నోటీసులు

ఈనెల 25 వరకు అభ్యంతరాల స్వీకరణ



ఒంగోలు నగరం, ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి) 0): ఎన్టీఆర్ భరోసా పథకం ద్వారా పింఛన్ పొందుతున్న వారిలో అనర్హులను తొలగించాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఈ ఏడాది జనవరి నుంచి జూలై వరకూ చేపట్టిన పరిశీలనలో అర్హతలేనట్లు తేలిన వారికి వచ్చే నెల నుంచి పంపిణీ నిలిపివేయనుంది. వీరిలో వైకల్యం లేకుండానే సరిఫికెట్లు సమర్పించి నెలకు రూ.6వేల దివ్యాంగ పింఛన్ పొందుతున్న వారు.. మంచం, వీల్‌చైర్‌కే పరిమితమైనట్లు చూపి నెలనెలా రూ.15వేలు తీసుకుంటున్న వారు ఉన్నారు. ఒకరకం పింఛన్‌కు అర్హత ఉండి మరో రకం కింద తీసుకుంటున్న వారికి కేటగిరీ మార్చి ఇవ్వనుంది.

గత ప్రభుత్వంలో భారీగా అనర్హులు

జిల్లాలో దివ్యాంగ పింఛన్‌లు 32,875 మంది, మంచానికి లేదా వీల్‌చైర్‌కు పరిమితమైన కేటగిరీ కింద 1,003 మంది పింఛన్‌లు పొందుతున్నారు. గత వైసీపీ హయాంలో ఈ రెండు కేటగిరీల కింద ఎక్కువగా బోగస్‌లు, అనర్హులు చేరారు. ఈ విషయమై ప్రజాప్రభుత్వానికి ఫిర్యాదులు అందాయి. దీంతో వీటిపై విచారణ చేయించింది. మంచాన పడి, వీల్‌చైర్‌కు పరిమితమై మిగతా 8లో...

18నుంచి విద్యార్థులకు దివ్యాంగ నిర్ధారణ పరీక్షలు

ఒంగోలు విద్య, ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలోని దివ్యాంగ విద్యార్థులకు ఈనెల 18నుంచి నియోజకవర్గ స్థాయిలో దివ్యాంగ నిర్ధారణ శిబిరాలు నిర్వహించనున్నట్లు డీఈవో కిరణ్‌కుమార్ తెలిపారు. 18న సంతనూతలపాడు, 18న వైపాలెం, 20న దర్శి, 21న ఒంగోలు, 22న కొండపి, 23న మార్కాపురం, 25న గిద్దలూరు, 26న కనిగిరిలో ఈ శిబిరాలు జరుగుతాయని తెలిపారు. ప్రభుత్వ, జిల్లా పరిషత్, మునిసిపల్, ప్రభుత్వ ఎయిడెడ్ పాఠశాలల్లో చదువుతున్న 6నుంచి 17 సంవత్సరాలు ఉన్న దివ్యాంగ విద్యార్థులు ఈ శిబిరాలకు హాజరయ్యేందుకు అర్హులని పేర్కొన్నారు. స్పెషలిస్టు డాక్టర్లు విద్యార్థులకు సంబంధించిన వైకల్యాన్ని నిర్ధారణ చేసి వివిధ రకాల ఉపకరణాలు అందించనున్నట్లు తెలిపారు.

నటుడు గిరిబాబుకు నాగభైరవ ఆత్మీయ పురస్కారం

ఒంగోలు కలెక్టరేట్, ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి) : సినీనటుడు, నిర్మాత, దర్శకుడు గిరిబాబుకు ఈనెల 17వ తేదీన నాగభైరవ ఆత్మీయ పురస్కారాన్ని ప్రదానం చేస్తున్నట్లు సాహిత్య పీఠం అధ్యక్షుడు నాగభైరవ ఆదినారాయణ ఒక ప్రకటనలో తెలిపారు. ఒంగోలులోని రెడ్ క్రాస్‌భవన్‌లో జరిగే ఈ ప్రధానోత్సవ సభలో కేకేఎల్ స్వామికి నాగభైరవ కళా పురస్కారాన్ని ప్రదానం చేయనున్నట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో నల్లూరి వెంకటేశ్వర్లు(అన్న), మాజీ ఎమ్మెల్యే ఈదర హరిబాబు, వీరవల్లి సుబ్బారావు, బెజవాడ వెంకట్రావు, కుర్రా ప్రసాద్‌లు పాల్గొంటారన్నారు. కళా సాహిత్య అభిమానులందరూ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఆయన కోరారు.

సురక్షిత భవనాల్లోనే పిల్లలకు తరగతులు

ఒంగోలువిద్య, ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి) : పాఠశాలల్లో సురక్షితంగా ఉన్న భవనాల్లోనే విద్యార్థులకు తరగతులు నిర్వహించాలని పాఠశాల విద్యాశాఖ ఆదేశాలు జారీ చేసింది. సురక్షితంగా లేని భవనాల్లో తరగతులు నిర్వహించరాదని ఆదేశించింది. ప్రస్తుతం భారీ నుంచి అతిభారీ వర్షాలు కురుస్తున్నందున పైకప్పు పెచ్చులు ఊడిపడటం, నీళ్లు కురుస్తూ ప్రమాదకరంగా ఉన్న గదుల్లో విద్యార్థులకు తరగతులు నిర్వహించవద్దన్నారు. బడిభవనాలు భద్రంగా ఉన్నట్లు ఇంజనీరింగ్ అధికారుల నుంచి ధ్రువీకరణ పత్రాలు తీసుకోవాలని చెప్పారు. సురక్షితంగా లేని భవనాలకు మరమ్మతులు నిర్వహించాలని, మరీ ప్రమాదకరంగా ఉన్న భవనాలనుకూల్చివేయాలని ఆదేశించారు. ప్రమాదకరంగా ఉన్న భవనాలను కూల్చివేసి ఆ స్థలాన్ని క్రీడలు, వృత్తి నైపుణ్యం, మధ్యాహ్నభోజన పథకానికి ఇతర అవసరాలకు వినియోగించుకోవచ్చని సూచించారు. శిథిలావస్థకు చేరిన గోడలకు సమీపంలోకి విద్యార్థులు వెళ్లకుండా చూడాలని, పాఠశాల భవనంలో కూల్చివేతలపై క్షేత్రస్థాయి సిబ్బంది పురోగతిని క్రమం తప్పకుండా పర్యవేక్షించాలన్నారు.

గ్యాస్ సిలిండర్ పేలి ఇరువురికి గాయాలు

ఒంగోలు క్రైం, ఆగస్టు14(ఆంధ్రజ్యోతి): ప్రమాదవశాత్తు గ్యాస్ సిలిండర్ పేలి ఇరువురికి గాయాలైన ఘటన ఒంగోలు నగరం సత్యనారాయణపురంలోని విజేత ఆసుపత్రి సమీపంలో జరిగింది. గురువారం ఉదయం మేకపాటి శిరీష ఇంట్లో టీ పెడుతుండగా గ్యాస్ లీకైంది. ఆమె బయిట నుంచి ఇంట్లోకి వచ్చి లైట్ వేసేందుకు స్విచ్ వేయడంతో మంటలు చెలరేగి శిరీషకు అంటుకున్నాయి. దీంతో పెద్దగా కేకలు పెడుతూ ఇంట్లో ఉన్న శిరీష మామ మేకపాటి మాల్యాద్రి దగ్గరకు వెళ్ళింది. మంటలను ఆర్పే ప్రయత్నంలో ఆయన గాయపడ్డాడు. తీవ్రంగా గాయపడిన శిరీషను చికిత్స నిమిత్తం గుంటూరుకు తరలించారు. మాల్యాద్రి ఒంగోలులోని ప్రైవేటు వైద్యశాలలో చికిత్స పొందుతున్నాడు.

లారీని ఢీకొట్టిన ఆర్టీసీ బస్సు

● 9మందికి గాయాలు

ఒంగోలు క్రైం, ఆగస్టు14(ఆంధ్రజ్యోతి): ముందు వెళుతున్న లారీ సడన్ బ్రేక్ వేయడంతో వెనుక ఉన్న ఆర్టీసీ బస్సు ఢీకొంది. దీంతో బస్సులో ప్రయాణిస్తున్న 9 మంది ప్రయాణికులకు గాయాలయ్యాయి. ఈ సంఘటన ఒంగోలు శివారుప్రాంతంలోని త్రోవగుంట సమీపంలో గురువారం తెల్లవారుజామున జరిగింది. విజయవాడ నుంచి కనిగిరి వెళుతున్న ఆర్టీసీ బస్సుకు ఈ ప్రమాదం జరగడంతో అందులో ప్రయాణిస్తున్న తొమ్మిది మందికి స్వల్పగాయాలయ్యాయి. ఈ మేరకు ఒంగోలు తాలుకా పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

రైతన్నలకు న్యాయం చేసే ప్రభుత్వం టీడీపీనే

త్వరలోనే వెలిగొండ పూర్తి, మార్కాపురం జిల్లా ఏర్పాటు

ఎమ్మెల్యే నారాయణరెడ్డి


ట్రాక్టర్ నడుపుతున్న ఎమ్మెల్యే నారాయణరెడ్డి

మార్కాపురం, ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి) : రైతులకు న్యాయం చేసేది ప్రజా ప్రభుత్వం మాత్రమేనని ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి అన్నారు. అన్నదాత సుఖీభవ పథకం రాష్ట్ర ప్రభుత్వం అమలు చేసిన నేపథ్యంలో కృతజ్ఞతగా నియోజకవర్గంలోని అన్ని మండలాలకు చెందిన రైతన్నలు గురువారం పట్టణంలో ట్రాక్టర్‌లతో ర్యాలీ నిర్వహించారు. స్థానిక అల్లూరి పోలేరమ్మ దేవస్థానం నుంచి సాయంత్రం 4.00 గంటలకు ట్రాక్టర్‌ల ర్యాలీని ఎమ్మెల్యే కందుల ప్రారంభించారు. అక్కడ నుంచి కరెంట్ ఆఫీసు, ఆర్టీసీ బస్టాండ్, గడియార స్తంభం, సప్తగిరి సెంటర్‌ల మీదుగా వ్యవసాయ మార్కెట్ కమిటీ వరకు ట్రాక్టర్‌ల ర్యాలీ జరిగింది. సుమారు 500కు పైగా ట్రాక్టర్‌లు ర్యాలీలో పాల్గొన్నాయి. ఏఎంసీ కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు ముఖ్యమంత్రి చంద్రబాబు అన్ని పథకాలను అమలు చేస్తున్నారన్నారు. సూపర్‌సిక్స్ పథకాల్లో ఒకటైన అన్నదాన సుఖీభవ ద్వారా రైతుల బ్యాంకు ఖాతాల్లో నగదు జమ చేశారన్నారు. రాష్ట్ర ఆర్థిక పరిస్థితి సహకరించకపోయినా ప్రజల సంక్షేమం కోసం ఇచ్చిన హామీలన్నింటినీ అమలు చేస్తున్నా ప్రతిపక్ష నాయకులు కడుపు మంటతో విమర్శలు చేయడం హేయమన్నారు. వెలిగొండ ప్రాజెక్టును పూర్తి చేయకుండానే జగన్‌రెడ్డి జాతికి అంకితం చేసి ప్రజలను మోసం చేశారన్నారు. ప్రజా ప్రభుత్వం అధికారంలోకి రాగానే వెలిగొండ ప్రాజెక్టుపై ప్రత్యేక దృష్టి సారించడంతో పనులు చురుగ్గా జరుగుతున్నాయన్నారు. త్వరలోనే ప్రాజెక్టును పూర్తిచేసి ఈ ప్రాంత ప్రజల నీటి కష్టాన్ని ముఖ్యమంత్రి చంద్రబాబు తీర్చుతారని చెప్పారు. మార్కాపురం జిల్లా విషయాన్ని గత వైసీపీ నేతలు విస్మరించారన్నారు. చంద్రబాబు ఇచ్చిన హామీ మేరకు మార్కాపురాన్ని జిల్లాగా ప్రకటించి ఈ ప్రాంత ప్రజల ఆకాంక్షను నెరవేర్చుతున్నారన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ వాణిజ్య విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వక్కలగడ్డ మల్లికార్జున్, పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి తాళ్లపల్లి సత్యనారాయణ, మార్కాపురం, పొదిలి ఏఎంసీ చైర్మన్‌లు మాలపాటి వెంకటరెడ్డి, డాక్టర్ ఇమామ్ సాహెబ్, మార్కాపురం, మిట్టమీదిపల్లి సొసైటీ ప్రెసిడెంట్లు జవ్వాజి రామాంజులరెడ్డి, గొలమారు నాసర్‌రెడ్డి, మార్కాపురం పట్టణ, మండల, తర్లుపాడు మండలాల పార్టీ అధ్యక్షులు పఠాన్ ఇబ్రహీంఖాన్, కాకర్ల శ్రీనివాసులు, ఉడుముల చిన్నపరెడ్డి పాల్గొన్నారు.

రైతు సంక్షేమం టీడీపీతోనే

వైపాలెం ఇన్‌చార్జి ఎరిక్షన్‌బాబు

ఎర్రగొండపాలెం : రైతుల సంక్షేమం కోరేది టీడీపీ ప్రభుత్వమని, వారికిచ్చిన మాటను అన్నదాత సుఖీభవ అమలుతో ముఖ్యమంత్రి చంద్రబాబు నిలుపుకున్నారని టీడీపీ వైపాలెం ఇన్‌చార్జి గూడూరి ఎరిక్షన్‌బాబు అన్నారు. నియోజకవర్గంలోని రైతులు ట్రాక్టర్లతో ఎర్రగొండపాలెంలో బుధవారం అన్నదాత సుఖీ భవ కృతజ్ఞతా ర్యాలీని నిర్వహించారు. పార్టీ కార్యాలయం నుంచి ప్రారంభమైన ర్యాలీ ఏఎంసీ కార్యాలయం వరకు సాగింది. ఈ సందర్భంగా జరిగిన సభలో ఎరిక్షన్‌బాబు మాట్లాడుతూ రైతులకు తొలివిడత పెట్టుబడి సాయాన్ని ముఖ్యమంత్రి చంద్రబాబు అందించారన్నారు. 2014 నుంచి 2019 వరకు రైతులకు సబ్సిడీపై 24 వేల ట్రాక్టర్లను సంపిణీ చేసిన ఘనత టీడీపీదేనన్నారు. 90 శాతం సబ్సిడీపై 7 డ్రోన్ స్ప్రేయర్లను ఇటీవల పంపిణీ చేసినట్లు తెలిపారు. పులివెందులలో జరిగిన ఎన్నికల్లో విజయకేతనం ఎగురవేసిన విధంగా స్థానిక సంస్థల ఎన్నికల్లో పచ్చ టీడీపీ ప్రభంజనం సృష్టించాలని కోరారు. ఏఎంసీ చైర్మన్ చేకూరి సుబ్బారావు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో టీడీపీ మండల పార్టీ అధ్యక్షుడు ప్రసాదరావు, యేర్వ మల్లికార్జునరెడ్డి, మేకల వళరాజు, ఎం.శ్రీనివాసరెడ్డి, టీడీపీ ద్వితీయ శ్రేణి నాయకులు శనగా నారాయణరెడ్డి, చిట్యాల వెంగళరెడ్డి, వేగినాటి శ్రీను, కాకర్లకోటయ్య, కంచర్ల సత్యనారాయణగౌడ్, షేక్ మాబు, జడి లక్ష్మయ్య, సొసైటి అధ్యక్షులు, రైతునాయకులు, రైతులు పాల్గొన్నారు.


ట్రాక్టర్ల ర్యాలీలో పాల్గొన్న ఎరిక్షన్‌బాబు

నేటి నుంచి ఒంగోలులో పుస్తక మహోత్సవం

ఒంగోలు కలెక్టరేట్, ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి) : ఒంగోలులోని పీవీఆర్ బాలుర పాఠశాల ఆవరణలో శుక్రవారం నుంచి ఈనెల 24వ తేదీ వరకు ఒంగోలు పుస్తక మహోత్సవాన్ని నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. విజయవాడ బుక్‌ఫెస్ట్ సొసైటీ, ఆంధ్రప్రదేశ్ సాంస్కృతికశాఖ, ఆంధ్రప్రదేశ్ గంటలయ పరిషత్ ఆధ్వర్యంలో ఈ ప్రదర్శన జరుగుతుందన్నారు. స్థానిక పీవీఆర్ బాలురపాఠశాల ఆవరణలో గురువారం సాయంత్రం ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఎమెస్కో ప్రచురణల ప్రతినిధి విజయ కుమార్ మాట్లాడుతూ మారుతున్న పరిస్థితుల నేపథ్యంలో అందరూ పుస్తక పఠనానికి దూరమవుతున్నారన్నారు. సెల్‌ఫోన్లకు, టీవలకు బానిసలుగా మారుతూ సృజనాత్మకతను కోల్పోతున్నారని తెలిపారు. ఈపరిణామాలు భవిష్యత్‌లో మరింత ప్రమాదకరంగా మారే పరిస్థితి వచ్చిందన్నారు. దీనిని నిలువరించేందుకు ప్రతి ఒక్క తల్లిదండ్రి విద్యార్థులను పుస్తకాలకు మరింత చేరువ చేసేందుకు కృషిచేయాలని కోరారు. అందులో భాగంగానే అమ్మకాలతో సంబంధం లేకుండా పిల్లలకు పుస్తకాలను మరింత చేరువ చేసేందుకు ఈ పుస్తకమహోత్సవాన్ని నిర్వహిస్తున్నట్లు ఆయనతెలిపారు. విశాలాంధ్ర బుక్ హౌస్‌మేనేజర్ మనోహర్ నాయుడు మాట్లాడుతూ ఈపుస్తకమహోత్సవాన్ని రాష్ట్రమంత్రి డాక్టర్ డీఎస్‌బీవీ స్వామి, ఎంపీ మాగుంట శ్రీనివాసుల రెడ్డి, ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్, కలెక్టర్ తమీమ్ అన్సారియా, నగర కమిషనర్ వెంకటేశ్వరరావులు ప్రారంభిస్తారన్నారు. పుస్తక మహోత్సవం ప్రతిరోజూ మధ్యాహ్నం రెండు గంటల నుంచి రాత్రి 9 గంటల వరకు కొనసాగుతుందని చెప్పారు. ప్రజాశక్తి బుక్‌హౌస్ జనరల్ మేనేజర్ లక్ష్మయ్య మాట్లాడుతూ పుస్తక మహోత్సవం సందర్భంగా ప్రతిరోజూ సాహితీ సభలు, పుస్తక పరిచయాలు, సైన్స్ ఆవిష్కరణలు, సాంస్కృతిక కార్యక్రమాలు, చిన్నారుల కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. జేవీవీ నాయకులు సీపీ ప్రసాద్, సాహితీవేత్త పొన్నూరు శ్రీనివాసులు, జయప్రకాష్, వెంకటేష్ తదితరులు ఉన్నారు.


మాట్లాడుతున్న విజయ్‌కుమార్

ఆపదలో ఉన్న వారికి సాయం చేయడమే సీఎం లక్ష్యం

● మంత్రి డోలా శ్రీబాల వీరాంజనేయస్వామి

● 121 మందికి 60.77 లక్షల సీఎంఆర్‌ఎఫ్ చెక్కుల అందజేత


సీఎంఆర్‌ఎఫ్ చెక్కు అందజేస్తున్న మంత్రి స్వామి

టంగుటూరు (కొండపి), ఆగస్టు14 (ఆంధ్రజ్యోతి): అనారోగ్యంతో ఆపదలో ఉన్నవారికి సాయం చేయడమే సీఎం చంద్రబాబు నేతృత్వంలోని కూటమి ప్రభుత్వ లక్ష్యమని రాష్ట్ర సాంఘిక సంక్షేమశాఖామంత్రి డోలా శ్రీబాలవీరాంజనేయస్వామి అన్నారు. గురువారం ఉదయం తూర్పునాయుడుపాలెంలోని తన క్యాంపు కార్యాలయంలో మంత్రి స్వామి నియోజకవర్గంలోని వివిధ గ్రామాలకు చెందిన 121 మంది అనారోగ్య బాధితులకు రూ.60.77 లక్షల సీఎంఆర్‌ఎఫ్ చెక్కులతోపాటు సీఎం చంద్రబాబు బాధితులు త్వరగా కోలుకోవాలని ఆకాంక్షిస్తూ పంపిన లేఖను కూడా అందజేశారు. మంత్రి మీడియాతో మాట్లాడుతూ ఇప్పటి వరకు నియోజవకర్గంలో 631 మందికి రూ.5.73 కోట్లు ఆర్థిక సాయం అందించామన్నారు.

● డ్రోన్ పంపిణీ....

జరుగుమల్లి మండలంలోని చతుకుపాడు గ్రామానికి చెందిన తారకరామ సి.హెచ్.సి గ్రూపునకు సబ్సిడీపై మంజూరయిన కిసాన్ డ్రోన్‌ను మంత్రి స్వామి పంపిణీ చేశారు. యూనిట్ విలువ రూ.9.80 లక్షలు కాగా ఇందులో రూ.7.84 లక్షలు సబ్సిడీ పోను గ్రూప్‌వాటాగా రైతులు రూ.1.96 లక్షలు చెల్లించారని మంత్రికి అధికారులు వివరించారు.

మట్టి గణపతిని పూజిద్దాం

టంగుటూరు (కొండపి), ఆగస్టు14 (ఆంధ్రజ్యోతి): పర్యావరణ హిత మట్టిగణపతిని పూజిద్దామని మంత్రి డోలా శ్రీబాలవీరాంజనేయస్వామి పిలుపునిచ్చారు. గురువారం తూర్పునాయుడుపాలెంలోని తన క్యాంపు కార్యాలయంలో మంత్రి వాలంటీర్ ఎన్విరాన్‌మెంట్ ఆర్గనైజేషన్ ప్రచురించిన 'మట్టి గణపతే - మహా గణపతి' వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరించారు.

గురుకుల విద్యార్థినికి ప్రోత్సాహంగా రూ.లక్ష అందజేసిన మంత్రి

కొండపి(సింగరాయకొండ), ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వం కష్టపడి చదువుకునే పేద విద్యార్థులకు అన్ని సౌకర్యాలు కల్పిస్తున్నదని మంత్రి డోలా శ్రీబాలవీరాంజనేయ స్వామి అన్నారు. సింగరాయకొండ పాఠశాల ఇంటర్ విద్యార్థి సూరపోగు డెలీషియా యూఎస్‌ఏలో కెన్నడీ లుగర్ యూత్ ఎక్స్ఛేంజ్ అండ్ స్టడీ పథకం కింద ఉన్నత విద్య అభ్యసించడానికి అరుదైన అవకాశం పొందగా ఆమెకు మంత్రి స్వామి ప్రోత్సాహంగా లక్ష రూపాయల చెక్‌ను గురువారం పాఠశాల ఆవరణలో జరిగిన కార్యక్రమంలో అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రోత్సాహకాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో గురుకుల సంస్థ అదనపు కార్యదర్శి సునీల్‌రాజ్‌కుమార్, అకడమిక్ సంయుక్త కార్యదర్శి సంజీవరావు, డీసీవో, కళాశాల ప్రిన్సిపాల్ పాల్గొన్నారు.

తహసీల్దార్ లేక ప్రజలకు అవస్థలు

రిటైర్డ్ అయి 15 రోజులైనా మరొకరిని నియమించని అధికారులు



పెద్దారవీడు తహసీల్దార్ కార్యాలయం

పెద్దారవీడు, ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి) : పేరుకు మాత్రమే పెద్దారవీడు.. ఇక్కడ ప్రజలను సమస్యలు వెంటాడుతూనే ఉంటాయి. ఒక వైపు ప్రకృతి చిన్నచూపు చూస్తుండగా మరో వైపు ఉన్నతాధికారులు సైతం పట్టించుకోవడం లేదు. తహసీల్దార్ పోస్టు ఖాళీ అయి 15 రోజులైనా నేటికీ ఉన్నతాధికారులు భర్తీ చేయలేదు. దీంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

సాధారణంగా జరిగే తీరు ఇలా

మండల స్థాయి ఉద్యోగుల పోస్టులు ఉద్యోగ విరమణ, లేదా బదిలీతో ఖాళీ అయితే పక్క మండలం వారికో లేక అదే మండలంలో అర్హత ఉన్న కింది స్థాయి ఉద్యోగికో పూర్తి అదనపు బాధ్యతలు అప్పగిస్తారు. కానీ పెద్దారవీడు మండల తహసీల్దార్ పోస్టు 15 రోజులుగా ఖాళీగా ఉంది. ఇక్కడ తహసీల్దార్‌గా ఉన్న పులి శైలేంద్రకుమార్ ఆగస్టు 31న ఉద్యోగ విరమణ చేశారు. అప్పటి నుంచి ఇప్పటి వరకూ పెద్దారవీడు తహసీల్దార్‌గా ఎవరినీ నియమించలేదు, ఉన్న సిబ్బందికీ బాధ్యతలను అప్పగించలేదు.

ప్రజలకు తప్పని తిప్పలు

తహసీల్దార్‌గా పులి శైలేంద్రకుమార్ ఉద్యోగ విరమణ చేసి 15 రోజులైనా ఎవరినీ నియమించక పోవడంతో ప్రజలకు తిప్పలు తప్పడం లేదు. ఆయన ఉద్యోగ విరమణ చేసే వారం ముందే జిల్లా ఉన్నతాధికారులు పాస్ పుస్తకాలపై డిజిటల్ సంతకం చేసే అవకాశాన్ని నిలిపివేశారు. అంతేకాక ఉద్యోగ విరమణ చేసినప్పటి నుంచి మరో అధికారిని నియమించి డిజిటల్ సంతకం చేసే అవకాశం లేకపోవడంతో సర్టిఫికెట్ల జారీ నిలిచిపోయింది. అందులో నేటి వరకూ కుల ధ్రువీకరణ పత్రాలు 100, కుటుంబ సభ్యులుగా ధ్రువీకరణ పత్రాలు 15, జనన, మరణ ధ్రువపత్రాలు 70, ఓబీసీ 8, ఈబీసీ 6, వ్యవసాయ ఆదాయ ధ్రువపత్రాలు 6 నిలిచిపోయాయి. కొత్త తహసీల్దార్ ఎప్పుడు వస్తారో, వాటిని ఎప్పుడు జారీ చేస్తారో అని ప్రజలు కార్యాలయం చుట్టూ తిరుగుతున్నారు.



కాలు జారితే అంతే సంగతులు..

పక్క ఫొటోలో కనిపిస్తున్న బురద రోడ్డు పెద్దారవీడులోని మండల కాంప్లెక్స్ ముఖ ద్వారం వద్ద ఉంది. ఇటీవల కురుస్తున్న వర్షాలకు రోడ్డు ఇంత దారుణంగా తయారైంది. మండల స్థాయి అధికారులు, ప్రజాప్రతినిధులు ఆ రోడ్డు నుంచే రాకపోకలు సాగిస్తున్నా దానిని బాగు చేసేందుకు కనీస చర్యలు తీసుకోకపోవడం చర్చనీయాంశంగా మారింది. ప్రతి ఒక్కరూ మాకెందుకులే అనుకుంటూ రాకపోకలు సాగిస్తున్నారే కానీ పట్టించుకున్న వారే లేరు. దీంతో కార్యాలయాలకు వివిధ పనుల మీద వచ్చే సామాన్య ప్రజలు ముప్పుతిప్పలు పడుతున్నారు.

\- పెద్దారవీడు, ఆంధ్రజ్యోతి

స్వాతంత్ర్య వేడుకలకు సర్వం సిద్ధం

అవీఇవీ

ముస్తాబైన పోలీసు పరేడ్ గ్రౌండ్

జాతీయ పతాకాన్ని ఆవిష్కరించనున్న మంత్రి స్వామి

400 మందికి ప్రశంసాపత్రాలు


ఒంగోలులోని పోలీస్ పరేడ్ గ్రౌండ్‌లో చురుగ్గా సాగుతున్న ఏర్పాట్లు

ఒంగోలు కలెక్టరేట్, ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి) : స్వాతంత్ర్య దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించేందుకు భారీ ఏర్పాట్లు జరిగాయి. జిల్లా స్థాయి వేడుకలకు ఒంగోలులోని పోలీసు పరేడ్ గ్రౌండ్ ముస్తాబైంది. రాష్ట్ర సాంఘిక సంక్షేమశాఖ మంత్రి డాక్టర్ డోలా శ్రీ బాలవీరాంజనేయస్వామి శుక్రవారం ఉదయం 9.00 గంటలకు జాతీయ పతాకాన్ని ఆవిష్కరించనున్నారు. అనంతరం పోలీసుల నుంచి గౌరవ వందనం స్వీకరించనున్నారు. ఈ సందర్భంగా అక్కడ పలు కార్యక్రమాలను ఏర్పాటు చేస్తున్నారు. జిల్లావ్యాప్తంగా 400 మందికిపైగా అధికారులు, ఉద్యోగులు, సిబ్బందితోపాటు వివిధ రంగాల్లోని ప్రముఖులకు ప్రశంసాపత్రాలను అందజేయనున్నారు. ప్రభుత్వ పథకాలను వివరిస్తూ స్టాల్స్, శకటాల ప్రదర్శన ఉంటుంది. మరోవైపు విద్యాశాఖ ఆధ్వర్యంలో విద్యార్థులతో సాంస్కృతిక ప్రదర్శనలకు ఏర్పాట్లు చేశారు. ఈ సందర్భంగా స్వాతంత్ర్య సమరయోధులను సత్కరించనున్నారు. వేడుకలకు హాజరయ్యే ప్రజాప్రతినిధులు, అధికారులు, వివిధ రంగాల ప్రముఖుల కోసం ప్రత్యేకంగా సీటింగ్‌ను ఏర్పాటు చేశారు. తిలకించేందుకు తరలి వచ్చే ప్రజలు ఎలాంటి ఇబ్బందులు పడకుండా చర్యలు తీసుకున్నారు. స్వాతంత్ర్య వేడుకలను పురస్కరించుకొని జిల్లా పరిపాలన భవన్ (కలెక్టరేట్)ను విద్యుత్‌దీపాలతో అలంకరించారు. వర్షం కురిస్తే ప్రత్యామ్నాయంగా పోలీసు పరేడ్ గ్రౌండ్ పక్కనే ఉన్న కల్యాణ మండపంలో వేడుకలు నిర్వహించనున్నారు.

కొండపి నియోజకవర్గానికి వెలిగొండ నీళ్లు

(7వపేజీ తరువాయి)

మాసాలుగా ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడుల దృష్టికి ఈ విషయాలను మంత్రి స్వామి తీసుకెళ్లారు. లిఖిత పూర్వకంగా వినతులు అందజేసి వివిధ స్థాయిల్లో అధికారులు తగు ప్రతిపాదనలు సిద్ధం చేసేలా కృషి చేశారు.

వెలిగొండ నుంచి 1.60 టీఎంసీల నీరు

ఈనేపథ్యంలో 0.60 టీఎంసీల సాగర్ జలాలను ఒంగోలు బ్రాంచి కాలువ నుంచి ముసి ద్వారా కొండపి నియోజకవర్గానికి ఇచ్చేలా ప్రభుత్వం ఇటీవల ఉత్తర్వులు జారీ చేసింది. తాజాగా వెలిగొండ జలాలను కూడా సరఫరా చేసేందుకు అనుమతి ఇస్తూ గురువారం ఉత్తర్వులు వెలువడ్డాయి. వెలిగొండ ప్రాజెక్టు తూర్పు ప్రధాన కాలువ నీటిని అవకాశం ఉంటే నేరుగా ప్రధాన కాలువ... కాకుంటే దాని బ్రాంచికాలువ ద్వారా పాలేరు, మునిలకు ఇచ్చేందుకు అవసరమైన చర్యలు చేపట్టాలని ప్రాజెక్టు అధికారులను ఆ ఉత్తర్వుల్లో ప్రభుత్వం సూచించింది. సుమారు 1.60 టీఎంసీల నీరు అలా వెలిగొండ నుంచి ఆ నదులకు ఇస్తారని సమాచారం. ఈ నీరు తూర్పు ప్రధాన కాలువ ద్వారా పాలేరు నదిలోకి వచ్చే క్రమంలో కనిగిరి నియోజకవర్గంలోని కొన్ని ప్రాంతాల్లో చెరువులకు కూడా మేలు జరిగే అవకాశం ఉంది.

సంగమేశ్వరం రిజర్వాయర్‌కు నీటి గ్యారెంటీ

కొండపి నియోజకవర్గానికి వెలిగొండ జలాలు ఇవ్వడం వలన పాలేరుపై నిర్మాణంలో ఉన్న సంగమేశ్వర రిజర్వాయర్‌కు నీటి గ్యారంటీతోపాటు దిగువన ఉన్న పీబీ ఆనకట్ట వరకు నీటి లభ్యత ఉండనుంది. పాలేరు, మునిల ఆధారంగా ఉన్న ఎత్తిపోతల పథకాల ద్వారా అనేక గ్రామాలకు నీరు అందుతుంది. కాగా ఇటు వెలిగొండ, అటు సాగర్ కాలువల నుంచి కొండపి నియోజకవర్గానికి నీటి హక్కు కలిగేలా ప్రభుత్వం నుంచి ఉత్తర్వులు తీసుకురావడం తనకు ఎంతో సంతృప్తిగా ఉందని ఈ సందర్భంగా మంత్రి డాక్టర్ స్వామి పేర్కొన్నారు. అందుకు సహకరించిన సీఎం చంద్రబాబు నాయుడు, జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడుకు నియోజకవర్గ ప్రజల తరఫున ఆయన కృతజ్ఞతలు తెలిపారు.

'స్త్రీ'కారం

(7వపేజీ తరువాయి)

ఏర్పాటు చేసిన కార్యక్రమాన్ని మంత్రి డాక్టర్ డోలా శ్రీబాల వీరాంజనేయ స్వామితోపాటు జిల్లాలోని ప్రజా ప్రతినిధులు, కూటమి నేతలు పాల్గొని ప్రారంభించనున్నారు. అనంతరం జిల్లాలోని వివిధ ప్రభుత్వ శాఖల మహిళా ఉన్నతాధికారులు ప్రయాణించేలా ఏర్పాట్లు చేశారు. కలెక్టర్‌తోపాటు, మేయర్, ఆర్డీవో, డీటీసీవో, ఇతర జిల్లాస్థాయి మహిళ అధికారులు, కొద్దిదూరం ఆర్టీసీలో ప్రయాణించనున్నారు.

అనర్హులకు చెక్

(7వపేజీ తరువాయి)

పింఛన్‌లు పొందుతున్న వారి ఇళ్లకు ప్రత్యేక బృందాలను పంపింది. ఈ పరిశీలనలో అనేక మంది అనర్హులుగా తేలారు. కొద్దిపాటి వికలత్వం ఉన్న వారు కూడా మంచంలో ఉన్నట్లుగా చూపి నెలవారీ రూ.15 వేలు పింఛన్ పొందుతుండటాన్ని వైద్య బృందాలు గుర్తించాయి. కొంతమంది లబ్ధిదారులు వైద్య బృందాలు ఇళ్లకు వెళ్లిన సమయంలో పూర్తిగా ముఖం చాటేశారు. జిల్లాలో దివ్యాంగ పింఛన్లు పొందుతున్న వారు 32,875 మంది ఉండగా వీరిలో ఇప్పటి వరకు 25 వేల మందిని తిరిగి వైద్యశాలకు పిలిపించి పరీక్షలు నిర్వహించారు.

40శాతం మేర వికలత్వం ఉంటేనే పింఛన్

దివ్యాంగులలో 40 శాతం మేర వికలత్వం ఉంటేనే పింఛన్ పొందేందుకు అర్హులు. అయితే 10 శాతం కూడా లేని వారు సదరమ్ ద్వారా గతంలో 80, 90 శాతం వైకల్యం ఉన్నట్లు సర్టిఫికెట్లు పొంది నెలవారీ రూ.6 వేల పింఛన్ పొందుతున్నారు. తిరిగి పరీక్షలు నిర్వహించగా అనేక మంది అనర్హులు, బోగస్‌లు ఉన్నట్లు తేలారు. ఇలా ఈ రెండు కేటగిరీల్లో అనర్హులుగా గుర్తించిన వారికి ప్రభుత్వం గురువారం నుంచి సచివాలయాల ద్వారా నోటీసులు జారీ చేస్తోంది. వారి నుంచి అభ్యంతరాలను స్వీకరించే ప్రక్రియను ఈ నెల 25వ తేదీలోపు పూర్తి చేయాలని అన్ని సచివాలయాలకు ప్రభుత్వం నుంచి ఆదేశాలు జారీ అయ్యాయి.

అర్హులకు మరో కేటగిరీ కింద పింఛన్

వైకల్యం 40 శాతం కంటే ఎక్కువగా ఉండి తీవ్ర అనారోగ్యంతో మంచాన పడిన వారి రూ.15వేల పింఛన్‌ను ప్రభుత్వం రద్దు చేయదు. మంచంలో లేకుండా 40 శాతం కంటే ఎక్కువ వైకల్యం ఉన్నట్లు వైద్య బృందం పరిశీలనలో తేలితే వారిని రూ.15 వేల కేటగిరీ నుంచి దివ్యాంగుల కేటగిరికీ మార్చి రూ.6 వేల పింఛన్‌ను వచ్చే నెల నుంచి అందజేయనున్నారు. 40 శాతం కంటే తక్కువ వైకల్యం ఉన్న వారి పింఛన్ మాత్రం రద్దు చేయనున్నారు. దీన్ని పొందుతున్న వారి వయసు 60 సంవత్సరాలు దాటి ఉంటే వారిని దివ్యాంగ కోటా నుంచి తొలగించి వృద్ధాప్య పింఛన్ కింద రూ.4 వేలను నెలవారీ అందజేయనున్నారు.

అన్ని అర్హతలూ ఉండి రద్దయితే పునఃపరిశీలన

గత వైసీపీ పాలనలో ఆ పార్టీ కార్యకర్తలకు, గ్రామాల్లోని చోటా నాయకులకు అర్హత లేకున్నా పింఛన్లను మంజూరు చేశారు. సదరమ్ సర్టిఫికెట్ల జారీ కూడా అవినీతిమయంగా సాగింది. ప్రజాప్రభుత్వం అధికారంలోకి వచ్చాక అర్హులకే పింఛన్ ఠంచన్‌గా అందించడంతోపాటు అనర్హుల ఏరివేత దిశగా చర్యలు చేపట్టింది. అన్ని అర్హతలు ఉండి కూడా పొరపాటున పింఛన్ రద్దయితే వెంటనే సంబంధిత ఎంపీడీవో, మునిసిపల్ కమిషనర్‌కు ఫిర్యాదు చేస్తే వారికి తిరిగి ప్రభుత్వ ఆసుపత్రిలో అర్హత నిర్ధారణ పరీక్షలు చేయిస్తారు. అర్హతలు ఉంటే పింఛన్‌ను పునరుద్ధరిస్తారు.



తిరంగా ర్యాలీలో పాల్గొన్న సబ్ కలెక్టర్, అధికారులు

ఇనుమడించిన స్వాతంత్ర్య స్ఫూర్తి

మార్కాపురంలో స్వాతంత్ర్య స్ఫూర్తి, దేశభక్తి ఇనుమడించింది. విద్యార్థులు 100 అడుగుల జాతీయ జెండాతో తిరంగా ర్యాలీ నిర్వహించారు. దీక్షా యూత్ సర్వీస్ ఆర్గనైజేషన్ అధ్యక్షుడు శ్రీధర సాయి సుబ్బారావు ఆధ్వర్యంలో గురువారం నిర్వహించిన కార్యక్రమంలో సబ్ కలెక్టర్ వెంకట త్రివినాగ్ మాట్లాడుతూ ఎందరో త్యాగమూర్తుల ఫలితమే దేశానికి స్వాతంత్ర్యం సిద్ధించిందన్నారు. ప్రతి ఒక్కరూ దేశభక్తిని చాటేలా స్వాతంత్ర్య దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించాలని చెప్పారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ నారాయణరావు, డిప్యూటీ డీఈవో శ్రీనివాసులరెడ్డి పాల్గొన్నారు.

-మార్కాపురం వన్‌టౌన్ ఆంధ్రజ్యోతి


100 అడుగుల జాతీయ జెండాతో విద్యార్థులు



● చరిత్రకు గుర్తుగా బ్రిటీష్ భవనం

బ్రిటీష్ కాలంలో దర్శిలో నిర్మించిన పాత కోర్టు భవనం చరిత్రకు గుర్తుగా నిలిచిపోయింది. 117ఏళ్ల క్రితం నిర్మించిన ఈ భవనం గోడలు నేటికీ చెక్కు చెదరలేదు. అక్కడక్కడా పైకప్పు స్వల్పంగా దెబ్బతింది. పట్టణ నడిబొడ్డున 1908లో రంగూన్ టేకుతో ఈ భవనాన్ని నిర్మించారు. బరువైన రాళ్లు, సున్నంతో గోడలను పటిష్టంగా నిర్మించారు. ఈ భవనంలో బ్రిటీష్ హయాంలో అప్పటి అధిపతి పాలించేవాడు. ఆ తర్వాత కోర్టు భవనంగా మారింది. సుదీర్ఘకాలం అనంతరం కోర్టుకు నూతన భవనం నిర్మించటంతో ఆ తర్వాత ఆ భవనంలో కొంతకాలం తహసీల్దార్ కార్యాలయం కొనసాగింది. ఆ తర్వాత నూతన భవనంలోకి తహసీల్దార్ కార్యాలయం మారడంతో ప్రస్తుతంఆ భవనం ఖాళీగా ఉంది. ప్రస్తుతం రెవెన్యూ రికార్డులు ఆ భవనంలోనే భద్రపరిచారు. స్వాతంత్ర దినోత్సవం సందర్భంగా ప్రజలు ఆ భవనాన్ని చూసి బ్రిటీష్ పాలకులను గుర్తు చేసుకుంటున్నారు. -దర్శి, ఆంధ్రజ్యోతి

బ్రిటీష్ పాలనపై గర్జించిన దరిశి చెంచయ్య

తెల్లోడి పాలన వద్దని పోరాడిన ధీరుడు
కనిగిరి చారిత్రక ఘట్టాలకు సజీవ సాక్ష్యంగా నిలిచిన మహనీయుడు

కనిగిరి, ఆగస్టు 14(ఆంధ్రజ్యోతి): ఉద్యమాలకు పురిటిగడ్డ ప్రకాశం జిల్లా.. నేలకోసం.. జనం కోసం.. తెల్లోడి పాలన వద్దని పోరాటం చేసిన వీరుల్లో జిల్లాలోని కనిగిరి ప్రాంతానికి చెందిన దరిశి చెంచయ్య ఒకరు. స్వాతంత్ర్యం సాధించాలంటే బ్రిటీషు వారిని ఎదుర్కొని నిలబడాలని చిన్ననాడే కసిని నింపుకున్న ధీరుడు చెంచయ్య. బ్రిటీష్ పాలకులను గడగడలాడించాలంటే సైనిక తిరుగుబాటు చేయాలన్న ఉద్దేశంతో అమెరికాలో 1913లో స్థాపించిన గదర్ పార్టీలో చేరిన దక్షిణ భారతావనికి చెందిన మొట్టమొదటి ఆంధ్రుడు దరిశి చెంచయ్య. కనిగిరిలో పుట్టి, భారతదేశానికి విముక్తి కావాలని బ్రిటీషువారిపై పోరాడిన యోధుడు.

● ఉన్నత చదువుల కోసం అమెరికాకు పయనం

కనిగిరిలోని కొట్ల బజారులోని ఓసామాన్య వైశ్య కుటుంబంలో దరిశి వెంకట సుబ్బయ్య, లక్ష్మమ్మకు చెంచయ్య 1890లో జన్మించారు. అప్పట్లో కనిగిరిలో నీటి సమస్య తీవ్రంగాఉండేది. ప్రజల దాహార్తి తీర్చే ఒకే ఒక చట్టుబావి కనిగిరి కొండ కింద ఉండేది. ఆ బావిలో నీటిని ప్రజలందరూ వంతులు వారీగా నీరు తీసుకెళ్లేవారని నాటితరం వారు చెప్తుంటారు. బ్రిటీషు కాలంలో తహసీల్దార్, నౌకర్లకు మాత్రం ఆ వంతులు ఉండేవి కావు. వంతుల విషయంలో వైశ్యనాయకులు కొందరు అభ్యంతరం పెట్టగా అప్పట్లో చెంచయ్య తండ్రిని బ్రిటీష్ తహసీల్దార్ అవమానకరంగా దుర్భాషలాడారు. ఆ అవమానభారంతో ఆ పెద్దాయన తన ఇంట్లో మదనపడుతుండడం.. బాలుడైన చెంచయ్య లేతమనస్సుపై చెరగని ముద్రవేసింది. తాను ఇంగ్లీషు చదువుకొని తహసీల్దార్ కావాలని చెంచయ్య 9వ ఏటనే నిర్ణయించుకున్నారు. ప్రాథమిక చదువులు కనిగిరి, ఒంగోలులో చదివి, ఉన్నత చదువులు చదవాలనే సంకల్పంతో అమెరికా వెళ్లారు. అక్కడ యూటా రాష్ట్రంలోని లోగల్ టౌన్ వ్యవసాయ కళాశాలలో చేరారు. ఓవక్క చదువుకుంటూనే సెలవుల్లో పనులు చేసుకుంటూ విద్యాభ్యాసం పూర్తి చేశాడు. ఆ చిన్ననాటి సంఘటన తరచూ ఆయన మనస్సును వేధిస్తూనే ఉంది. దీంతో సంకల్పం కట్టలు తెచ్చుకుంది.


చెంచయ్య నీరుతెచ్చుకునే చట్టుబావి

● గదర్ పార్టీ వ్యవస్థాపకుల్లో ఒకరు

భారతదేశంలో బ్రిటీషువారి పాలనను లేకుండా చేయాలని అందుకోసం ప్రత్యేకంగా ఒక ఉద్యమ పార్టీ స్థాపించాలనే లక్ష్యంతో పంజాబ్, బెంగాల్ లాంటి నగరాలకు చెందిన ముఖ్య సహ విద్యార్థులతో కలసి 1913లో శాన్‌ఫ్రాన్సిస్‌కో నగరంలో గదర్ పార్టీని దరిశి చెంచయ్య స్థాపించారు. ఇందుకు సహవిద్యార్థులు హరదయాళ్ వర్మ, పృథ్వీసింగ్, సోహన్‌సింగ్, జితేందర్ నాథ్ లాంటి ఉద్యమ వీరులతో కలిసి ఉద్యమ బాట పట్టాడు. తెల్ల దొరలను ఎదుర్కోవాలంటే సాయుధ సంగ్రామమే మార్గమని భావించి అమెరికాలోనే తుపాకీ పేల్చడం, గుర్రపు స్వారీ, కత్తిసాము లాంటి విద్యలు నేర్చుకున్నాడు. 1915లో తెల్లదొరలకు వ్యతిరేకంగా దేశంలో స్వాతంత్ర్య ఉద్యమం తీవ్రతరం చేయాలనే ఉద్దేశంతో చెంచయ్య అమెరికా నుంచి సముద్ర మార్గం ద్వారా ఓడలో ఆయుధాలను తీసుకొస్తుండగా ఓ నమ్మకద్రోహి ఇచ్చిన సమాచారంతో బ్యాంకాక్‌లో బ్రిటీషు సైన్యానికి చిక్కారు. ఆనాటి బ్రిటీషు పాలకులు చెంచయ్యను బంధించి లాహోర్, మద్రాసు, బెంగాల్, రంగూన్ ఇలా తదితర జైళ్లల్లో మూడు దఫాలుగా 8 ఏళ్లపాటు ఉంచి చిత్రహింసలకు గురిచేశారు. ఒకసారి బ్రిటీషు ప్రభుత్వం రాజద్రోహం విధించి కాల్చిచంపాలని ఉత్తర్వులు జారీ చేసినపుడు మృత్యువు వరకు వెళ్లి చివరిక్షణంలో బయటపడ్డ అదృష్టవంతుడు చెంచయ్య. స్వాతంత్ర్యం కోసం జరిగిన ప్రతి ఉద్యమంలోనూ ఆయన ప్రముఖ పాత్ర వహించారు.



● మూఢ విశ్వాసాలపై తిరుగుబాటు

దరిశి చెంచయ్య సాంఘిక దురాచాలకు వ్యతిరేకంగా కూడా పోరాటం సాగించారు. సుభద్రమ్మ అనే మహిళను కులాంతర వివాహం చేసుకుని సాంఘిక దురాచారాలను తనతోనే రూపు మాపే కార్యక్రమానికి శ్రీకారం చుట్టిన గొప్ప వ్యక్తి దర్శి చంచయ్య. పరిపూర్ణ అనే బాలికను పెంచుకుని స్త్రీ విద్య, హరిజనోద్యమం, మూఢవిశ్వాసాలకు వ్యతిరేకంగా పోరాడారు. వితంతు వివాహాలను ప్రోత్సహించి జరిపించారు. చెంచయ్య కడశ్వాసవరకు దేశసేవకే అంకితమయ్యారు. ఆయనకు జన్మనిచ్చిన కనిగిరి పట్టణంలో ఆయన జ్ఞాపకార్థం భవనం నిర్మించి గ్రంథాలయాన్ని ఏర్పాటుచేశారు. పంజాబ్‌లో దరిశి చెంచయ్య విగ్రహాన్ని అక్కడ ప్రభుత్వం ఏర్పాటు చేసిందంటే ఆయన పోరాటపటిమ, పట్టుదల, సంకల్పం కనిగిరి ప్రతీకను నిలిపిందంటే అతిశయోక్తి కాదు. అలాంటి మహనీయులతో పాటు మరెందరో కనిగిరిలో జన్మించి దేశ స్వాతంత్ర్యం కోసం పారాడినవారున్నారు. వారిన స్వాతంత్ర్య దినోత్సవం రోజును స్మరించుకోవాల్సిన అవసరం ఉంది.



తుమ్మలబైలులో ఏర్పాటు చేసిన పెద్దబయన్న, మనుమప్ప విగ్రహాలు

స్వాతంత్ర్య సమరంలో గిరిజన ధీరులు

ఆజాదికా అమృత్ మహోత్సవ్‌లో గుర్తింపు
తుమ్మలబైలులో విగ్రహాల ఏర్పాటు
పోస్టల్ కవర్ విడుదల

పెద్ద దోర్నాల, ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి) : పరాయి పాలన నుంచి విముక్తి కోరుతూ ఎందరో మహానుభావులు చేసిన పోరాటాల్లో ఆదివాసీ తెగకు చెందిన చెంచు గిరిజనులు సైతం సమిధలయ్యారు. నల్లమల అటవీ ప్రాంతానికి చెందిన గిరిజన ధీరులు పెద్దబయన్న (బైలోడు), హనుమంతప్ప బ్రిటీష్ సైన్యానికి వణుకు పుట్టించారు. పెద్దగా ప్రాచుర్యం పొందకపోవడంతో వారి పోరాటపటిమ వెలుగులోకి రాలేదు. కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఆజాదికా అమృత్ మహోత్సవంలో గిరిజన వీరుల పోరాటం బహిర్గతమైంది. దీంతో కేంద్రం శ్రీశైలం ఐటీడీఏ ప్రాజెక్టు ద్వారా ప్రకాశం జిల్లా పెద్ద దోర్నాల మండలం తుమ్మలబైలు గిరిజన గ్రామంలో సమరయోధుల విగ్రహాలను ప్రతిష్ఠించి తగిన గుర్తింపునిచ్చింది. అనంతరం మరింత ప్రాధాన్యతనిస్తూ భారత తపాలా శాఖ కుడుముల పెద్దబయన్న పేరుతో ప్రత్యేకంగా రూపొందించిన పోస్టల్ కవర్‌ను విడుదల చేసింది.

● చెంచుల హక్కుల కోసం బ్రిటీష్‌వారిపై తిరుగుబాటు

అటవీ వన్యప్రాణుల సంరక్షణ, చెంచు గిరిజనుల హక్కుల కోసం బ్రిటీష్ వారిపై ఆదివాసులు చేసిన తిరుగుబాటు చరిత్ర మద్రాస్ లైబ్రరీలో లభించిన ఆధారాలతో భారత ప్రభుత్వం ఎట్టకేలకు ఆలస్యంగా గుర్తించింది. ఈ క్రమంలో నల్లమల అటవీ ప్రాంతానికి చెందిన ఆదివాసులు కుడుముల పెద్దబయన్న, హనుమంతప్ప స్వాతంత్ర్య పోరాటాన్ని శ్రీశైలం ఐటీడీఏ అధికారులు కేంద్ర ప్రభుత్వానికి ప్రతిపాదించడంతో 2022లో ఆజాదికా అమృత్ మహోత్సవంలో భాగంగా గిరిజన ధీరులకు సముచిత గౌరవాన్ని కల్పిస్తూ పెద్దదోర్నాల మండలంలోని తుమ్మలబైలు గూడెంలో శ్రీశైలం వెళ్లే రహదారి పక్కన ఇద్దరి విగ్రహాలను 2023 ఆగస్టు 2న ఆవిష్కరించారు.

● రూ.25 విలువైన పోస్టల్ కవర్ విడుదలతో మరింత గౌరవం

శ్రీశైలంలోని చెంచులక్ష్మి మ్యూజియంలో సాతంత్ర్య సమరయోధులు కుడుముల పెద్దబయన్న, హనుమంతప్పల ఫొటోలను ఏర్పాటు చేశారు. అప్పట్లో మ్యూజియాన్ని సందర్శించిన నంద్యాల జిల్లా పోస్టల్ సూపరింటెండెంట్ శ్రీనివాసరావు వీరుల చరిత్రను తెలుసుకుని తపాలా శాఖ ఉన్నతాధికారులకు వివరించారు. స్పందించిన తపాలశాఖ ఇద్దరి వివరాలను కోరారు. పెద్దబయన్న బంధువులు అందుబాటులో ఉండడంతో ఆయన వివరాలను సేకరించారు. నంద్యాల జిల్లా కొత్తపల్లి మండలానికి చెందిన హనుమంతప్ప బంధువుల ఆచూకీ లేకపోవడంతో ఆ వివరాలను సేకరించలేదు. దీంతో పెద్దబయన్న పేరిట రూ.25 విలువ కల్గిన పోస్టల్ కవరుపై ముందు భాగాన ఆయన ఫొటో, వెనుక వైపున సంక్షిప్తంగా ఆయన చరిత్రను రూపొందించారు. ఈ కవర్లను 2023 ఆగస్టు 31వ తేదీన నంద్యాలలోని హెడ్‌పోస్టాఫీసులో సూపరింటెండెంట్ శ్రీనివాసరావు ఆవిష్కరించినట్లు గిరిజన నాయకుడు దాసరి మూగెన్న తెలిపారు. ఏటా ఆగస్టు 2న పండుగ చేసుకుంటున్నామని తెలిపారు.

నూతన బార్ పాలసీకి ఉత్తర్వులు

జిల్లా ఎక్సైజ్ అధికారి అయేషా బేగం

ఒంగోలు క్రైం, ఆగస్టు14 (ఆంధ్రజ్యోతి) : నూతన బార్ పాలసీ 2025-28కి ప్రభుత్వం ఉత్తర్వులు విడుదల చేసినట్లు జిల్లా ఎక్సైజ్ అధికారి అయేషా బేగం గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. 50 వేలలోపు జనాభా ఉన్న ప్రాంతంలో బార్ లైసెన్స్ ఫీజు రూ.35 లక్షలు, ఐదు లక్షల జనాభా లోపు ఉన్న ప్రాంతంలో లైసెన్స్ ఫీజు రూ.55లక్షలు ఉంటుందని వివరించారు. ఆన్‌లైన్, ఆఫ్‌లైన్, హైబ్రీడ్‌పద్ధతిలో దరఖాస్తులు చేసుకోవచ్చని తెలిపారు. అప్లికేషన్ ఫీజ్ రూ.5లక్షలుగా నిర్ణయిచారని, ఈ ఫీజ్ రిఫండ్‌బుల్ కాదని వివరించారు. అదే విధంగా రూ.10 వేలు ప్రాస్‌సింగ్ ఫీజ్ కూడా వసూలు చేస్తామని తెలిపారు. బార్‌లు లాటరీ పద్ధతిలో ఎంపిక చేస్తామని పేర్కొన్నారు. జిల్లాలో ప్రస్తుతం 25 బార్లు ఉన్నట్లు తెలిపారు. గీత కార్మికులకు అదనంగా 10 శాతం బార్‌లు కేటాయిస్తామని, అందుకు సంబంధించి మరో నోటిఫికేషన్ విడదల చేస్తామని వివరించారు. అదేవిధంగా బార్‌లు ఉదయం 10 నుంచి రాత్రి 12 గంటల వరకు విక్రయాలు చేసుకోవచ్చని తెలిపారు. అదేవిధంగా మద్యం దుకాణాల ఇండెంట్ ప్రకారం బార్‌లకు మద్యం సరఫరా చేస్తామని, 99 రూపాయల మద్యం సరఫరా ఉండదని వెల్లడించారు.


పెద్దపులి దాడిలో తీవ్రంగా గాయపడి చనిపోయిన ఆవు

పెద్ద పులి పంజా

యాచవరం అటవీ పరిధిలో గేదెపై దాడి.. మృతి
దొనకొండ ఫారెస్టు పరిధిలో తీవ్రంగా గాయపడి చనిపోయిన మరో ఆవు

కంభం, ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి) : నల్లమల ఫారెస్టు పరిధిలో పెద్దపులి పంజా విసురుతోంది. పులి దెబ్బకు ఓ పాడిగేదె మరణించగా.. తీవ్రంగా గాయపడి చికిత్స పొందుతున్న మరో ఆవు గురువారం మరణించింది. వివరాల్లోకి వెళితే.. అర్ధవీడు మండలం యాచవరం గ్రామానికి చెందిన టి.అక్కిశెట్టి బుధవారం ఉదయం పాడిగేదెను అడవిలోకి మేతకోసం వదిలాడు. చీకటిపడినా గేదె ఇంటికి రాకపోయేసరికి గురువారం అటవీ ప్రాంతంలో గాలించగా ఓ చోట పెద్దపులి దాడిలో తీవ్రంగా గాయపడి మరణించింది. ఈ విషయాన్ని అటవీ శాఖ అధికారులకు సమాచారం ఇవ్వడంతో ఫారెస్టు బీట్ ఆఫీసర్ ప్రసాద్‌రెడ్డి సిబ్బందితో కలిసి ఘటనా స్థలానికి వెళ్లగా అక్కడ పెద్దపులి పాదముద్రలు గుర్తించారు. గేదె మృతదేహానికి పంచనామా నిర్వహించారు. ఈ గేదె విలువ రూ.60వేలు ఉంటుందని రైతు అక్కిశెట్టి తెలిపాడు.

మేతకెళ్తే దాడి...

ఫారెస్టు బీట్ ఆఫీసర్ ప్రసాద్‌రెడ్డి మాట్లాడుతూ అర్ధవీడు మండలం దొనకొండ గ్రామానికి చెందిన ఓ రైతు ఆవు జూన్ 20న సమీపంలోని అటవీ ప్రాంతంలో మేతకు వెళ్లగా మాటువేసిన పెద్దపులి దాడి చేయడంతో తీవ్రంగా గాయపడింది. పెద్దపులి బారి నుంచి తప్పించుకున్న ఆవు గ్రామసమీపంలో వచ్చి పడిపోగా అప్పటి నుంచి చికిత్స అందిస్తున్నారు. గాయాలదెబ్బకు వారం రోజులుగా మేత కూడా మేయకుండా క్షీణించిన ఆవు గురువారం మరణించినట్లు బీట్ ఆఫీసర్ తెలిపారు.

● రైతులు ఆందోళన చెందవద్దు.. నష్టపరిహారం ఇస్తున్నాం

అటవీ సమీప గ్రామాలలో ఆవులు, ఎద్దులు, గేదెలపై పెద్దపులులు దాడి చేసి చంపుతుండడంపై ఫారెస్టు బీట్ ఆఫీసర్ ప్రసాద్‌రెడ్డి మాట్లాడుతూ పశుపోషకులు ఆందోళన చెందవద్దన్నారు. పశువుల యజమానులకు వెంటనే నష్టపరిహారం చెల్లిస్తున్నట్లు తెలిపారు. ప్రస్తుతం జూన్, జూలై, ఆగస్టులో పెద్దపులులు సంతానోత్పత్తి కోసం తిరుగుతుంటాయన్నారు. రైతులు, పశుపోషకులు ఈ నాలుగు నెలలు తమ పశువులను అడవులకు తోలవద్దని హెచ్చరించారు. పెద్దపులులు మన అటవీ ప్రాంతంలో ఉండడం మన అదృష్టమని, సంరక్షించాల్సిన బాధ్యత మనపై ఉందన్నారు. ఈ 3 నెలల్లో 15కి పైగా పశువులు పులుల దాడిలో మరణించగా వాటన్నింటికి నష్టపరిహారం ఇచ్చినట్లు తెలిపారు.

నీటి సంరక్షణ పనులను వేగవంతం చేయాలి

ఒంగోలు కలెక్టరేట్,ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి) : భూగర్భ నీటి మట్టాన్ని పెంచేలా నీటి సంరక్షణ నిర్మాణాలను త్వరగా పూర్తి చేయాలని ముఖ్యమంత్రి నారాచంద్రబాబు నాయుడు ఆదేశించారు. గురువారం జిల్లా కలెక్టర్లతో నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో సీఎం మాట్లాడారు. ఈసందర్భంగా సీఎం మాట్లాడుతూ పంటలకు అవసరమైన నీటి భద్రత కల్పించేందుకు ప్రభుత్వం అధిక ప్రాధాన్యత ఇస్తున్నట్లు తెలిపారు. నీటిసంరక్షణ కట్టడాలను పూర్తి చేయడం ద్వారా అధికవర్షాలు కురిసినపుడు భూమిలో తేమ పెరిగి తర్వాత ఏడాది ఆశించిన స్థాయిలో వర్షాలు పడకపోయినా పంటలను కాపాడుకునేందుకు అవకాశం ఉంటుందన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ తమీమ్ అన్సారియా జిల్లాలోని పరిస్థితిని వివరించారు. స్థానిక పరిస్థితులకు తోడు పరిమితికి మంచి భూగర్భనీటిని వినియోగించడం వల్ల పశ్చిమ ప్రాంతంలో నీటిమట్టం పడిపోయిందన్నారు. ఈ పరిస్థితిని మెరుగుపర్చేందుకు ప్రత్యేక దృష్టిసారించామని సీఎం దృష్టికి తీసుకెళ్లారు. భూగర్భ నీటి సంరక్షణలో రిలయన్స్ ఫౌండేషన్ వంటి సంస్థలను కూడా భాగస్వాములను చేశామన్నారు. డ్వామా ఆధ్వర్యంలో నీటి సంరక్షణ నిర్మాణాలు చేపట్టేలా వాటర్ బడ్జెట్ రూపకల్పన చేశామని తెలిపారు. ఈ కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ గోపాలకృష్ణ, జలవనరులశాఖ ఎస్ఈ వరలక్ష్మీ పాల్గొన్నారు.


సీఎం వీడియో కాన్ఫరెన్స్‌లో కలెక్టర్ అన్సారియా, జేసీ గోపాలకృష్ణ

కూనంనేనివారిపాలెం సొసైటీ చైర్మన్‌గా లక్ష్మీనరసయ్య

చీమకుర్తి, ఆగస్టు 14(ఆంధ్రజ్యోతి): కూనంనేనివారిపాలెం సొసైటీకి త్రీమెన్ కమిటీని నియమించారు. చైర్మన్‌గా టీడీపీ బాపట్ల పార్లమెంట్ రైతు కార్యదర్శి, సీనియర్ నాయకుడు ఎనికపాటి లక్ష్మీనరసయ్య, సభ్యులుగా కంకణాలపాటి కోటేశ్వరరావు, దర్శి సుబ్బారావులను నియమించగా త్వరలో వారు బాధ్యతలను చేపట్టనున్నారు. పలువురు నాయకులు వారిని అభినందించారు.

వ్యవసాయ కార్మిక సంఘ నూతన కార్యవర్గం

ఒంగోలు కలెక్టరేట్, ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి) : వ్యవసాయ కార్మిక సంఘం నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కనిగిరిలో రెండు రోజుల పాటు జరిగిన సంఘ మహాసభల్లో ఈ కమిటీని ఎన్నుకోగా వాటి వివరాలను గురువారం పత్రికలకు విడుదలచేశారు. వ్యవసాయకార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడిగా నెరుసుల వెంకటేశ్వర్లు, కార్యదర్శులుగా కంకణాల ఆంజనేయులను మరోసారి ఎన్నుకున్నారు. ఉపాధ్యక్షులుగా జాలా అంజయ్య, బడుగు వెంకటేశ్వర్లు, కె.మాల్యాద్రి, మల్లెల సంపూర్ణ, వేసుపోగు మోజేష్, సహాయ కార్యదర్శులుగా కేజీమస్తాన్, వెల్లంపల్లి ఆంజనేయులు, గుమ్మా బాలనాగయ్య, కంకణాల వెంకటేశ్వర్లు, ఉబ్బా వెంకటేశ్వర్లు, మరో 13 మందిని ఆఫీసర్ బేరర్లుగా, మరో 25 మందితో జిల్లా కమిటీని ఎన్నుకున్నారు.

రేపు కొండపి ఏఎంసీ పాలకమండలి ప్రమాణ స్వీకారం

కొండపి, ఆగస్టు14 (ఆంధ్రజ్యోతి): నూతనంగా ప్రభుత్వం నియమించిన కొండపి ఏఎంసీ కమిటీ అధ్యక్ష, ఉపాధ్యక్ష, సభ్యులు శనివారం సింగరాయకొండలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల క్రీడామైదానం ఆవరణలో ప్రమాణ స్వీకారం చేయనున్నారు. కార్యక్రమానికి రాష్ట్ర మంత్రులు ఆనం రామనారాయణరెడ్డి, గొట్టిపాటి రవికుమార్, డోలా శ్రీబాలవీరాంజనేయస్వామి, బీసీ జనార్దన్‌రెడ్డి, ఎంపీ మాగుంట, ఎమ్మెల్సీలు కంచర్ల శ్రీకాంత్, భూమిరెడ్డి రాంభూపాల్‌రెడ్డి, బీద రవిచంద్ర, మారిటైం బోర్డు చైర్మన్ దామచర్ల సత్య, టూరిజం కార్పొరేషన్ చైర్మన్ నూకసాని బాలాజీ, పీడీసీసీ బ్యాంకు చైర్మన్ కామేపల్లి సీతారామయ్య, జిల్లాలోని ఎమ్మెల్యేలు పాల్గొంటారని నిర్వాహకులు తెలిపారు.

ఎంపీ మాగుంట శుభాకాంక్షలు

ఒంగోలు కలెక్టరేట్, ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి): జిల్లా ప్రజలకు స్వాతంత్ర్య దినోత్సవ శుభాకాంక్షలను ఎంపీ మాగుంట శ్రీనివాసులురెడ్డి తెలిపారు. మనం అనుభవిస్తున్న స్వాతంత్ర్య ఫలాలు అనేకమంది మహనీయుల త్యాగఫలితమేనన్నారు. స్వాతంత్ర్య దినోత్సవాన్ని ఆనందంగా జరుపుకోవాలని ఆకాంక్షించారు.

- జిల్లా ప్రజలకు మాజీమంత్రి శిద్దా రాఘవరావు స్వాతంత్ర్య దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. బ్రిటీష్ వారి పాలన నుంచి విముక్తి పొందడానికి నిర్వహించిన జాతీయోద్యమంలో ఎందరో మహానుభావాలు, త్యాగధనలు పోరాటాలు చేశారన్నారు. దేశ సార్వభౌమత్వాన్ని, సమగ్రతను కాపాడుకోవడం అందరి బాధ్యతగా భావించాలన్నారు.

కారును ఢీకొన్న బైక్.. ఇద్దరికి గాయాలు


గాయపడిన ఆంజనేయులు, నారాయణస్వామి

నాగులుప్పలపాడు, ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి): బైక్ అదుపుతప్పి కారును ఢీకొనడంతో ఇద్దరు యువకులు గాయపడిన సంఘటన చదలవాడ వద్ద గల జాతీయ రహదారిపై జరిగింది. స్థానికులు తెలిపిన వివరాల మేరకు.. కొరిశపాడు మండలం పమిడిపాడు గ్రామానికి చెందిన పాలేటి ఆంజనేయులు, కొడివెండ్ల నారాయణస్వామి గురువారం సాయంత్రం బైక్‌పై ఒంగోలు నుంచి స్వగ్రామం వెళుతున్నారు. ఈక్రమంలో వారు చదలవాడ వద్ద రాంగ్‌రూట్‌లోకి వెళ్లగా అదే సమయంలో ఎదురుగా వస్తున్న కారు బైకును తప్పించేందుకు ప్రయత్నించే కుడివైపు రోడ్డు మార్జిన్‌లోకి వెళ్లింది. అయితే అదే బైక్ ఆ కారును ఢీకొంది. దాంతో బైక్‌పై ప్రయాణిస్తున్న ఆంజనేయులు, నారాయణస్వామి గాయడంతో చికిత్స నిమిత్తం 108వాహనంలో ఒంగోలుకు తరలించారు.

ఘనంగా ముందస్తు శ్రీకృష్ణాష్టమి

ఒంగోలు విద్య, ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి): స్థానిక భాగ్యనగర్‌లోని గౌతమి మోడల్ స్కూలులో గురువారం ముందస్తు శ్రీకృష్ణాష్టమి వేడుకలను ఘనంగా నిర్వహించారు. నర్సరీ, ఎల్‌కేజీ, యూకేజీ చిన్నారులు శ్రీకృష్ణుడు, గోపికల వేషధారణలతో అలరించారు. ఈ సందర్భంగా పాఠశాల డైరెక్టర్ ఎం.కొండయ్య చిన్నారులకు శ్రీకృష్ణాష్టమి శుభాకాంక్షలు చెప్పారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ ఎం.పద్మజ, అలెక్స్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

నాగులుప్పలపాడులో..

నాగులుప్పలపాడు: స్థానిక ఆక్రిడ్జ్ పాఠశాలలో ముందస్తు శ్రీకృష్ణాష్టమి వేడుకలు గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు చిన్నికృష్ణుడు, గోపికల వేషధారణలో అలరించారు. చిన్నారులతో ఉట్టి కొట్టించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు.

రైలు నుంచి జారిపడి ఒకరి మృతి

ఒంగోలు క్రైం, ఆగస్టు14(ఆంధ్రజ్యోతి): రైలులో నుంచి జారి పడి గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందాడు. ఈ సంఘటన ఒంగోలు-సూరారెడ్డిపాలెం మధ్యలో గురువారం జరిగింది. మృతుడి వయస్సు 40-45 ఏళ్ళు ఉంటుంది. పసుపు రంగుపై నల్లని చెక్స్ చొక్క, బ్లూకలర్ ప్యాంట్ ధరించి ఉన్నాడని రైల్వే ఎస్‌ఐ కె.మధుసూదనరావు తెలిపారు. మృతదేహం వద్ద ఎలాంటి ఆధారాలు దొరకలేదన్నారు. వివరాలు తెలిసినవారు 9440627647 సెల్‌నంబరులో సంప్రదించాలని ఆయన కోరారు.

విద్యార్థులకు అవగాహన సదస్సు


సదస్సులో పాల్గొన్న విద్యార్థులు, ఎస్‌ఐ సువర్ణ, టీచర్లు

ఒంగోలు కలెక్టరేట్, ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి): స్థానిక లాయర్‌పేటలోని శ్రీ చైతన్య ఐకాన్ అండ్ ఒలంపియాడ్ స్కూలులో గురువారం స్టూడెంట్స్ క్యాబినెట్ ఎన్నికలు, సోషల్ మీడియా ప్రభావంపై అవగాహన సదస్సు నిర్వహించారు. వన్‌టౌన్ ఎస్‌ఐ ఎం.సువర్ణ విద్యార్థులపై సోషల్ మీడియా ప్రభావం గురించి వివరించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ అపర్ణశిరీష, రీజనల్ ఇన్‌చార్జి వై.అనిల్‌కుమార్, కో ఆర్డినేటర్ జి.శ్రీనివాసరావు, డీన్ వై.శ్రీనివాసరావు, జోనల్ పీఈటీ ఆర్.రామారావు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

వెలిగొండ జలాలపై చిగురిస్తున్న ఆశలు

- మంత్రి స్వామి చొరవతో
- ఇరిగేషన్ అధికారులకు సీఎంవో ఆదేశాలు


చిలంకూరు వద్ద ప్రవహిస్తున్న మూసి నది

మర్రిపూడి, ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి) : మర్రిపూడి మండలాన్ని కరువు నుంచి విముక్తి కలిగించేందుకు రాష్ట్ర సాంఘికశాఖ మంత్రి స్వామి చొరవ చూపుతున్నారు. వెలిగొండ ప్రధాన కాలువ నుంచి ముసి, పాలేరులకు నీరు విడుదలకు ప్రభుత్వం గ్రీన్‌సిగ్నల్ ఇచ్చింది. వెలుగొండ కాలువ నుంచి గార్లపేట సమీపంలోని పూనుగోడు రిజర్వాయర్‌లోకి నీటిని విడుదల చేస్తే మాకేరు నుంచి పాలేరు వరకు అనుసంధానం చేయవచ్చు. పునుగోడు రిజర్వాయర్ నుంచి నార్సాపురం, కొత్తూరు, వైకుంఠపురం మీదుగా పొదిలి కొండ సమీపంలో ఉన్న సప్లయ్ చానల్‌లోకి నీటిని వదిలితే మర్రిపూడి, గంగపాలెం, గుండ్లసముద్రం చెరువులను నింపవచ్చు. మర్రిపూడి చెరువు నుంచి వల్లాయపాలెం, చిమట రామాయపాలెం గుండ్లసముద్రం చెరువు నుంచి కెల్లంపల్లి, పన్నూరు, శివరాయునిపేట చిలంకూరు చెరువులకు నీటిని అందించొచ్చు. దీంతో మండలంలోని 10వేల ఎకరాలకుపైగా ప్రత్యక్షంగా సాగునీరు అందే అవకాశాలు ఉంటాయి. పరోక్షంగా మరో 10వేల ఎకరాల్లో భూగర్భజలాలు పెరిగి బోర్ల ద్వారా సాగు విస్తీర్ణం పెరుగుతుందని రైతులు అంటున్నారు. ఇప్పటికే క్రిష్ణా జలాలను మూసినదిలో విడిచిపెట్టేందుకు మంత్రి ప్రభుత్వం నుంచి ఉత్తర్వులు విడుదల చేయించారు. ముసి నది వద్ద రోడ్డు కం చెక్‌డ్యాం కోసం ఇప్పటికే ప్రతిపాదనలు సిద్ధం చేయించారు. రామాయపాలెం వద్ద అట్లేరుపై భారీ చెక్‌డ్యాం నిర్మాణానికి రూ.7 కోట్లతో ప్రతిపాదనలు సిద్ధమయ్యాయి. ఎన్నో ఏళ్ల ప్రజల ఆకాంక్ష తీర్చేందుకు ఇరిగేషన్ అధికారులు సిద్ధం చేసిన ప్రతిపాదనలు కార్యరూపం దాల్చితే మర్రిపూడి మండలం శాశ్వతంగా కరువు నుంచి విముక్తి పొందడమేకాకుండా తాగునీటి ఇబ్బందులు తొలగనున్నాయి.

యువకుడి ఆత్మహత్య

కొండపి, ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి): పెదకండ్లగుంట గ్రామంలోని జగనన్న కాలనీలో దాసరి మహేంద్ర (20) గురువారం ఉదయం తన ఇంటిలో చీరతో ఉరి వేసుకుని బలవన్మరణానికి పాల్పడ్డాడు. అతని తండ్రి చిన్న మల్యాద్రి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై ప్రేమ్‌కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు.

టీడీపీ నాయకుల సంబరాలు

నాగులుప్పలపాడు, ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి): కడప జిల్లా పులివెందుల, ఒంటిమిట్ట జడ్పీటీసీ ఎన్నికల్లో టీడీపీ అభ్యర్థులు విజయం సాధించడం పట్ల గురువారం ఉప్పుగుండూరులో ఆ పార్టీ నాయకులు సంబరాలను నిర్వహించారు. స్థానిక ఎన్టీఆర్ విగ్రహం వద్ద గ్రామ అధ్యక్షుడు కాట్రగడ్డ చంద్రబాబు, నాయకులు బాణసంచా కాల్చి స్వీట్లు పంచారు. కార్యక్రమంలో ఐడీటీపీ మండలాధ్యక్షుడు బెల్లం వెంకటేశ్వర్లు, గోగినేని శేషగిరి, కనగాల కృష్ణ, రమేష్, గుమ్మడి చిన్నా, వడ్లమూడి రంగబాబు తదితరులు పాల్గొన్నారు.

నగరంలో విభజన్ కవిభీషక్ దివస్ ర్యాలీ


కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహిస్తున్న నాయకులు

ఒంగోలు కలెక్టరేట్, ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి): భారతదేశాన్ని 1947 ఆగస్టు 14న మూడు ముక్కలుగా విభజించడాన్ని వ్యతిరేకిస్తూ భారతీయ జనతా పార్టీ ఆధ్వర్యంలో గురువారం రాత్రి ఒంగోలులో విభజన్ కవిభీషక్ దివస్‌లో భాగంగా కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించారు. స్థానిక బాపూజీ కాంప్లెక్స్ నుంచి ఆర్టీసీ బస్టాండు వరకు ఈ ర్యాలీ జరిగింది. ఈ సందర్భంగా బీజేపీ జిల్లా అధ్యక్షుడు శెగ్గం శ్రీనివాసులు మాట్లాడుతూ నాడు దేశాన్ని మూడు ముక్కలుగా దుర్మార్గంగా విభజించారని చెప్పారు. పశ్చిమ పాకిస్థాన్, తూర్పు పాకిస్తాన్, భారతదేశంగా విభజన చేసి స్వాతంత్ర్యాన్ని ఇచ్చారని, ఆ సమయంలో ఎంతో మంది స్వాతంత్ర సమరయోధులు, దేశభక్తులు, సామాన్య ప్రజలు లక్షల మంది దారుణ హత్యలకు గురయ్యారని ఆవేదన వ్యక్తం చేశారు. నాటి దుర్భరమైన పరిస్థితులను నిరసిస్తూ ఈ ర్యాలీని చేపట్టినట్లు ఆయన తెలిపారు. కార్యక్రమంలో మాజీ అధ్యక్షుడు పీవీ.శివారెడ్డి, నాయకులు మాకినేని అమరసింహం, అషారావు, భగత్ వినోద్, కాటా రాధాకృష్ణ, దండు శ్రీనివాసరావు, తిరుమల, సతీష్, సాయి, రాజేష్‌వర్మ తదితరులు పాల్గొన్నారు.

నీటి సంరక్షణ చర్యలపై అవగాహన

- సీఎం చంద్రబాబు

సంతనూతలపాడు, ఆగస్టు 14(ఆంధ్రజ్యోతి): నీటి సంరక్షణ చర్యలపై ప్రజలకు అవగాహన కల్పించాలని సీఎం చంద్రబాబునాయుడు సూచించారు. గురువారం జరిగిన వీడియో కాన్ఫరెన్స్‌లో సీఎం చంద్రబాబు ఇటీవల నూతనంగా ఎన్నికైన నీటివినియోగదారుల సంఘాల అధ్యక్షులు, కార్యదర్శులతో మాట్లాడారు. నీటి వనరులు అవసరమైన వరకు వినియోగించి ఆదా చేయాలని తెలిపారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో జరిగిన వీడియో కాన్ఫరెన్స్‌లో తహసీల్దార్ నారాయణరెడ్డి, ఎంపీడీవో సురేష్‌బాబు పాల్గొన్నారు.

కార్మికులకు బెదిరింపులు మానుకోవాలి

ఒంగోలు కలెక్టరేట్, ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి): ఒంగోలు నగర పాలకసంస్థలో పని చేస్తున్న కార్మికులకు బెదిరింపులను మానుకోవాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు చీకటి శ్రీనివాసరావు డిమాండ్ చేశారు. గురువారం స్థానిక సంఘ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేఖరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ గత రెండు నెలల నుంచి కార్పొరేషన్ అధికారులు పారిశుధ్య కార్మికుల మీద పర్యవేక్షణ పేరుతో అనేక ఇబ్బందులకు గురిచేస్తున్నారన్నారు. చిన్నచిన్న పొరపాట్లను పెద్దవిగా చూపిస్తూ కార్మికులకు మస్టర్ ఆపేసి ఉద్యోగాల నుంచి తొలగిస్తున్నారని ఆరోపించారు. నగరంలో ప్రజల ఆరోగ్యం కోసం పారిశుధ్య కార్మికులు ప్రతిరోజు చెత్తసేకరణ, సైడ్‌కాలువల శుభ్రత, జంతువులు ఏమి చనిపోయినా దుర్వాసన రాకుండా మోకాళ్ళలోతున కాలువల్లో దిగి సేఫ్టీ మెటీరియల్ లేకుండా విధులు నిర్వహిస్తున్నారని తెలిపారు. ఇప్పటికైనా కార్పొరేషన్ అధికారులు స్పందించి వెంటనే కార్మికులను తొలగించే విధానాలు మానుకోవాలని హితవు పలికారు. కార్యక్రమంలో తంబి శ్రీనివాసులు, యూనియన్ జిల్లా కార్యదర్శి కె.శ్రీనివాసరావు, నరసింహ, విజయమ్మ, రత్నకుమారి, మహేష్ తదితరులు పాల్గొన్నారు.

రూడ్‌సెట్‌లో న్యాయ విజ్ఞాన సదస్సు

ఒంగోలు కలెక్టరేట్, ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం అందించే కుల, ఆదాయ ధ్రువీకరణ పత్రాలు, స్వయం ఉపాధి పొందే విషయంలో జిల్లా న్యాయసేవాధికార సంస్థ తమవంతు సహకారం అందిస్తుందని ఆ సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ న్యాయాధికారి షేక్ ఇబ్రహీం షరీఫ్ పేర్కొన్నారు. ఒంగోలులోని రూడ్‌సెట్ కార్యాలయంలో గురువారం నిర్వహించిన న్యాయ విజ్ఞాన సదస్సులో ఆయన మాట్లాడారు. అర్హత కలిగిన ప్రతి ఒక్క మహిళకు, షెడ్యూల్ తెగల కులాలకు చెందిన వారికి, ఆర్థికంగా వెనుకబడిన వారికి ఉచితంగా న్యాయవాదిని నియమించి కోర్టుల్లో న్యాయం పొందేందుకు సహకరిస్తుందన్నారు. కార్యక్రమంలో ఆర్‌ఐ వెంకటేశ్వరరెడ్డి, రూడ్‌సెట్ డైరెక్టర్ శ్రీనివాసరెడ్డి, లీడ్ బ్యాంకు మేనేజర్ రమేష్ పాల్గొన్నారు.

జీవోను రద్దు చేయాలి

ఒంగోలు కలెక్టరేట్, ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి): విద్యార్థుల హక్కులు, వారి సంక్షేమం కోసం రాజీలేకుండా పోరాడుతున్న విద్యార్థి సంఘాలను నియంత్రించేందుకు ప్రభుత్వం జారీ చేసిన జీవోను వెంటనే రద్దు చేయాలని విద్యార్థి సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. స్థానిక ఎంసీపీ భవన్‌లో గురువారం ఏర్పాటు చేసిన విలేఖరుల సమావేశంలో పీడీఎస్‌యూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు రాజశేఖర్, ఎస్ఎఫ్ఐ రాష్ట్ర ఉపాధ్యక్షుడు సీహెచ్.వినోద్ మాట్లాడుతూ విద్యాసంస్థల్లోని సమస్యలను పరిష్కారం చేయాలని కోరితే విద్యార్థి సంఘాలను నియంత్రించాలనుకోవడం చాతగానితనమన్నారు. అధికారంలో ఏ ప్రభుత్వం ఉన్నా నిస్వార్థంగా విద్యార్థుల సమస్యలపై సంఘాలు ప్రశ్నించడమే తప్పా అని ప్రశ్నించారు. జీవోను ఉపసంహరించుకోకపోతే తగిన మూల్యం చెల్లించక తప్పదని హెచ్చరించారు. కార్యక్రమంలో కె.వీరస్వామి, శాంసన్, పి.మోషీ, సురేష్, రఫీ, దావీదు, చరణ్ తదితరులు పాల్గొన్నారు.

ఒడా చైర్మన్‌కు సత్కారం

నాగులుప్పలపాడు, ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి): ఒంగోలు అర్బన్ డవలప్‌మెంట్ (ఒడా) చైర్మన్‌గా ఎన్నికైన జనసేన పార్టీ జిల్లా అధ్యక్షుడు షేక్ రియాజ్‌ను నాగులుప్పలపాడు మండల జనసేన పార్టీ నాయకులు గురువారం ఘనంగా సన్మానించారు. ఒంగోలులోని జనసేన పార్టీ కార్యాలయంలో ఆ పార్టీ మండల ఉపాధ్యక్షుడు, మద్దిపాడు ఏఎంసీ డైరెక్టర్ కొంజేటి ధనుష్ ఆధ్వర్యంలో చైర్మన్ రియాజ్‌కు బొకే అందజేసి శాలువా కప్పి సన్మానించారు. కార్యక్రమంలో పల్లపోతు సాయిచరణ్, పల్లపోతు చైతన్య, గంగిశెట్టి నాగేశ్వరరావు, మట్టుపల్లి అమర్‌నాథ్, కొండపి బ్రహ్మం, షేక్ సాధిక్ తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ ఉద్యోగులకు ఐఆర్ ప్రకటించాలి

ఒంగోలు కలెక్టరేట్, ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ ఉద్యోగులకు మధ్యంతర భృతి(ఐఆర్)ని ప్రభుత్వం ప్రకటించాలని ప్రభుత్వ ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడు చిన్నపురెడ్డి కిరణ్‌కుమార్‌రెడ్డి కోరారు. గురువారం ఒంగోలులోని వాణిజ్య పన్నులశాఖ కార్యాలయంలో రండీ..టీ తాగుతూ మాట్లాడుకుందాం చర్చా కార్యక్రమాన్ని నిర్వహించారు. వాణిజ్య పన్నులశాఖ జోనల్ అధ్యక్షుడు నరసింగరావు ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో ఉద్యోగుల సమస్యలపై టీ తాగుతూ చర్చించారు. ముందుగా గత ఎన్నికల ముందు ఇచ్చిన హామీలపై చర్చించారు. అనంతరం ఆయా సమస్యలపై ప్రభుత్వం సత్వర చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో సంఘం నగర అధ్యక్షుడు మోటా శ్రీనివాసరావు, మహిళా విభాగం అధ్యక్షురాలు డాక్టర్ రజితమానస, వాణిజ్య పన్నులశాఖ ఉద్యోగులు వంశీకృష్ణ, మల్లేశ్వరరావు, అహ్మద్‌బాషా పాల్గొన్నారు.

శ్రీకృష్ణ విగ్రహ ప్రతిష్ఠ వేడుకలు

చీమకుర్తి, ఆగస్టు 14(ఆంధ్రజ్యోతి): చీమకుర్తి పట్టణంలోని ఇసుకవాగుసెంటర్ సమీపంలో ఉన్న శ్రీకృష్ణ మందిరంలో స్వామివారి విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవాలు గురువారం ఘనంగా ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా శ్రీకృష్ణుడి విగ్రహాన్ని పట్టణ పురవీధుల్లో ఊరేగించారు. ఈనెల 17న స్వామివారి విగ్రహన్ని ప్రతిష్ఠించనున్నారు.

తిరంగా ర్యాలీలు

సంతనూతలపాడు, ఆగస్టు 4(ఆంధ్రజ్యోతి): పి.గుడిపాడులో గురువారం బీజేపీ మండలాధ్యక్షుడు బి.కళ్యాణ్‌రెడ్డి ఆధ్వర్యంలో పార్టీ శ్రేణులు, విద్యార్థులు అభిమానులు జాతీయ జెండాలతో తిరంగా ర్యాలీ నిర్వహించారు. మోదీ పాలనలో దేశం అన్ని రంగాల్లో అభివృద్ధిపథంలోకి వెళ్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు జి.శ్రీనివాసరావు, ఎంపీటీసీ టి.సుజాత, ఉపాధ్యాయులు బాపట్ల లక్ష్మీనారాయణ, లక్ష్మీప్రసాద్, శ్రీనివాసరావు, పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

అమ్మనబ్రోలులో..

నాగులుప్పలపాడు: స్వాతంత్ర్య దినోత్సవం పురస్కరించుకుని ప్రధాని నరేంద్రమోదీ పిలుపు మేరకు బీజేపీ నాయకులు గురువారం అమ్మనబ్రోలు గ్రామంలో జడ్పీ హైస్కూల్ విద్యార్థులతో కలసి 79 అడుగుల జాతీయ జెండాతో హర్‌ఘర్ తిరంగా ర్యాలీని నిర్వహించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఆస్టర్ రమేష్‌లో అధునాతన యాంజియో ప్లాస్టీ చికిత్స


మాట్లాడుతున్న వైద్యులు

ఒంగోలు కార్పొరేషన్, ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి): ఒంగోలులోని ఆస్టర్ రమేష్ హాస్పిటల్‌లో జీరో కాంట్రాస్ట్ కరోనరీ యాంజియో ప్లాస్టి నిర్వహించినట్లు గుండెసంబంధిత వైద్యులు శివకృష్ణ, శబరిగిరీష్, మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ వంశీకృష్ణ తెలిపారు. గురువారం స్థానిక హాస్పిటల్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో వారు మాట్లాడుతూ ఈనెల ఒకటో తేదీన 67 ఏళ్ల వృద్ధురాలు గుండెనొప్పితోపాటు హార్ట్ ఫెయిల్యూర్‌తో ఆస్టర్ రమేష్ హాస్పిటల్‌లో చేరినట్లు తెలిపారు. ఆమెకు వైద్య పరీక్షలు నిర్వహించగా బీపీ, షుగర్, కిడ్నీ ఫెయిల్యూర్‌తో బాధపడుతుందని గుర్తించామని చెప్పారు. చికిత్సలో భాగంగా యాంజియోగ్రాం చేసి గుండెలోని రెండు ప్రాణాంతకమైన బ్లాక్‌లను గుర్తించి, ఆమెకు కిడ్నీ సమస్యను దృష్టిలో ఉంచుకుని ఇంట్రా వాస్క్యులర్ అల్ట్రా సౌండ్‌తో కార్డియాక్ స్టంట్స్ వేసి ఆపరేషన్ విజయంతం చేసినట్లు తెలిపారు. కిడ్నీ ఫెయిల్యూర్ రోగులకు యాంజియో ప్లాస్టి చేసే క్రమంలో కిడ్నీపై కొంత దుష్ప్రభావం పడి డయాలసిస్ అవసరం కలిగే అవకాశం చాలా ఎక్కువ ఉంటుందని, అటువంటి పేషెంట్‌లకు జీరో కాంట్రాస్ట్ కరోనరీ యాంజియో ప్లాస్టీ నూతన ప్రక్రియ వల్ల కిడ్నీలపై ఎటువంటి ప్రభావం ఉండదని తెలిపారు. సమావేశంలో డాక్టర్ సెంథిల్ కుమార్, డాక్టర్ సందీప్ తదితరులు పాల్గొన్నారు.

పల్లామల్లి సొసైటీ చైర్మన్ బాధ్యతల స్వీకరణ


చంద్రశేఖర్‌ని అభినందిస్తున్న నాయకులు

చీమకుర్తి, ఆగస్టు 14(ఆంధ్రజ్యోతి) : పల్లామల్లి సొసైటీ చైర్మన్ పారా చంద్రశేఖర్, సభ్యులు పత్తి ఆంజనేయులు, సారెకొక్కు జాన్సన్ గురువారం సొసైటీ కార్యాలయంలో బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా సొసైటీ సెక్రటరీ గుంజి రమణయ్య నూతన కార్యవర్గానికి ఘన స్వాగతం పలికి లావాదేవీల గురించి వివరించారు. తదుపరి చైర్మన్ చంద్రశేఖర్,సభ్యులను టీడీపీ నాయకులు ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో అన్నంనేని రాఘవయ్య, పారా కృష్ణ, మేదూరి వెంకటేశ్వరరావు, పారా శ్రీనివాసరావు, గుండవరపు శ్రీనివాసరావు, కరిచేటి శ్రీనివాసరావు, సింగయ్య, వెంకట్రావు, కీర్తిపాటి అంజయ్య, రావులపల్లి శ్రీనివాసరావు, రాయుడు పాల్గొన్నారు.

ప్రకటన

మహారాజశ్రీ నరసరావుపేట చిట్‌రిజిస్ట్రార్‌గారి కోర్టు యందు

Dispute No : 174/2023

వెంకట తిరుమల చిట్ ఫండ్(ప్రై)లిమిటెడ్
నరసరావుపేట — Disputant

Vs

కత్తి అంకబాబు మరియు ఇతరులు — opponents

Notice as per rule 50 of the A.P. Chit Fund Rules 2008

OPPONENT 1 : కత్తి అంకబాబు S/o. వెంకన్న, వయస్సు 50, ప్రొప్రయిటర్ : M/s స్టార్ డిజిటల్ లేజర్ కలర్ ల్యాబ్, ఓల్డ్ పోలీస్ స్టేషన్ రోడ్, వెజిటబుల్ మార్కెట్ సెంటర్ దగ్గర, నరసరావుపేట (పొ),పల్నాడు జిల్లా.

OPPONENT 2: కేదారి సుబ్రమణ్యం S/o. బుల్లియ్య, వయస్సు 49, M/s స్టార్ డిజిటల్ లేజర్ కలర్ ల్యాబ్, ఓల్డ్ పోలీస్ స్టేషన్ రోడ్, వెజిటబుల్ మార్కెట్ సెంటర్ దగ్గర, నరసరావుపేట (పొ),పల్నాడు జిల్లా.

OPPONENT 3 : దేవరపల్లి శ్రీకాంత్ S/o. నరసింహ, వయస్సు : 45, బిజినెస్, కాంట్రాక్ట్ వర్క్స్, డి.నెం.2-1-273, గాంధి స్టాట్యూ దగ్గర, గద్దలగుంట, ఒంగోలు (పొ), ప్రకాశం జిల్లా.

OPPONENT 4 : కత్తి ఝాన్సీరాణి, W/o. అంకబాబు, వయస్సు : 40, ఫ్లాట్ నెం. 501, శ్రీనివాసా టవర్స్ అపార్ట్‌మెంట్స్, 60 ఫీట్ రోడ్డు, ప్రకాష్‌నగర్, నరసరావుపేట (పొ), పల్నాడు జిల్లా.

పైన తెలియచేసిన Disputeకి సంబంధించి, వెంకట తిరుమల చిట్‌ఫండ్ కంపెనీవారు మీపై చిట్‌రిజిస్ట్రారు గారి కోర్టులో పైనంబరుపైన Dispute దాఖలు చేసి ఉన్నారు. అందుకు సంబంధించి ఎన్ని పర్యాయములు మీకు నోటీసులు జారీ చేసినను మీరు తీసుకొనక కాలయాపన చేయుచున్నందువల్ల పైనంబరు Disputeలో మీకు నోటీసులు జారీ కాగలందులకు గాను, ఈ పేపరు ప్రకటన ద్వారా తెలియపరచవలసిందిగా ఆర్డరు చేసినారు. కావున మీరు ది.30-08-2025వ తేదీన ఉదయం గం॥ 10-30ని॥లకు నర్సరావుపేట చిట్‌రిజిస్ట్రార్ గారి కోర్టులో హాజరు అయ్యి, మీకు గల ఆక్షేపణలను స్వయంగా గాని, లేక న్యాయవాది ద్వారా గాని తెలియచేసుకొనగలరు. లేని యెడల మీపై పరోక్షంగా పై Dispute 174/2023 నందు తీర్మానం చేయబడునని ఈపేపరు ప్రకటన ద్వారా తెలియచేయటమైనది.

వాయిదా తేదీ : 30-08-2025, నర్సరావుపేట, పల్నాడు జిల్లా.

ఇట్లు : మేనేజరు / ఫోర్‌మెన్

వెంకట తిరుమల చిట్‌ఫండ్(ప్రై)లిమిటెడ్
నర్సరావుపేట.



పెచ్చులూడి ప్రమాదకరంగా ఉన్న బీసీ బాలుర వసతిగృహం



నిరుపయోగంగా ఉన్న మరుగుదొడ్లు



అధ్వానంగా ప్రాంగణం

బీసీ బాలుర హాస్టల్‌లో వసతులు కరువు

- అక్కడ ఉండాలంటే సాహసమే
- ఏళ్లు గడిచినా అభివృద్ధికి నోచుకోని వైనం
- నీటి సమస్యతో విద్యార్థులు సతమతం

పొదిలి, ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి) : పొదిలి ప్రభుత్వ బీసీ బాలుర వసతి గృహంలో మౌలిక వసతులు లేక విద్యార్థులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. ఏళ్లు గడుస్తున్నా వసతుల కల్పనలో అధికారులు ఎలాంటి చర్యలుచేపట్టలేదని తల్లిదండ్రులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దీంతో హాస్టల్‌లో చేర్పేందుకు పలువురు తల్లిదండ్రులు వెనక్కి తగ్గుతున్నారు. 30 ఏళ్ల కిందట నిర్మించిన పాత భవనంలో వసతి గృహం కొనసాగుతుంది. వసతి గృహంలో ఏళ్ల తరబడి నీటి కొరత, మరుగుదొడ్ల సమస్య తీవ్రంగా ఉన్నా ఉన్నతాధికారులు కనీసం పట్టించుకోకపోవడం చోచనీయమని విద్యార్థుల ల తల్లిదండ్రులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పాతభవనం కావడంతో స్లాబు నుంచి పెచ్చులూడి ప్రమాదకరంగా ఉంది. ఎప్పుడు ఏం జరుగుతుందోనని భయపడుతున్నారు. గతంలో వసతి గృహంలో సుమారుగా 70 మంది విద్యార్థులకుపైగా ఉండేవారు. అయితే వసతి గృహం పరిస్థితి చూసిన తరువాత ఈఏడాది 49మంది మాత్రమే ఉన్నారు. వారిలో 10మంది రావడంలేదు. అంతేకాకుండా వసతి గృహం తులపులు, కిటికీలు ప్రమాదకరంగా ఉన్నాయి. పట్టణానికి దూరంగా ఉన్న బాలుర వసతి గృహానికి చుట్టూ ప్రహరీ లేకపోవడంతో విషపురుగులు వస్తాయోనని విద్యార్థులు భయపడుతున్నారు. మరుగుదొడ్లు లేకపోవడంతో మలవిసర్జనకు విద్యార్థులు బైటకు వెళ్లాల్సిన దుస్థితి ఉంది. చీకట్లలో ఎలాంటి ప్రమాదం జరుగుతుందోనని వాపోతున్నారు. స్నానపు గదులు లేక ఆరుబయటే స్నానాలు చేస్తున్నారు. బోరులో నీరు అడుగంటి పోవడంతో చేతిపంపు నిరుపయోగంగా ఉంది. స్నానం చేయాలన్నా, దుస్తులు ఉతుక్కోవాలన్నా, మరుగు దొడ్లకు వెళ్లాలన్నా ట్యాంకరు నీటిపైనే ఆధారపడాల్సి వస్తోందని చెప్తున్నారు. దాహం తీర్చుకోవాలంటే మినరల్ వాటరే దిక్కు. గత వైసీపీ పాలనలో కనీస వసతులు కల్పించడంలో విఫలమైందని, ప్రస్తుత పరిస్థితిని ఉన్నతాధికారులు పరిశీలించి ప్రజా ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి వసతుల కల్పనకు కృషి చేయాలని విద్యార్థులు, తల్లిదండ్రులు విజ్ఞప్తి చేస్తున్నారు.



కొత్త దిమ్మెల నిర్మాణానికి తోలిన మెటీరియల్

దిమ్మెల ఏర్పాటుకు చర్యలు

ప్రమాదకర ట్రాన్స్‌ఫార్మర్లపై స్పందించిన అధికారులు

తర్లుపాడు, ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి) : తర్లుపాడు నుంచి మార్కాపురం వెళ్లే రహదారులో, హిందూ ప్రాథమిక పాఠశాల ఎదురుగా ఉన్న విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌ల దిమ్మెలు శిథిలావస్థకు చేరడంతో ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందోనని స్థానికులు ఆందోళన చెందుతున్నారు. ప్రమాదకరంగా ట్రాన్స్‌ఫార్మర్లు అనే శీర్షికతో వార్త ఈనెల 10న ఆంధ్రజ్యోతిలో ప్రచురితం కావడంతో స్పందించిన అధికారులు ఎట్టకేలకు శిథిలావస్థకు చేరిన ట్రాన్స్‌ఫార్మర్‌లన్నింటి వద్ద కొత్త దిమ్మెలను ఏర్పాటు చేయాలని అధికారులు ఆదేశాలు ఇవ్వడంతో 5 దిమ్మెల వద్ద కొత్త దిమ్మెలు ఏర్పాటు చేసేందుకు, రక్షణ కంచెలు ఏర్పాటు చేసేందుకు కూడా నిధులు మంజూరైనట్లు ఏఈ హనుమాన్ నాయక్ తెలిపారు. వెంటనే కొత్త దిమ్మెలు ఏర్పాటు చేస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు. దీంతో ప్రమాదభరితంగా ఉన్న ట్రాన్స్‌ఫార్మర్‌ల వద్ద కొత్త దిమ్మెలు ఏర్పాటు చేస్తుండడంతో ప్రజలు ఊపిరిపీల్చుకున్నారు. ముఖ్యంగా హిందూ ప్రాథమిక పాఠశాల ఎదురుగా ఉన్న దిమ్మె నిర్మించడంతో ఇటు వాహనదారులు, విద్యార్థులు, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు హర్షం వ్యక్తం చేశారు.

కంభం వాసి వెంకటేశ్వర్‌రెడ్డికి డాక్టరేట్



కంభం, ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి) : పట్టణానికి చెందిన కుందూరు వెంకటేశ్వర్‌రెడ్డికి కాకినాడ జవహర్‌లాల్ నెహ్రూ సాంకేతిక విశ్వవిద్యాలయం వారు డాక్టరేట్ అవార్డు ఇచ్చినట్లు తెలిసింది. ఈసందర్భంగా అవార్డు గ్రహీత వెంకటేశ్వర్‌రెడ్డి మాట్లాడుతూ ఎఫిషియంట్ బీఎల్ఎస్ఐ ఇంప్లిమేటర్స్‌పై పరిశోధన చేసినందుకు డాక్టరేట్ ఇచ్చినట్లు తెలిపారు. వెంకటేశ్వర్‌రెడ్డి కంభం పట్టణంలో పాఠశాల విద్యను పూర్తి చేసి ఇంటర్ గుంటూరులో, పుల్లారెడ్డి ఇంజనీరింగ్ కళాశాల కర్నూలులో బీటెక్ పూర్తి చేసి జేఎన్‌టీయూ అనంతపురం నుంచి ఎంటెక్ పూర్తి చేశారు. ప్రస్తుతం నల్లపాడులోని మద్ది బాలాత్రిపురసుందరమ్మ ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో ఎలక్ట్రానిక్స్, కమ్యూనికేషన్ ఇంజనీరింగ్ విభాగంలో లెక్చరర్‌గా పని చేస్తున్నారు.

సుఖీభవ అందనివారు 20లోపు దరఖాస్తు చేసుకోవాలి

కంభం, ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి) : అర్హత ఉండి అన్నదాత సుఖీభవ రానివారు ఈనెల 20వ తేదీలోపు రైతు సేవా కేంద్రాలలో దరఖాస్తు చేసుకోవాలని వ్యవసాయాధికారి షేక్ మహమ్మద్ తెలిపారు. గురువారం కంభం మండలం ఎల్‌కోట, నడింపల్లి గ్రామాలలో పొలం పిలుస్తోంది కార్యక్రమంలో ఏర్పాటు చేసి రైతులకు సూచనలు చేశారు. అన్నదాత సుఖీభవ రావలసిన వారు ఆధార్ కార్డు, పొలం పాస్ పుస్తకం, తదితర వాటితో దరఖాస్తు చేసుకోవాలన్నారు. ప్రస్తుతం సాగు చేస్తున్న పంటలను నమోదు చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో గ్రామ వ్యవసాయ సహాయకులు లక్ష్మి, రైతులు పాల్గొన్నారు.

సమాచార హక్కు చట్టంపై అవగాహన

మార్కాపురం రూరల్ 14 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని రాయవరం గ్రామం డివిజనల్ సహకార అధికారి కార్యాలయం వద్ద సమాచార హక్కు చట్టంపై గురువారం సిబ్బంది అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సహకార సంఘం డివిజనల్ అధికారి రాజశేఖర్ మాట్లాడుతూ ప్రభుత్వ పథకాల అమలు నిర్ణయాల, పనితీరులో జవాబుదారీతనం కోసం 2005లో కేంద్ర ప్రభుత్వం ఈ చట్టాన్ని తెచ్చిందన్నారు. దీనిపై ప్రజలు అవగాహన కలిగి ఉండాలన్నారు.

మసీద్‌లో నిప్పంటించిన దుండగులు

త్రిపురాంతకం, ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి) : దూపాడు గ్రామంలో ఉన్న మసీద్‌లో రాత్రిపూట చొరబడి గుర్తుతెలియని దుండగులు నిప్పంటించారు. గురువారం ఉదయాన్నే బయటపడిన ఘటనపై గ్రామంలో కలకలం రేగింది. దూపాడులో ఉన్న మసీద్‌లో యథావిధిగా బుధవారం రాత్రి నమాజ్ ముగించుకున్న తరువాత తాళాలు వేసి వెళ్లారు. ఉదయాన్నే తలుపులు తెరచి చూడగానే లోపల ఉన్న తివాచీలన్నీ తగులబడి కనిపించాయి. వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వడంతో సీఐ హసన్, ఎస్సై శివబసవరాజు, దర్శి డీఎస్పీ లక్ష్మీనారాయణ మసీద్‌ను పరిశీలించారు. తాళాలు పగులగొట్టినట్టు గుర్తించిన పోలీసులు అందుకు ఉపయోగించిన రాయి, తాళంపై వేలిముద్రలను సేకరించారు. పోలీసు జాగిలం ద్వారా పరిసరాల్లో గాలించగా జాగిలం అక్కడి నుంచి నడిగడ్డ వెళ్లే రోడ్డు వరకు వెళ్లి తిరిగి బస్టాప్ వద్ద ఆగింది. ఘటనపై డీఎస్పీ లక్ష్మీనారాయణ మాట్లాడుతూ దర్యాప్తు వేగంగా చేపట్టి నిందితులను త్వరలోనే పట్టుకుంటామని చెప్పారు.

విద్యుత్ వాహనం ఢీకొని యాచకుడికి గాయాలు

కంభం, ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి): వేగంగా వస్తున్న విద్యుత్ వాహనం రోడ్డు దాటుతున్న యాచకుడికి ఢీకొనడంతో తీవ్రగాయాలైన ఘటన గురువారం రాత్రి జరిగింది. వివరాల్లోకి వెళితే కంభం పట్టణంలో భిక్షాటన చేస్తున్న యాచకుడు జాతీయ రహదారిపై రోడ్డు దాటుతుండగా వర్షం పడుతుండడంతో కనిపించక వేగంగా వస్తున్న విద్యుత్ వాహనం అదుపు చేయలేక బలంగా ఢీకొన్నది. దీంతో యాచకుడు కిందపడడంతో డ్రైవర్ వాహనం వదిలి పారిపోయాడు. 108కు సమాచారం అందించగా యాచకుడిని కంభం ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. రోడ్డుకు అడ్డంగా ఉన్న వాహనాన్ని పోలీసులు తొలగించారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై నరసింహారావు తెలిపారు.



గోపీకృష్ణుల వేషధారణలో వాసవీ విద్యార్థులు

ముందస్తు కృష్ణాష్టమి సంబరాలు

మార్కాపురం వన్‌టౌన్, ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి) : వాసవీ విద్యా నికేతన్, సాయి బాలాజీ పాఠశాలలో ముందస్తు కృష్ణాష్టమి వేడుకలు గురువారం నిర్వహించారు. వాసవీ పాఠశాలలో ప్రధానోపాధ్యాయుడు కందెపు రంగయ్య ఆధ్వర్యంలో ఉట్టి కొట్టే కార్యక్రమం నిర్వహించారు. బాలబాలికలు కృష్ణుడు, గోపికల వేషధారణలో నృత్యాలు చేశారు. ఈ కార్యక్రమంలో ఏవో రంజిత్ కుమార్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు. సాయి బాలాజీ ఉన్నత పాఠశాలలో ప్రిన్సిపాల్ సయ్యద్ మస్తాన్ వలి ఆధ్వర్యంలో కృష్ణాష్టమి సంబరాలు నిర్వహించారు. 600 మంది బాలబాలికలు గోపీ కృష్ణుల వేషాలు ధరించారు.

విద్యార్థుల సంఖ్య పెంచాలి

రాచర్ల, ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి) : ఎయిడెడ్ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య పెంచాలని విద్యాశాఖ అధికారి షేక్ మొయినుద్దీన్ అన్నారు. మండలంలోని ఒద్దులవాగుపల్లి ప్రాథమిక, ఉన్నత పాఠశాలలను గురువారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య ఆశించిన స్థాయిలో లేదని, బోగస్ రోల్ ఉంటే ఉపేక్షించమని హెచ్చరించారు. నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరించవద్దని సిబ్బందికి సూచించారు. విద్యార్థులను ప్రశ్నలు అడిగిన ఆయన వారి నుంచి సరైన సమాధానం రాకపోవడంతో అసంతృప్తి వ్యక్తం చేశారు. అభ్యసనాల సామర్థ్యాలను పరిశీలించి లోటుపాట్లు సరిచేసుకోవాలని సిలబస్ నిర్ణీత సమయంలో పూర్తి చేయాలని తెలిపారు. పాఠశాల పరిసరాలు, తరగతి గదులు, మధ్యాహ్న భోజనం, వాటి వివరాలు, పాఠశాల రికార్డులను పరిశీలించారు. ఎంఈవో వెంట సీఆర్పీలు, పాఠశాల సిబ్బంది ఉన్నారు.

పథకాలను ఉపయోగించుకోవాలి

మార్కాపురం వన్‌టౌన్, ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి) : భవన నిర్మాణ కార్మికులు సంక్షేమ పథకాలు ఉపయోగించుకోవాలని హౌసింగ్ డీఈ పవన్ కుమార్ అన్నారు. స్థానిక పూలసుబ్బయ్య భవన్‌లో గురువారం భవన నిర్మాణ కార్మికులు, మేస్త్రీలకు అవగాహన సదస్సు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. భవన నిర్మాణ కార్మికుల్లో నైపుణ్యం పెంపొందించడానికి ఒంగోలులో సెల్ఫ్ ఎంప్లాయిమెంట్ ట్రైనింగ్ ఇనిస్టిట్యూట్ ద్వారా శిక్షణ శిబిరాలు ఏర్పాటు చేశామన్నారు. 18 నుంచి 45 సంవత్సరాల లోపు వారు అర్హులని, శిక్షణ కాలంలో ఉచిత వసతి, భోజనం కల్పించి సర్టిఫికెట్లు ఇస్తారన్నారు. సొంత స్థలాలు ఉన్న వారికి హౌసింగ్ లోన్ ఇస్తామన్నారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ నాయకులు షేక్ కాశీం, మేస్త్రీల సంఘం నాయకులు షేక్ బాషా, బుచ్చిబాబు, నన్నెసా, హౌసింగ్ వర్క్ ఇన్‌స్పెక్టర్ నరసింహారెడ్డి పాల్గొన్నారు.

నేటి నుంచి రంగనాయక స్వామి విగ్రహ ప్రతిష్ఠోత్సవాలు

మార్కాపురం రూరల్, ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని బోడపాడు గ్రామంలో శ్రీదేవి, భూదేవి సమేత రంగనాయక స్వామి విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవ కార్యక్రమాలు శుక్రవారం నుంచి మూడు రోజు జరుగుతాయని నిర్వాహకులు తెలిపారు. రంగనాయక స్వామి ప్రతిష్ఠ సందర్భంగా ప్రత్యేక పూజలతోపాటు ఆదివారం ప్రాణప్రతిష్ఠ, యంత్ర స్థాపన, నూతన విగ్రహ ధ్వజ, కుంభ ప్రోక్షణ, శాంతి కల్యాణం, మహాదా ఆశీర్వాదం, అన్నదానం ఏర్పాటు చేసినట్లు తెలిపారు. రోజూ సాయంత్రం కోలాటం, సాంస్కృతిక కార్యక్రమాలు ఉంటాయని తెలిపారు. టీటీడీ వేద పండితులు అనంతాచార్యులు బృందంతో పూజా కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ప్రతిష్ఠోత్సవాలకు భక్తులు, ప్రజలు హాజరు కావాలని కోరారు.

బేల్దారి మేస్త్రి శిక్షణకు దరఖాస్తుల ఆహ్వానం

రాచర్ల, ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి) : బేల్దారి మేస్త్రి శిక్షణకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు గిద్దలూరు గృహ నిర్మాణ శాఖ డీఈ షేక్ ఖదీర్ బాషా గురువారం తెలిపారు. ప్రధానమంత్రి ఆవాస్ యోజన గ్రామీణ పథకం కింద గ్రామీణ మేస్త్రి శిక్షణ కోసం ఈ దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ఆయన తెలిపారు. ఆసక్తిగల అభ్యర్థులు బీపీఎల్ కార్డు కలిగి ఉండి 18 నుంచి 45 సంవత్సరాలలోపు కలవారై ఉండాలన్నారు. స్థానికులకు, నిరుద్యోగ యువతకు ప్రాధాన్యత ఇస్తారన్నారు. శిక్షణ 31రోజులు ఒంగోలులో ఉంటుందని ఉచిత భోజన వసతి కల్పిస్తారన్నారు. పిల్లర్ నిర్మాణాల్లో నాణ్యత మెరుగు పరచడం, సకాలంలో, సాంకేతికతతో కూడుకొని ఉండేలా చూడడం, యువతకు నైపుణ్య ధ్రువీకరణ, వృత్తి పరమైన అభివృద్ధి అవకాశాలు కల్పించడం, ఆర్థిక వ్యవస్థలో ప్రత్యక్ష, పరోక్ష ఉపాధిని కల్పించడం నేషనల్ స్కిల్ క్వాలిఫికేషన్ ఫ్రేమ్ వర్క్‌కు అనుగుణంగా ఆన్ సైట్ శిక్షణ అందించడం ప్రధాన అంశాలుగా ఉంటాయన్నారు. ఆసక్తిగల నిరుద్యోగులు ఈ అవకాశంను సద్వినియోగం చేసుకోవాలన్నారు.

మట్టి మిద్దెల్లో నివాసముండేవారు జాగ్రత్తగా ఉండాలి



కూలిన మట్టిమిద్దెను పరిశీలిస్తున్న తహసీల్దార్ వెంకటేష్

రాచర్ల, ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి) : మట్టి మిద్దెలో ఉంటున్న కుటుంబాల వారు ప్రస్తుతం కురుస్తున్న వర్షాలను దృష్టిలో ఉంచుకొని అప్రమత్తంగా ఉండాలని తహసీల్దార్ ఎల్.వెంకటేశ్వర్లు అన్నారు. రెండు మూడు రోజులుగా ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలకు స్థానిక బీసీ కాలనీలో బుధవారం రాత్రి కూలిన మట్టిమిద్దెను గురువారం ఆయన పరిశీలించారు. జరిగిన నష్టం తదితర వివరాలను బాధితుడు మండ్ల చిన్న పుల్లయ్యను అడిగి తెలుసుకున్నారు. జరిగిన నష్టాన్ని ఉన్నతాధికారులకు వివరించి నష్టపరిహారం అందేలా చర్యలు తీసుకుంటామన్నారు. పరిసర ప్రాంతాల్లో మట్టి ఇళ్లల్లో ఉంటున్నవారిని తహసీల్దార్ కలిసి జాగ్రత్తగా ఉండాలని సూచించారు. ఆయనవెంట ఆర్ఐ హర్ష, వీఆర్వో శివయ్యలు ఉన్నారు.

ప్రజాస్వామ్యం గెలిచింది

పులివెందుల, ఒంటిమిట్టలో టీడీపీ విజయంపై సంబరాలు



స్వీట్లు తినిపిస్తున్న ఏఎంసీ మాజీ చైర్మన్ సుబ్బారెడ్డి

మార్కాపురం, ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి): కడప జిల్లా పులివెందుల, ఒంటిమిట్టలో జరిగిన ఉప ఎన్నికల్లో ప్రజాస్వామ్యం గెలిచిందని ఏఎంసీ మాజీ చైర్మన్ ఎస్‌సీవీకే నిలయం (రీడింగ్ రూమ్) కార్యదర్శి గుంటక సుబ్బారెడ్డి అన్నారు. స్థానిక ఎస్‌సీవీకే నిలయంలో టీడీపీ నాయకులు గురువారం విజయోత్సవ సంబరాలను నిర్వహించారు. స్వీట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సుబ్బారెడ్డి మాట్లాడుతూ ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం పాలుచేస్తూ వైసీపీ నాయకులు సాగించిన దమనకాండను ప్రజలు తిప్పికొట్టారన్నారు. ప్రజా చైతన్యం ఏ విధంగా ఉంటుందో రెండు మండలాల్లో వచ్చిన ఫలితాలను బట్టి అర్థమవుతోందన్నారు. ప్రజా ప్రభుత్వంలో ప్రజా రంజకంగా పాలన సాగుతుంటే సహించలేని వైసీపీ శ్రేణులు ముఖ్యమంత్రి చంద్రబాబు, మంత్రి లోకేష్‌పై లేనిపోని అబద్ధాలను ప్రచారం చేయడం దారుణమన్నారు. ఇప్పటికైనా వైసీపీ నాయకులు కళ్లు తెరిచి వాస్తవాల్ని గ్రహించాలని హితవు పలికారు. కార్యక్రమంలో పార్టీ రాష్ట్ర పరిశీలకులు శాసనాల వీరబ్రహ్మం, మాజీ మున్సిపల్ వైస్‌చైర్మన్ షేక్ షెక్షావలి, సీనియర్ నాయకులు కనిగిరి బాలవెంకటరమణ, 27వ వార్డు కౌన్సిలర్ కశ్శెట్టి నగేష్, మాజీ కౌన్సిలర్ మయూరి ఖాశిం, గులాబ్, గఫార్, ఐకే నాయుడు తదితరులు పాల్గొన్నారు.

విజేతలకు బహుమతుల ప్రదానం

గిద్దలూరు, ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి): ప్రజా సంకల్ప వేదిక ఆధ్వర్యంలో అవినీతి నిర్మూలన కోసం విద్యార్థుల పాత్ర అనే అంశంపై ఇండో ఉన్నత పాఠశాల, సాయి ఒకేషనల్ జూనియర్ కళాశాల విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహించారు. ఇండో స్కూలులో షేక్ ఆస్మా, కె.మేఘన, ఎం.వి.సాయివర్షిణి, సాయి ఒకేషనల్ జూనియర్ కళాశాలలో కె.వి.స్వప్న, జి.జాహ్నవి, బి.నిర్మల మొదటి 3 స్థానాలు సాధించగా ప్రజా సంకల్ప వేదిక రాష్ట్ర అధ్యక్షుడు మదిరె రంగసాయిరెడ్డి బహుమతులు అందచేశారు. ఆయా పాఠశాలల సిబ్బంది పాల్గొన్నారు.

దివ్యాంగులను ఆదరించాలి

మార్కాపురం వన్‌టౌన్, ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి) : సమాజంలో దివ్యాంగులను ఆదరించాలని బీజేపీ మైనార్టీ మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షురాలు షేక్ షబానా అన్నారు. స్థానిక జవహర్ నగర్ కాలనీలోని స్ఫూర్తి మానసిక దివ్యాంగుల పాఠశాలలో ఆమె గురువారం స్వాతంత్ర్య దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా దివ్యాంగులకు పండ్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు కృష్ణారావు, సుబ్బారావు పాల్గొన్నారు.

జాతీయ జెండాల పంపిణీ

గిద్దలూరు, ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ముండ్లపాడు గ్రామంలోని పలు పోలింగ్ బూతుల పరిధిలో బీజేపీ నాయకులు జాతీయ జెండాలను పంపిణీ చేశార విద్యార్థిని,విద్యార్థులు పాల్గొన్నారు. కార్యక్రమంలో భాగంగా జాతీయ జెండాలను ఇళ్లపై ఎగురవేసే విధంగా చర్యలు చేపట్టారు. కార్యక్రమంలో ఓబీసీ మోర్చా జిల్లా ప్రధాన కార్యదర్శి దూదేకుల బాదుల్లా, బీజేపీ నాయకులు సుబ్బరాయుడు పాల్గొన్నారు.



తిరంగా ర్యాలీలో పాల్గొన్న అధ్యాపకులు, విద్యార్థులు

హర్ ఘర్ తిరంగా ర్యాలీ

ఎర్రగొండపాలెం, ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి) : ప్రధాని మోదీ పిలుపు మేరకు గురువారం ఎర్రగొండపాలెంలో ప్రభుత్వ మోడల్ డిగ్రీ కాలేజీ, జూనియర్ కాలేజీ అధ్యాపకులు, విద్యార్థులు హర్ ఘర్ తిరంగా ర్యాలీని నిర్వహించారు. ప్రధాన సెంటర్‌లో విద్యార్థులతో మానవహారం నిర్వహించారు. డిగ్రీ కాలేజీ ప్రిన్సిపాల్ గుత్తా శ్రీధర నాయుడు జాతీయ జెండా, స్వాతంత్ర్య సమరయోధుల త్యాగాలను వివరించారు. అధ్యాపకులు, సిబ్బంది పాల్గొన్నారు.

పింఛన్ పొందుతున్న అనర్హులకు నోటీసులు

వైసీపీ పాలనలో 126 మంది లబ్ధిదారులుగా ఎంపిక

రాచర్ల, ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి) : మండలంలో సామాజిక పింఛన్లు పొందుతున్న 126 మందికి ప్రభుత్వం నోటీసుల జారీకి రంగం సిద్ధం చేసింది. వీరిలో కొందరు అనర్హులు కాగా, మరికొందరు రూ.15వేలు పొందే వారు ఆ స్థాయి నుంచి రూ.6వేలకు, రూ.6వేలు పొందేవారు రూ.4వేలకు మార్చినట్లు తెలిసింది. ఇలా పింఛన్‌లు పొందుతున్నవారు అర్హులు కారని ప్రభుత్వం గుర్తించి వారి అర్హతను బట్టి పరిశీలించి కొందరి పింఛన్‌లను రద్దు చేయగా, మరికొందరివి మార్పు చేసినట్లు తెలిసింది. ప్రస్తుతం వీరందరికీ ప్రభుత్వ ఆదేశాల మేరకు నోటీసులు జారీ చేస్తున్నట్లు సంబంధిత అధికారులు తెలిపారు. ఆకవీడు -1, 6, ఆకవీడు -2, 3, చోళ్లవీడు 7, చిన్నగానిపల్లి 4, జేపీచెరువు 13, అనుములపల్లి 5, రాచర్ల-1, 6, రాచర్ల-2, 2, అనుములవీడు 13, సోమిదేవిపల్లి 3, గుడిమెట్ట, ఒద్దులవాగుపల్లి కలిపి 21, యడవల్లి 38, సత్యవోలు 5 ఉన్నట్లు తెలిసింది. కాగా గత వైసీపీ హయాంలో వీరు లబ్ధిదారులుగా పింఛన్ పొందుతున్నారు.

డ్రోన్లతో పిచికారీపై శిక్షణ



ప్రసంగిస్తున్న ఏవో విజయభాస్కర్‌రెడ్డి

గిద్దలూరు, ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని దిగువమెట్ట గ్రామంలో ఆత్మ పథకంలో భాగంగా డ్రోన్లు ఉపయోగించి పురుగు మందును పిచికారీ చేయడంపై శిక్షణ కార్యక్రమం ఇచ్చారు. వ్యవసాయాధికారి ఎం.విజయభాస్కర్‌రెడ్డి మాట్లాడుతూ పెరుగుతున్న సాంకేతిక పరిజ్ఞానంతో డ్రోన్ల ద్వారా పురుగుమందుల పిచికారీ, అలాగే ఎరువులను చల్లడం లాంటివి చేయడం ద్వారా సమయం ఆదా అవుతుందని, కచ్చితత్వం పెరుగుతుందని, మానవశ్రమ తగ్గుతుందని అన్నారు. డ్రోన్ల సహాయంతో పంటలపై పురుగు మందులను సులభంగా, వేగంగా, కచ్చితత్వంతో పిచికారీ చేయవచ్చన్నారు. అలాగే ఎరువులను కూడా డ్రోన్లు పంటలపై చల్లుతాయని, తద్వారా పంట పెరుగుదలను మెరుగుపరుస్తాయని అన్నారు. డ్రోన్లకు అమర్చిన కెమెరాలు, సెన్సార్ల సహాయంతో పంటల ఆరోగ్యాన్ని తెలుసుకోవచ్చని, తెగుళ్లు లేదా వ్యాధులు సంభవిస్తే డ్రోన్ల ద్వారా గుర్తించి నివారణ చర్యలు తీసుకోవచ్చన్నారు. ఎకరా పొలానికి 5 నిమిషాలలోనే పురుగుమందులు పిచికారీ చేయవచ్చన్నారు. పంటల దిగుబడిని కూడా డ్రోన్ల ద్వారా అంచనా వేయవచ్చని, నీటి పారుదల నిర్వహణలో సహాయం పొందవచ్చన్నారు. కార్యక్రమంలో వ్యవసాయ విస్తరణాధికారి శ్రీకాంత్‌రెడ్డి, ఉద్యాన సహాయకురాలు కిరణ్మయి పాల్గొన్నారు.

సీపీఐ రాష్ట్ర మహాసభలను విజయవంతం చేయాలి

పామూరు, ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి): ఒంగోలులో ఈనెల 23 నుంచి 25 తేది వరకు జరిగే సీపీఐ రాష్ట్ర మహాసభల్లో పాల్గొని విజయవంతం చేయాలని ఆపార్టీ జిల్లా కార్యవర్గ సభ్యుడు సయ్యద్‌మౌలాలి పిలుపునిచ్చారు. స్థానిక జీవైఆర్ భవన్‌లో గురువారం మహాసభలకు సంబంధించిన వాల్‌పోస్టర్లను ఆవిష్కరించారు. కార్యక్రమంలో వజ్రాల సుబ్బారావు, పి.ప్రభాకర్, పాలపర్తి మస్తాన్‌రావు, ఆర్. సూరిబాబు, తదితరులు పాల్గొన్నారు.

యాజమాన్య పద్ధతులపై శిక్షణ

సీఎస్‌పురం(పామూరు), ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి): ఖరీఫ్ సీజన్ నందు సాగు చేసే పంటలలో చేపట్టాల్సిన మేలైన యాజమాన్య పద్ధతులపై రైతులకు శిక్షణ ఇస్తున్నట్టు ఏవో పి.మధుబాబు తెలిపారు. గురువారం మండలంలోని పెదగోగులపల్లి గ్రామంలో ఆత్మ ఒంగోలు వారి సహకారంతో జరిగిన శిక్షణలో ఆయన మాట్లాడారు. రసాయనికి ఎరువుల వాడకం తగ్గించి ప్రకృతి వ్యవసాయాన్ని పోత్సాహి ంచాలని సూచించారు. కార్యక్రమంలో వ్యవసాయా విస్తరణాధికారి పి.శ్రీనివాసులు పాల్గొన్నారు.

వేగ నియంత్రణ కలిగిఉండాలి

పామూరు, ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి): ద్విచక్ర వాహనదారులు వేగ నియంత్రణ కలిగి ఉండి ప్రమాదాల బారి నుంచి రక్షించుకోవాలని సీఐ భీమానాయక్ సూచించారు. ఎస్పీ దామోదర్, కనిగిరి డీఎస్పీ ఈశ్వర్‌సాయియశ్వంత్ ఆదేశాల మేరకు పామూరు సర్కిల్ పరిధిలోని పామూరు, సీఎస్‌పురం, వెలిగండ్ల పోలీస్‌స్టేషన్ పరిధిలో గురువారం ఓవర్ స్పీడ్‌పై ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా పామూరులో ఎస్ఐ కిశోర్‌బాబుతో కలిసి ఓవర్‌స్పీడ్‌తో వెళుతున్న 13 మంది ద్విచక్రవానాదారులపై ఓవర్‌స్పీడ్ కేసులు నమోదు చేసినట్లు తెలిపారు.

చికిత్సపొందుతూ వ్యక్తి మృతి

పీసీపల్లి, ఆగస్టు 14(ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదంలో గాయపడిన వ్యక్తి చికిత్స పొందుతూ మృతిచెందాడు. ఈఘటనపై పీసీపల్లి పోలీసులు గురువారం కేసు నమోదు చేశారు. కనిగిరి మండలం వెన్నపూసపల్లి గ్రామానికి చెందిన ఒంగేపురం వెంకటయ్య(52) ఇటీవల కొత్తపల్లి గ్రామానికి వెళ్లివస్తున్నాడు. ఈక్రమంలో పీసీపల్లి మండలం చింతలపాలెం సమీపంలో ఆయన ప్రయాణిస్తున్న ఆటో అదుపుతప్పి బోల్తా పడింది. ఈప్రమాదంలో గాయపడిన వెంకటయ్యను చికిత్సకోసం కుటుంబసభ్యులు కనిగిరిలోని ఓ వైద్యశాలకు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మృతిచెందాడు. గురువారం మృతుని కుమారుడు రవిబాబు పోలీసులకు ఫిర్యాదు చేశాడు. పోలీసులు కేసునమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ముండ్లమూరు మండలాన్ని ప్రకాశం జిల్లాలోనే కొనసాగించాలి

ముండ్లమూరు, ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి): ముండ్లమూరు మండలాన్ని కొత్తగా ఏర్పడే మార్కాపురం జిల్లాలో కలపకుండా పాత జిల్లాలోనే ఉంచాలని పలువురు పేర్కొన్నారు. ఈమేరకు గురువారం ముండ్లమూరులో కొంతమంది సంతకాలతో కూడిన వినతి పత్రాన్ని డిప్యూటీ తహసీల్దార్ రావూరి శ్రీకాంత్‌కు అందజేశారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ మార్కాపురంలో కలపటం వల్ల వంద కిలో మీటర్లు వెళ్లాల్సి వస్తుందన్నారు. రాజకీయ నాయకులు కూడా ఆలోచించి నిర్ణయం తీసుకోవాలని వారు కోరారు. వినతి పత్రం అందించిన వారిలో టీడీపీ నాయకులు బేతపూడి రామారావు, బోడపాటి చంద్రమౌళి, చాగంటి రాంబాబు, తదితరులు ఉన్నారు.

రోడ్డు ప్రమాదంలో వీఆర్వోకు గాయాలు

ముండ్లమూరు, ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి): ముండ్లమూరులోని ఎంపీడీవో కార్యాలయం ఎదుట గురువారం ఉదయం ద్విచక్ర వాహనం నుంచి జారిపడి పులిపాడు వీఆర్‌వో గర్నెపూడి కోటయ్యకు గాయాలయ్యాయి. పులిపాడు నుంచి ఆఫీసు పనిపై తహసీల్దార్ కార్యాలయానికి వస్తుండగా ఎంపీడీవో కార్యాలయం వద్ద వీధి కుక్కలు ద్విచక్ర వాహనాన్ని తగిలాయి. దీంతో వాహనంపై నుంచి పడిన వీఆర్‌వోకు గాయాలయ్యాయి. వెంటనే చికిత్స నిమిత్తం దర్శిలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చేర్పించారు. విషయం తెలుసుకున్న తహసీల్దార్ లక్ష్మీనారాయణ కోటయ్యను పరామర్శించారు.

ప్రతి ఇంటిపై జాతీయ జెండాను ఎగురవేయాలి

పామూరు, ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి): దేశ స్వాతంత్ర్య దినోత్సవం వేడుకలు సందర్భంగా ప్రజలందరూ హర్‌ఘర్ తిరంగా కార్యక్రమాలను ఘనంగా జరుపుకోవాలని బీజేపీ నియోజకవర్గ కన్వీనర్ కేవీ రమణయ్య పిలుపునిచ్చారు. టీడీపీ కూటమి ఆధ్వర్యంలో 79వ స్వాతంత్ర దినోత్సవం సందర్భంగా ఘర్‌ఘర్ తిరంగా కార్యక్రమంలో భాగంగా గురువారం ర్యాలీ నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఇంటిపై జాతీయ జెండాను ఎగురవేయాలని కోరారు. కార్యక్రమంలో యారవ శ్రీను, ఉప్పలపాటి హరిబాబు, పాలపర్తి వెంకటేశ్వర్లు, తదితరులు పాల్గొన్నారు.

మాజీ ఎమ్మెల్యే సుబ్బారెడ్డికి నివాళి

తాళ్లూరు, ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి): మాజీ ఎమ్మెల్యే బూచేపల్లి సుబ్బారెడ్డి జయంతి వేడుకలు గుంటి గుంగసన్నిధిలోగల తేజా వృద్ధాశ్రమంలో గురువారం ఘనంగా నిర్వహించారు. మాజీ ఎంపీపీ పోశం మధుసూదనరెడ్డి ఆధ్వర్యంలో కేక్ కట్ చేసి వృద్ధులకు పండ్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో గోళ్లపాటి మోషే, గుజ్జుల యోగిరెడ్డి, కటంకంశెట్టి శ్రీనివాసరావు, తదితరులు పాల్గొన్నారు.

అధ్వానంగా ఆర్టీసీ బస్టాండ్

» కనీస వసతులు లేక ఇబ్బందులు పడుతున్న ప్రయాణికులు




దర్శి ఆర్టీసీ బస్టాండ్

దర్శి, ఆగస్టు 14(ఆంధ్రజ్యోతి): స్థానిక ఆర్టీసీ బస్టాండ్‌లో కనీస వసతులు లేక ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారు. ఎంతోకాలంగా మరుగుదొడ్లు పనిచేయటం లేదు. మంచినీటి వసతి లేదు. స్టోరేజీ ట్యాంకుకు నీరు పెట్టకపోవటంతో కొళాయిలు నిరుపయోగంగా ఉన్నాయి. కూటమి ప్రభుత్వం మహిళలకు స్వాతంత్రదినోత్సవం సందర్భంగా శుక్రవారం నుంచి ఉచిత బస్సు సౌకర్యం కల్పిస్తున్న విషయం తెలిసిందే. ఈనేపథ్యంలో అనేకచోట్ల ఆర్టీసీ డిపోలను, బస్టాండ్‌లను మరమ్మతులు చేసి మౌలిక వసతులు కల్పించారు. అయితే, అధ్వానంగా ఉన్న దర్శి బస్టాండ్ గురించి అధికారులు పట్టించుకోలేదు. ఈవిషయంపై అధికారులను ఆంధ్రజ్యోతి వివరణ కోరగా మరమ్మతులు చేయిస్తున్నామని, వర్షాలతో జాప్యం జరిగిందని అన్నారు. గత నెలరోజుల ముందే ఆగస్టు 15 నుండి మహిళలకు ఉచిత బస్సు వసతి కల్పిస్తున్నట్లు ప్రకటించినప్పటికీ మరమ్మతులు చేయించి మౌలిక వసతులు కల్పించటంలో అధికారులు నిర్లక్ష్యవైఖరి అవలంబించారని ప్రజలు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు.

జగన్ బొమ్మకు చెక్

» రాజముద్రతో పట్టాదారు పాసుపుస్తకాల పంపిణీకి సిద్ధం
» దొనకొండ మండలానికి 790 మంజూరు

దొనకొండ, ఆగస్టు 14(ఆంధ్రజ్యోతి): గత వైసీపీ ప్రభుత్వం ప్రచార ఆర్భాటంతో జగన్ బొమ్మతో జగనన్న భూరక్ష పథకం అంటూ ముద్రించి రైతులకు పంపిణీ చేసిన పట్టాదారు పాస్ పుస్తకాలకు టీడీపీ కూటమి ప్రభుత్వం చెక్ పెట్టింది. వాటిని రద్దుచేసి రాజముద్రతో ముద్రించిన భూ యాజమాన్య హక్కు పత్రాలు(పట్టాదారు పాస్ పుస్తకాలు) అందించేందుకు సిద్ధం చేసింది. గత వైసీపీ పాలనలో మండలంలోని అనంతవరం, సిద్దాయిపాలెం, పి.లక్ష్మీపురం, రాగముక్కపల్లి గ్రామాల్లో భూముల రీసర్వే కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా రైతులకు ఇచ్చిన పాసు పుస్తకాలను అప్పటి సీఎం జగన్ ఫొటోతో ముద్రించి రైతులకు పంపిణీ చేశారు. ఈవిషయమై అప్పట్లో రైతులు ప్రశ్నించినా నాటి పాలకులు పట్టించుకోలేదు. అధికారంలోకి వచ్చిన టీడీపీ కూటమి ప్రభుత్వం ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీ మేరకు వాటిని రద్దు చేస్తూ రాజముద్రతో పట్టాదారు పాస్ పుస్తకాలు ముద్రించి అందించేలా ఆదేశాలు జారీ చేసింది. దీంతో రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.



గత వైసీపీ ప్రభుత్వంలో జగన్ బొమ్మతో పంపిణీ చేసిన పట్టాదారు పాస్ పుస్తకం



టీడీపీ కూటమి ప్రభుత్వం రాజముద్రతో సిద్ధం చేసిన పట్టాదారు పాస్ పుస్తకం

మండలానికి 790 పాస్‌పుస్తకాలు

- రమాదేవి, తహసీల్దార్



దొనకొండ మండలంలోని సిద్దాయిపాలెం, అనంతవరం, రాగముక్కపల్లి, లక్ష్మీపురం గ్రామాలకు చెంది న రైతులకు 790 పాస్ పుస్తకాలు మంజూరయ్యాయి. ఈగ్రామాల్లో రైతులకు గత ప్రభుత్వం మంజూరు చేసిన పట్టాదారు పాస్ పుస్తకాలను రద్దుచేసి ప్రస్తుత ప్రభుత్వం రాజముద్రతో ముద్రించిన పుస్తకాలను ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు అందజేస్తాం.

భైరవకోన మార్గంలో ముఖద్వారం ఏర్పాటుకు చర్యలు

» ఎమ్మెల్యే డాక్టర్ ఉగ్రనరసింహారెడ్డి



దేవస్థాన ఆర్చి నిర్మాణానికి స్థల పరిశీలన చేస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ ఉగ్ర

సీఎస్‌పురం(పామూరు), ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి): సీఎస్‌పురం మండలంలో ప్రముఖ పర్యాటక శైవ క్షేత్రమైన భైరవకోనకు వెళ్లేమార్గంలో ఏ కొత్తపల్లి గ్రామం వద్ద దుర్గా అమ్మవారి ముఖ ద్వారాన్ని ఏర్పాటు చేసేందుకు కృషి చేస్తున్నట్లు ఎమ్మెల్యే డాక్టర్ ఉగ్రనరసింహారెడ్డి తెలిపారు. ముఖద్వారం నిర్మించబోయే ప్రదేశాన్ని టీడీపీ శ్రేణులతో కలిసి గురువారం పరిశీలించారు. ముఖద్వారం వద్ద డబుల్‌రోడ్డు నిర్మాణాన్ని చేపట్టాలని అధికారులకు సూచించారు. ముఖ ద్వారానికి మధ్య భాగంలో అమ్మవారి ఫొటోను, విద్యుత్ లైట్లను అమర్చేవిధంగా నిర్మాణం చేపట్టాలని సూచించారు. భైరవకోన క్షేత్రాన్ని పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దేందుకు చర్యలు తీసుకుంటున్నట్టు చెప్పారు. కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు బొమ్మనబోయిన వెంగయ్య, జిల్లా షీప్ సొసైటీ చైర్మన్ తోడేటి గోపి, మన్నేపల్లి కార్తీక్, చావా శేఖర్, ఏ.రామకృష్ణంరాజు, తదితరులు పాల్గొన్నారు.

నీటి సంరక్షణపై ప్రత్యేక దృష్టి సారించాలి



సమీక్షలో పాల్గొన్న ఆర్డీవో కేశవర్ధన్‌రెడ్డి తదితరులు

కనిగిరి, ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి): భూగర్భ జలమట్టం తక్కువగా ఉన్న ప్రాంతాల్లో నీటి వనరులు సంరక్షణ, వాననీటి సంరక్షణపై అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని సీఎం చంద్రబాబు పేర్కొన్నారు. స్థానిక ఆర్డీవో కార్యాలయంలో జిల్లా కలెక్టర్‌తో పాటు కనిగిరి డివిజన్ స్థాయి వివిధ శాఖల అధికారులతో గురువారం వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. ఈసందర్భంగా సీఎం పలు సూచనలు సలహాలను అధికారులకిచ్చారు. వర్షాకాలంలో పడే వర్షపు నీటిని సంరక్షించుకునేందుకు చెరువులు, కుంటలు వంటి వాటిలో నీటి నిల్వ ఉంచటంపై ప్రత్యేక చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉందన్నారు. నీటి చెరువుల వివరాలతో పాటు వాటి మరమ్మతుల వివరాలను కూడా నమోదు చేసి కార్యాచరణకు సిద్ధం కావాలని ఆదేశించారు. భూగర్భ జలమట్టం పెరిగేందుకు కావాల్సిన భవిష్యత్ ప్రణాళికతో ముందుకువెళ్లాలని అధికారులకు సూచించారు.

సమావేశంలో ఆర్డీవో కేశవర్ధన్‌రెడ్డి, తహసీల్దార్ రవిశంకర్, ఎంపీడీవో ప్రభాకర్‌శర్మ, తమ్మినేని శ్రీనివాసులురెడ్డి తదితరులు పాల్గొన్నారు.

దర్శిలో టీడీపీ సంబరాలు



దర్శిలో బాణసంచా కాల్చి సంబరాలు చేసుకుంటున్న టీడీపీ నాయకులు

దర్శి, ఆగస్టు 14(ఆంధ్రజ్యోతి): పులివెందుల, ఒంటిమిట్ట జడ్పీటీసీ స్థానాలను టీడీపీ భారీ మెజార్టీతో గెలుపొందటంతో దర్శిలో టీడీపీ శ్రేణులు గురువారం సంబరాలు చేసుకున్నారు. మాజీ ఎమ్మెల్యే నారపుశెట్టి పాపారావు ఆధ్వర్యంలో నాయకులు, కార్యకర్తలు స్థానిక గడియారస్తంభం సెంటర్‌లో బాణసంచా కాల్చి ఆనందం వ్యక్తం చేశారు. ఈసందర్భంగా పాపారావు మాట్లాడుతూ ప్రజాస్వామ్యంగా ఎన్నికలు జరగటంతో మాజీ సీఎం జగన్ సొంత నియోజకవర్గంలో టీడీపీ జెండా ఎగుర వేసిందన్నారు. అక్కడ ప్రజాస్వామ్యం గెలిచిందని ప్రజలు సంతోషం వ్యక్తం చేస్తున్నారని చెప్పారు. కూటమి ప్రభుత్వం అమలు చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ పథకాల పట్ల అన్నీ ప్రాంతాల ప్రజలు సంతృప్తితో ఉన్నారనే విషయం ఈ విజయంతో రుజువైందన్నారు. కార్యక్రమంలో దర్శి మున్సిపల్ చైర్మన్ నారపుశెట్టి పిచ్చయ్య, వైస్‌చైర్మన్ జి.స్టీవెన్, టీడీపీ పట్టణ అధ్యక్షుడు పుల్లచెరువు చిన్నా, రూరల్ అధ్యక్షుడు మారెళ్ల వెంకటేశ్వర్లు, సంగా తిరుపతిరావు, నారపు శెట్టి మధు, తదితరులు పాల్గొన్నారు.

దొనకొండలో..

దొనకొండ, ఆగస్టు 14(ఆంధ్రజ్యోతి): పులివెందుల, ఒంటిమిట్ట ప్రజలు అభివృద్ధిని కోరుకున్నారని టీడీపీ నియోజకవర్గ నాయకుడు డాక్టర్ కడియాల లలిత్‌సాగర్ స్పష్టం చేశారు. పులివెందల, ఒంటిమిట్ట రెండు జడ్పీటీసీ స్థానాలను భారీ మెజార్టీతో టీడీపీ కైవసం చేసుకోవటంతో స్థానిక ఎన్టీఆర్ విగ్రహం వద్ద టీడీపీ శ్రేణులు బాణసంచా కాల్చి సంబరాలు చేసుకున్నారు. ముందుగా ఎన్టీఆర్ విగ్రహంకు పూలమాలలు వేసి నివాళులర్పించి ప్రజలకు స్వీట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో నాయకులు మోడి ఆంజనేయులు, నాగులపాటి శివకోటేశ్వరరావు, మోడి వెంకటేశ్వర్లు, పులిమి రమణాయాదవ్, శృంగారపు నాగసుబ్బారెడ్డి, షేక్ తోహీద్, తదితరులు పాల్గొన్నారు.



దొనకొండలో ఎన్టీఆర్ విగ్రహానికి నివాళులర్పిస్తున్న డాక్టర్ లలిత్‌సాగర్, తదితరులు

పామూరులో..

పామూరు, ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి): పులివెందుల, ఒంటిమిట్ట జడ్పీటీసీ ఉప ఎన్నికల్లో టీడీపీ అభ్యర్థులు విజయం సాధించడంతో కనిగిరిలో విజయోత్సవ ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో నాయకులు పువ్వాడి వెంకటేశ్వర్లు, యారవ శ్రీనివాసులు, ఉప్పలపాటి హరిబాబు, వై.రహీముల్లా, సయ్యద్ అమీర్‌బాబు, మన్నం రమణయ్య, తదితరులు పాల్గొన్నారు.

మూడు సచివాలయాలకు ఇన్‌ఛార్జ్ కార్యదర్శుల నియామకం

తాళ్లూరు, ఆగస్టు 14(ఆంధ్రజ్యోతి): మండలంలో పంచాయతీ కార్యదర్శులులేని మూడు సచివాలయాలకు ఇన్‌చార్జ్ కార్యదర్శులను నియమిస్తూ కార్యాలయ అడ్మిన్‌స్ట్రేటివ్ అధికారి సానికొమ్ము సత్యం గురువారం ఉత్తర్వులు జారీ చేశారు. మన్నేపల్లి సచివాలయంకు దోసకాయలపాడు పంచాయతీ కార్యదర్శి కాకర్ల మెలకయ్యను, తాళ్లూరు పంచాయతీ కార్యదర్శిగా విఠలాపురంపంచాయతీ కార్యదర్శి షేక్ షహనాజ్‌బేగం, నాగంబొట్లపాలెం పంచాయతీ కార్యదర్శిగా రాభద్రాపురం పంచాయతీ కార్యదర్శి వి.సుబ్బారెడ్డిని నియమించారు. మన్నేపల్లి, తాళ్లూరు ఇన్‌చార్జ్ కార్యదర్శి ఐవీ రమణారెడ్డి సెలవుపై వెళ్లటంతో మూడు పంచాయతీల్లో ప్రజలకు పరిపాలన పరంగా ఇబ్బందులు కాకుండా ఇన్‌చార్జ్‌లను నియమించినట్లు అడ్మిన్‌స్ట్రేటివ్ అధికారి తెలిపారు.



బాధితురాలికి చెక్కును అందజేస్తున్న డాక్టర్ లక్ష్మి

సీఎం ఇచ్చిన హామీ అమలు

» బాధిత కుటుంబానికి సాయమందించిన టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ డాక్టర్ గొట్టిపాటి లక్ష్మి

దర్శి ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి) : సీఎం చంద్రబాబు ఇచ్చిన హామీ అమలైంది. అన్నదాత సుఖీభవ పథకం మండలం తూర్పువీరాయపాలెంలో ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రారంభించిన విషయం తెలిసిందే. ఆ సందర్భంగా తూర్పువీరాయపాలెం గ్రామానికి చెందిన జీ చిన్నయలమంద కుమారుడు పోలియో వ్యాధితో బాధపడుతున్నాడు. భార్యాభర్తలు ఆ బాలుడిని తీసుకొని చంద్రబాబు వద్ద తమ గోడు వెల్లబోసుకున్నారు. దీనిపై స్పందించిన సీఎం రూ.1.5లక్షలు ఆర్థిక సాయం అందించాలని కలెక్టర్ తమీమ్ అన్సారియాను ఆదేశించారు. ఈ నేపథ్యంలో ప్రభుత్వం నుంచి వచ్చిన చెక్కును టీడీపీ ఇన్‌చార్జి డాక్టర్ గొట్టిపాటి లక్ష్మి బాధిత కుటుంబానికి గురువారం అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సీఎం చంద్రబాబు దర్శి పర్యటనలో ఇచ్చిన హామీలు అమలు చేస్తున్నందుకు ఆమె ధన్యవాదాలు తెలిపారు. కాగా బాధిత కుటుంబ సభ్యులు సీఎం చంద్రబాబుకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ నారంశెట్టి పిచ్చయ్య, టీడీపీ మండల అధ్యక్షుడు మారెళ్ల వెంకటేశ్వర్లు, నాయకులు నాగేశ్వరరావు, కొండలు పాల్గొన్నారు.

పారిశుధ్యంపై అప్రమత్తంగా ఉండాలి

దర్శి ఆగస్టు 14(ఆంధ్రజ్యోతి): పారిశుధ్యం పట్ల అప్రమత్తంగా ఉండాలని టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ డాక్టర్ గొట్టిపాటి లక్ష్మి సూచించారు. గురువారం దర్శి పట్టణంలోని సందువారిపాలెంలో మురుగు కాల్వలను పరిశీలించారు. పారిశుధ్య కార్యక్రమాలు జరుగుతున్న తీరును ప్రజలను అడిగి తెలుసుకున్నారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ గత కొద్దిరోజులుగా ముమ్మరంగా వర్షాలు కురుస్తున్నందున నీరు నిల్వలేకుండా జాగ్రత్తలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. లోతట్టు ప్రాంతాల్లో నిల్వ ఉన్న నీటిని బయటకు పంపాలని కోరారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ నారపుశెట్టి పిచ్చయ్య, కమిషనర్ వై.మహేశ్వరరావు, పుల్లలచెరువు చిన్నా, యాదగిరి వాసు, కర్నా శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

కురిచేడులో భారీ జాతీయ జెండా ప్రదర్శన



కురిచేడులో ప్రదర్శిస్తున్న జాతీయ జెండా

కురిచేడు, ఆగస్టు 14(ఆంధ్ర్యోతి): కురిచేడులో 365 అడుగుల భారీ జాతీయ జండా ప్రదర్శన గురువారం కన్నుల పండువగా జరిగింది. తహసీల్దార్ కార్యాలయం, లయన్స్ క్లబ్‌లు సంయుక్తగా జాతీయ జెండా ప్రదర్శన నిర్వహించారు. ఎస్సెస్సీ కాలనీలోని అంబేడ్కర్ గురుకుల పాఠశాల నుంచి పాత పోలీస్ స్టేషన్, ప్రధాన కూడలి, బాలికల ఉన్నత పాఠశాల మీదుగా దర్శి రోడ్డులోని పంచాయతీ కార్యాలయం వరకు ప్రదర్శన సాగింది. గురుకుల పాఠశాల, వైఆర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు 500 మంది వరకు ఈ ర్యాలీలో పాల్గొన్నారు. ప్రధాన కూడలిలో మానవహారంగా ఏర్పడి జాతీయ నాయకుల గురించి తహసీల్దార్ రజనీకుమారి వివరించారు.

కార్యక్రమంలో ఎంపీడీవో కేజీఎస్ రాజు, ఎంఈవోలు వస్రాం నాయక్, సీహెచ్ సుబ్బారావు, జేబీ రామారావు, వీవీ రమణారావు, ఇందూకి వెంకట నరిసిరెడ్డి, ఎలిసెట్టి రంగనాయకులు, తదితరులు పాల్గొన్నారు.

భూసమస్యల పరిష్కారానికి కృషి




మాట్లాడుతున్న ఆర్డీవో కేశవర్ధన్‌రెడ్డి

పీసీపల్లి, ఆగస్టు 14(ఆంధ్రజ్యోతి): రీసర్వేలో జాయింట్ ఎల్పీఎంలుగా నమోదైన భూములను సరిచేసి సింగిల్ ఎల్పీఎంలుగా మారుస్తామని ఆర్డీవో కేశవర్ధన్‌రెడ్డి అన్నారు. మండలంలోని మారెళ్ల గ్రామంలో గురువారం రైతులతో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. జాయింట్ ఎల్పీఎంల కింద నమోదైన భూమి యజమానులు స్థానిక సచివాలయంలో విభజన కోసం దరఖాస్తు చేసుకోవాలన్నారు. దరఖాస్తు అందిన వెంటనే రైతులకు నోటీసులు ఇచ్చి భూముల హక్కుదారులందరినీ పొలం వద్దకు పిలిపించి సర్వేయర్ల ద్వారా కొలతలు వేయించి జాయింట్ ఎల్పీఎంల సమస్యను పరిష్కరిస్తామన్నారు.

బీమా చేయించుకునేందుకు గడువు ముగుస్తున్నందున గతంలో లాగా వెబ్‌ల్యాండ్‌లో ఎల్పీఎంలకు బదులుగా సర్వే నెంబర్లు వచ్చేలా చూస్తే బీమా చేయించుకునేందుకు వీలుంటుందని రైతులు ఆయన దృష్టికి తీసుకొచ్చారు. దీనిపై స్పందించిన ఆర్డీవో మాట్లాడుతూ రీసర్వే జరిగిన గ్రామాల్లో ఎల్పీఎంలు తీసివేయడం సాధ్యం కాదన్నారు. ఈసమస్యను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తామని అన్నారు. సమావేశంలో తహసీల్దార్ సీహెచ్ ఉష, వీఆర్వో గిరి, తదితరులు పాల్గొన్నారు.


ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
బాపట్ల జిల్లా వార్తలు
7
శుక్రవారం 15 ఆగస్టు 2025





కొల్లూరు : అరవింద వారధి వద్ద ఉధృతంగా ప్రవహిస్తున్న వరద

భారీ వర్షం.. నష్టం కష్టం



సాగర్ 26 క్రస్ట్‌గేట్ల ద్వారా విడుదలవుతున్న నీరు

వరద.. విడుదల

- సాగర్ నుంచి 26 క్రస్ట్‌గేట్ల ద్వారా..
- ప్రకాశం బ్యారేజి వద్ద మొదటి ప్రమాద హెచ్చరిక



ప్రకాశం బ్యారేజి దిగువకు ఉధృతంగా ప్రవహిస్తున్న నీరు

విజయపురిసౌత్, ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి): అల్పపీడనం ప్రభావంతో గుంటూరు, పల్నాడు, బాపట్ల జిల్లాల పరిధిలో కురుస్తోన్న భారీ వర్షాలతో ప్రాజెక్టులకు భారీగా వరద ప్రవాహం కొనసాగుతోంది. శ్రీశైలానికి వస్తున్న వరద వచ్చినట్లు దిగువకు విడుదల చేస్తున్నారు. నాగార్జున సాగర్, పులిచింతల, ప్రకాశం బ్యారేజీల నుంచి కూడా నీటిని దిగువకు విడుదల చేస్తుండటంతో కృష్ణమ్మ ఉధృతంగా ప్రవహిస్తోంది. సాగర్ జలాశయానికి శ్రీశైలం నుంచి గురువారం 1,72,774 క్యూసెక్కుల వరద నీరు వస్తుండడంతో ప్రాజెక్ట్ అధికారులు 26 క్రస్ట్‌గేట్ల ద్వారా దిగువకు నీటిని విడుదల చేశారు. సాగర్ జలాశయం నీటిమట్టం 587.50 అడుగులు ఉంది. ప్రధాన జల విద్యుత్ కేంద్రం ద్వారా 29,534, కుడి కాల్వ ద్వారా 1540, 26 క్రస్ట్ గేట్లను 5 అడుగుల మేర ఎత్తి 2,03,762 మొత్తం ఔట్‌ఫ్లో 2,37,056 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు.

బ్యారేజి నుంచి 5,45,412 క్యూసెక్కులు..

తాడేపల్లి టౌన్: గురువారం కూడా ప్రకాశం బ్యారేజి వద్ద మొదటి ప్రమాద హెచ్చరిక కొనసాగుతోంది. వరద ఉధృతి క్రమేపీ పెరుగుతుండడంతో దిగువ ప్రాంతాల వారు, లంక భూముల రైతులు, మత్స్యకారులు అప్రమత్తంగా ఉండాల ని అధికారులు సూచించారు. ఎగువ నుంచి 5లక్షల 46 వేల 018 క్యూసెక్కుల వరదనీరు ఇన్‌ఫ్లోగా నమోదైంది. రిజర్వాయర్‌లో 14.5 అడుగుల నీటి మట్టం కొనసాగుతుండగా మొత్తం 70 గేట్లను ఎత్తి దిగువకు 5 లక్షల 45 వేల 422 వేల క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నట్లు జేఈ రాజేష్ తెలిపారు. తూర్పు, పశ్చిమ డెల్టా కాల్వలకు నీటి విడుదల నిలిపివేశారు.

అల్పపీడన ప్రభావం జిల్లాను వీడలేదు. గురువారం వరుణుడి ప్రభావం అంతగా లేకపోయినా అక్కడక్కడ ఓ మోస్తరు వర్షాలు పడ్డాయి. బుధవారం అర్ధరాత్రి పలు ప్రాంతాల్లో భారీగా వర్షం పడింది. వర్షాలతో వాగులు, డ్రెయిన్లు పొంగి ప్రవహిస్తు న్నాయి. దీంతో పొలాల్లోని నీరు బయటకు పోయే మార్గం లేకుం డా పోయింది. మూడు రోజులుగా చేలు చెరువుల్లా మారాయి. పెట్టుబడులు వర్షార్పణమేనని రైతులు కన్నీటి పర్యంత మవుతు న్నారు. ఇప్పటికి రెండు సార్లు సాగు చేపట్టి తీవ్రంగా నష్టపోయిన తమను ఆదుకోవాలని రైతులు వేడుకుంటున్నారు. మూడు రోజులుగా కురిసిన వర్షాలతో జిల్లా కేంద్రాలైన గుంటూరు, బాపట్ల, నరసరావుపేటలతో పాటు పలు పట్ట ణాలు, గ్రామాల్లోని లోతట్టు ప్రాంతాలు గురువారం కూడా ముంపులోనే ఉండటంతో ప్రజలు తీవ్రంగా ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వచ్చింది. ముంపు నుంచి తేరుకున్న ప్రాంతాల్లో అపరిశుభ్రతతో దుర్వాసనతో ప్రజలు అల్లాడిపోతున్నారు. శ్రీశైలం నుంచి ప్రకాశం బ్యారేజీ జలాశయాల వరకు వరద కొనసాగుతుండటంతో వచ్చిన నీటిని వచ్చినట్లుగా దిగువకు విడుదల చేస్తు న్నారు. దీంతో కృష్ణమ్మ ఉధృతంగా ప్రవహి స్తోంది. నదీ తీరంలో గ్రామస్థులను, రైతులను అధికారులు అప్రమత్తం చేస్తున్నారు.

- చెరువుల్లా మారిన పొలాలు
- ఉధృతంగా ప్రవహిస్తోన్న కృష్ణమ్మ
- కొనసాగుతోన్న అల్పపీడన ప్రభావం
- పెట్టుబడి వర్షార్పణమేనని రైతుల ఆవేదన

పొంగి ప్రవహిస్తోన్న వాగులు.. రాకపోకలకు అంతరాయం

(బాపట్ల, ఆంధ్రజ్యోతి)

ఎన్నో ఒడిదు డుకుల మధ్య ఆలస్యంగా ఖరీఫ్ సేద్యానికి సిద్ధమైన అన్నదాతలను ఎడతెరిపి లేకుండా కురిసిన వానలు కోలుకోకుండా చేశాయి. మొన్నటి వరకు తీవ్ర వర్షాభావంతో సాగు చేసిన పంటలు బెట్టకు వచ్చాయి. ప్రస్తుత వర్షాలతో పంటలు నీటి మునిగాయి. జిల్లాలో పంటలకు అపార నష్టం వాటిల్లింది. వర్షాలు కొనసాగుతాయని వాతావరణ శాఖ ప్రకటించడంతో రైతులకు కంటిమీద కును కు లేకుండా పోతోంది. రికార్డు స్థాయిలో వర్షపాతం నమోదు కావడంతో వాగులు, కా ల్వలు, డ్రెయిన్లు పొంగిపొర్లి పంట పొలా లను ముంచెత్తాయి. పొలాల్లో నిలిచిన నీటిని బయటకు పంపేందుకు అవస్థలు పడుతున్నారు. వర్షాలతో వరి విత్తనాలు చల్లిన రైతులు తీవ్రంగా నష్టపోయారు. కొన్ని చోట్ల మొలకెత్తిన వరి నారు వర్షాలకు కొట్టుకుపోయింది. భారీ వర్షాలకు నారు కోసం చల్లిన విత్తనాలు కొన్ని ప్రాంతాల్లో కొట్టుకుపోయాయి. ఆదిలోనే వరి రైతులకు వర్షాలు నష్టాన్ని మిగిల్చాయి. గురువారం తెల్లవారుజాము నుంచి నాదెండ్ల మండల పరిధిలో కుప్పగం జి వాగు ఉధృతంగా ప్రవహిస్తున్నది. చిల కలూరిపేట నుంచి శివ ప్రియనగర్ మీదుగా గణపవరం మార్గంలో ఉన్న కుప్పగంజి వాగు చప్టాపై నుంచి (మిగతా 8లో)



చెరుకుపల్లి : ఉధృతంగా ప్రవహిస్తున్న గూడవల్లిలోని ఆర్ఎం డ్రెయిన్



తెనాలి నియోజకవర్గంలో రోడ్డు పనులకు సంబంధించిన వివరాలను అధికారుల నుంచి తెలుసుకుంటున్న మంత్రి మనోహర్



నరసరావుపేట : ఉధృతంగా ప్రవహిస్తున్న వల్లెపు చెరువు అలుగు



బాపట్ల : మరుప్రోలువారిపాలెం వద్ద ఇంకా ముంపులోనే వరి పైరు



అమరావతి మండలం పెదమద్దూరులో దెబ్బతిన్న పత్తిపైరు



కొల్లూరు మండలం తిప్పలకట్ట వద్ద కోతకు గురవుతున్న పంట పొలాలు



విద్యుత్ దీపాల అలంకరణలో బాపట్ల పురపాలక సంఘ కార్యాలయం

స్వాతంత్ర్య దినోత్సవానికి ముస్తాబు

- బాపట్ల మహిళా ఇంజనీరింగ్ కళాశాలలో ఏర్పాట్లు



స్వాతంత్ర్య దినోత్సవ ఏర్పాట్లపై సిబ్బందికి సూచనలు చేస్తున్న కలెక్టర్ వెంకట మురళి, ఎస్పీ తుషార్ డూడి

బాపట్ల, ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి): జిల్లా స్థాయిలో స్వాతంత్ర్య దిన వేడుకలకు బాపట్ల మహిళా ఇంజనీరింగ్ కళాశాల మైదానం ముస్తాబైంది. భారీవర్షాలతో పోలీసు పరేడ్ గ్రౌండ్‌లో నీరు నిలవడంతో వేడుకలను బాపట్ల మహిళా ఇంజనీరింగ్ కళాశాలలో నిర్వహించాలని అధికారులు నిర్ణయించి ఏర్పాట్లు చేశారు. ఆయా ఏర్పాట్లను కలెక్టర్ వెంకటమురళి గురువారం ఎస్పీ తుషార్‌డూడి, జిల్లా అధికారులతో కలిసి పరిశీలించారు. మంత్రి గొట్టిపాటి రవికుమార్ జెండాను ఆవిష్కరిస్తారని కలెక్టర్ తెలిపారు. పోలీసులు, ఎన్‌సీసీ దళాలచే గౌరవ వందనం అనంతరం మంత్రి సందేశం ఉంటుందన్నారు. విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు, శకటాల ప్రదర్శన, విధినిర్వాహణలో ఉత్తమ సేవలందించిన వారికి ప్రశంసపత్రాలు, జ్ఞాపికలు ప్రదానం జరుగుతుందన్నారు. స్వాతంత్ర్యదిన వేడుకల కవాతు సాధన ప్రక్రియను ఎస్పీ పరిశీలించి సిబ్బందికి పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి జేసీ ఇ.గంగాధర్‌గౌడ్, ఆర్డీవో పి.గ్లోరియా, ఏఆర్ డీఎస్పీ పి.విజయసారధి, ఎస్‌బీ ఇన్‌స్పెక్టర్ జి.నారాయణ,పట్టణ సీఐ ఆర్.రాంబాబు, ఆర్‌ఐలు షేక్.మౌలుద్దీన్, టి.శ్రీకాంత్, తహసీల్దార్ షేక్.సలీమా తదితరులు పాల్గొన్నారు.

ఇద్దరికి ప్రెసిడెంట్ పోలీసు మెడల్

నేడు అందుకోనున్న భద్రయ్య, రాజగోపాలరెడ్డి



రాజగోపాల్‌రెడ్డి



భద్రయ్య

అద్దంకి, చినగంజాం, ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి): స్వాతంత్ర్య దిన వేడుకలను పురస్కరించుకుని కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన ప్రెసిడెంట్ మెడల్ జాబితాలో జిల్లాకు చెందిన ఇద్దరికి చోటు దక్కింది. ముఖ్యమంత్రి సెక్యూరిటీ వింగ్ ఎస్పీగా ఉన్న అద్దంకి మండలం బొమ్మ నంపాడుకు చెందిన చెన్నుపాటి భద్రయ్య, చినగంజాం మండలం మున్నంవారిపాలెం గ్రామానికి చెందిన కుక్కల రాజగోపాలరెడ్డి శుక్రవారం అవార్డు అందుకోనున్నారు. 1991 మార్చి 16న ఆర్ఎస్ఐగా విధుల్లో చేరిన భద్రయ్య వివిధ హోదాల్లో పనిచేసి 2024 ఆగస్టు 20న ఎస్పీగా ఉద్యోగోన్నతి పొందారు. 1996లోఆయన ఇంటెలిజెన్స్ సెక్యూరిటీ విభాగానికి ఎంపికయ్యారు. అధునా తన బాంబులు నిర్వీర్యం చేయడంలో విశేష సేవలందించారు. రెండుసార్లు బంగారు పతకాలు పొందారు. జైపూర్, కర్నూల్‌లో జరిగిన పోలీస్ డ్యూటీ మీట్‌లో ఛాంపియన్‌షిప్ సాధించారు. మెడల్ సాధించిన భద్రయ్యకు మంత్రి గొట్టిపాటి రవికుమార్ ఫోన్‌లో అభినందనలు తెలిపారు.

స్వాతంత్ర్య సమరయోదుడు కుక్కల రాధాకృష్ణరెడ్డి మనవడైన కే.రాజగోపాలరెడ్డి రేణిగుంట లోని రైల్వే ప్రొటెక్షన్ ఫోర్స్‌లో అసిస్టెంట్ సెక్యూరిటీ కమిషనర్‌గా విధులు నిర్వహిస్తున్నారు. 2012 గణతం త్ర దినోత్సవంలో ఇండియన్ పోలీస్ మెడల్, రెండు సందర్భాలలో ఆల్ ఇండియా రైల్వే మంత్రుల మెడల్స్, ఉత్తమ దర్యాప్తునకు పతకాలు డైరెక్టర్ జనరల్స్ ఇన్సిగ్నియా, జనరల్ మేనేజర్స్ మెడల్స్‌ను గతంలో సాధించారు. కోసోవో, దక్షిణ సూడాన్‌లోని ఐక్యరాజ్యసమితి శాంతి పరిరక్షణక మిషన్లలో కూడా ఆయన సేవలందించారు. నాలుగు ఐక్యరాజ్యసమితి శాంతి పరిరక్షక పతకాలు పొందారు.

స్త్రీ శక్తికి... సిద్ధం

- నేడు కార్యక్రమం ప్రారంభం
- మహిళల ఉచిత ప్రయాణానికి శ్రీకారం
- చీరాలలో ప్రారంభించనున్న మంత్రి గొట్టిపాటి
- స్థానిక ప్రజాప్రతినిధులకు ఆర్టీసీ ఆహ్వానాలు
- జీరో టిక్కెట్‌కు టిమ్ మిషన్‌లో సాఫ్ట్‌వేర్ అప్‌డేట్
- గుర్తింపు కార్డుతోనే ఉచిత ప్రయాణం

(బాపట్ల, ఆంధ్రజ్యోతి)

సూపర్ సిక్స్‌లో హామీ ఇచ్చిన మేరకు మహిళల ఉచిత ప్రయాణానికి ప్రభుత్వం సిద్ధమైంది. స్త్రీ శక్తిగా ఈ పథకానికి ప్రభుత్వం నామకరణం చేయగా 15న స్వాతంత్ర్య దినోత్సవం రోజున సాయంత్రం ప్రారంభోత్సవానికి ఆర్టీసీ సన్నాహాలు చేస్తోంది. ఆర్టీసీ బస్సుల్లో మహిళల ఉచిత ప్రయాణానికి ఆర్టీసీ సర్వం సిద్ధం చేసింది. ముందుగా సీఎం చంద్రబాబు విజయవాడలో ఈ పథకాన్ని ప్రారంభించిన తర్వాత గుంటూరు, పల్నాడు, బాపట్ల జిల్లా కేంద్రాల్లో ఆయా ప్రజాప్రతినిధుల ఆధ్వర్యంలో ప్రారంభిస్తామని జిల్లా ఇన్‌చార్జి ప్రజారవాణాధికారి (డీపీటీవో) సామ్రాజ్యం గురువారం తెలిపారు. ఇందుకు సంబంధించి జిల్లాల్లో ఎక్కడికక్కడ డిపోల్లో ఆర్టీసీ అధికారులు ఏర్పాట్లు చేశారు. ఇప్పటికే ఆర్టీసీ యంత్రాంగం నిర్దేశించిన ఉచిత బస్సుల్లో ఉచిత ప్రయాణానికి అవసరమైన ఏర్పాట్లు జరిగాయి. మహిళలకు ఉచిత ప్రయాణంలో భాగంగా జీరో టిక్కెట్ అందించనున్నారు. ఈ టిక్కెట్‌కు సంబంధించి టిమ్ మిషన్లలో సాఫ్ట్‌వేర్‌ను అప్‌డేట్ చేశారు. జీరో టిక్కెట్ జారీపై కండక్టర్లకు ప్రత్యేక శిక్షణా కార్యక్రమాలు ఇప్పటికే ఆర్టీసీ అధికారులు నిర్వహించారు. అయితే ఉచిత ప్రయాణం పొందే మహిళలు ఈ రాష్ట్రానికి చెందిన వారేనని ఆధార్ వంటి ఏదో ఒక గుర్తింపు కార్డు తప్పనిసరిగా చూపించాల్సి ఉంటుందని అధికారులు స్పష్టం చేశారు. జిల్లా పరిధి అధిక శాతం గ్రామీణ నేపథ్యం కలిగి ఉండడం, దాదాపు 75 శాతం ఊళ్లకు పల్లె వెలుగు సర్వీసులే నడుస్తుండడం వల్ల మహిళలకు పెద్దఎత్తున లబ్ధి చేకూరనున్నది. అన్ని చోట్లా స్త్రీశక్తి పథకం మార్గదర్శకాల గురించి మహిళలకు (మిగతా 8లో)



చీరాల బస్‌స్టేషన్

సమన్వయంతో పనిచేయాలి

అధికారులకు మంత్రి గొట్టిపాటి ఆదేశం



ముప్పవరం పార్టీ కార్యాలయంలో చెక్కులు అందచేస్తున్న మంత్రి గొట్టిపాటి

పంగులూరు, ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి): నియోజకవర్గ అభివృద్ధికి సమన్వయంతో పనిచేయాలని మంత్రి గొట్టిపాటి రవికుమార్ అధికారులను ఆదేశించారు. మండలంలోని ముప్పవరంలోని టీడీపీ కార్యాలయంలో గురువారం వివిధ శాఖల అధికారులు, పార్టీనేతలతో మంత్రి సమీక్షించారు. ఉపాధి నిధులతో చేపట్టిన పను లకు సంబంధించిన బిల్లుల చెల్లింపు ప్రక్రియను పూర్తి చేయాలని డ్వామా పీడీ.విజయలక్ష్మి, పంచాయితీరాజ్ ఈఈ.వేణుగోపాలరెడ్డికి సూచించారు. సీసీ, బీటీ రోడ్లకు రూ.16 కోట్లు చొప్పున నిధులు మంజూరయ్యాయని వెంటనే పనులు చేపట్టాలన్నారు. అర్హులకు స్థలాలు అందచేసేం దుకు చర్యలు తీసుకోవాలని తహసీల్దార్ సింగారావును ఆదేశించారు. నియోజకవర్గ పరిధిలోని 56 కుటుంబాలకు మంజూరైన రూ.43,44,959 సీఎంఆర్ఎఫ్ చెక్కులను మంత్రి అందజేశారు. కార్యక్రమంలో ఎంపీడీవోలు సింగయ్య, సుమంత్, పాండురంగస్వామి, ఏపీవోలు సంతోషం, రమాదేవి, టీడీపీ మండల అధ్యక్షుడు రావూరి రమేష్, నాయకులు జయంత్, కె.వి.సుబ్బారావు, కుక్కపల్లి ఏడుకొండలు, గుర్రం ఆదిశేఖర్,డీసీ, పీఏసీఎస్ అధ్యక్షులు కుక్కపల్లి ఆంజనేయులు, అల్లంనేని బ్రహ్మానంద స్వామి, రావుల సింగరకొండ, బత్తుల వెంకటరావు, గొల్లపూడి అంజనేయులు పాల్గొన్నారు.

క్వారీల్లో ప్రమాదాలు జరిగితే చర్యలు

బల్లికురవ, ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి): క్వారీలలో కార్మికులకు భద్రత కల్పించకుండా పనులు చేయించి వారి ప్రాణాలకు ముప్పు వాటిల్లితే కఠిన చర్యలు తప్పవని డీఎస్పీ రామాంజనేయులు హెచ్చరించారు. క్వారీల యజమానులతో గురువారం బల్లికురవలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతు కార్మికుల వివరాలు లేకుండా పనుల్లోకి తీసుకుంటే యజమానులపై క్రిమినల్ కేసులు నమోదు చేస్తామన్నారు. అనుమతులు లేకుండా క్వారీలు చేపడితే సంబంధిత చర్యలు తప్పవన్నారు. ఆర్డీవో చంద్రశేఖర్‌నాయుడు మాట్లాడుతూ ప్రజలకు ఇబ్బందులు లేకుండా అనుమతుల మేరకు క్వారీలు నిర్వహించుకోవాలన్నారు. సమావేశంలో మైనింగ్ ఏడీ రామం చంద్రావు, జిల్లా లేబర్ కమిషనర్ కోటేశ్వరరావు, బల్లికురవ, సంతమాగులూరు తహీల్దార్‌లు రవినాయక్, రవిబాబు, సీఐ వెంకట్రావు, ఎస్ఐ నాగరాజు, విజిలెన్స్ ఏజీ సురేష్‌రెడ్డి, ఆర్ఐలు రాజు, రాజేంద్రప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

18నుంచి విద్యార్థులకు దివ్యాంగ నిర్ధారణ పరీక్షలు

ఒంగోలు విద్య, ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలోని దివ్యాంగ విద్యార్థులకు ఈనెల 18నుంచి నియోజకవర్గ స్థాయిలో దివ్యాంగ నిర్ధారణ శిబిరాలు నిర్వహించనున్నట్లు డీఈవో కిరణ్‌కుమార్ తెలిపారు. 18న సంతనూతలపాడు, 18న వైపాలెం, 20న దర్శి, 21న ఒంగోలు, 22న కొండపి, 23న మార్కాపురం, 25న గిద్దలూరు, 26న కనిగిరిలో ఈ శిబిరాలు జరుగుతాయని తెలిపారు. ప్రభుత్వ, జిల్లా పరిషత్, మునిసిపల్, ప్రభుత్వ ఎయిడెడ్ పాఠశాలల్లో చదువుతున్న 6నుంచి 17 సంవత్సరాలు ఉన్న దివ్యాంగ విద్యార్థులు ఈ శిబిరాలకు హాజరయ్యేందుకు అర్హులని పేర్కొన్నారు. స్పెషలిస్టు డాక్టర్లు విద్యార్థులకు సంబంధించిన వైకల్యాన్ని నిర్ధారణ చేసి వివిధ రకాల ఉపకరణాలు అందించనున్నట్లు తెలిపారు.

నటుడు గిరిబాబుకు నాగభైరవ ఆత్మీయ పురస్కారం

ఒంగోలు కలెక్టరేట్, ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి) : సినీనటుడు, నిర్మాత, దర్శకుడు గిరిబాబుకు ఈనెల 17వ తేదీన నాగభైరవ ఆత్మీయ పురస్కారాన్ని ప్రదానం చేస్తున్నట్లు సాహిత్య పీఠం అధ్యక్షుడు నాగభైరవ ఆదినారాయణ ఒక ప్రకటనలో తెలిపారు. ఒంగోలులోని రెడ్ క్రాస్‌భవన్‌లో జరిగే ఈ ప్రధానోత్సవ సభలో కేకేఎల్ స్వామికి నాగభైరవ కళా పురస్కారాన్ని ప్రదానం చేయనున్నట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో నల్లూరి వెంకటేశ్వర్లు(అన్న), మాజీ ఎమ్మెల్యే ఈదర హరిబాబు, వీరవల్లి సుబ్బారావు, బెజవాడ వెంకట్రావు, కుర్రా ప్రసాద్‌లు పాల్గొంటారన్నారు. కళా సాహిత్య అభిమానులందరూ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఆయన కోరారు.

సురక్షిత భవనాల్లోనే పిల్లలకు తరగతులు

ఒంగోలువిద్య, ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి) : పాఠశాలల్లో సురక్షితంగా ఉన్న భవనాల్లోనే విద్యార్థులకు తరగతులు నిర్వహించాలని పాఠశాల విద్యాశాఖ ఆదేశాలు జారీ చేసింది. సురక్షితంగా లేని భవనాల్లో తరగతులు నిర్వహించరాదని ఆదేశించింది. ప్రస్తుతం భారీ నుంచి అతిభారీ వర్షాలు కురుస్తున్నందున పైకప్పు పెచ్చులు ఊడిపడటం, నీళ్లు కురుస్తూ ప్రమాదకరంగా ఉన్న గదుల్లో విద్యార్థులకు తరగతులు నిర్వహించవద్దన్నారు. బడిభవనాలు భద్రంగా ఉన్నట్లు ఇంజనీరింగ్ అధికారుల నుంచి ధ్రువీకరణ పత్రాలు తీసుకోవాలని చెప్పారు. సురక్షితంగా లేని భవనాలకు మరమ్మతులు నిర్వహించాలని, మరీ ప్రమాదకరంగా ఉన్న భవనాలనుకూల్చివేయాలని ఆదేశించారు. ప్రమాదకరంగా ఉన్న భవనాలను కూల్చివేసి ఆ స్థలాన్ని క్రీడలు, వృత్తి నైపుణ్యం, మధ్యాహ్నభోజన పథకానికి ఇతర అవసరాలకు వినియోగించుకోవచ్చని సూచించారు. శిథిలావస్థకు చేరిన గోడలకు సమీపంలోకి విద్యార్థులు వెళ్లకుండా చూడాలని, పాఠశాల భవనంలో కూల్చివేతలపై క్షేత్రస్థాయి సిబ్బంది పురోగతిని క్రమంతప్పకుండా పర్యవేక్షించాలన్నారు.

గ్యాస్ సిలిండర్ పేలి ఇరువురికి గాయాలు

ఒంగోలు క్రైం, ఆగస్టు14(ఆంధ్రజ్యోతి): ప్రమాదవశాత్తు గ్యాస్ సిలిండర్ పేలి ఇరువురికి గాయాలైన ఘటన ఒంగోలు నగరం సత్యనారాయణపురంలోని విజేత ఆసుపత్రి సమీపంలో జరిగింది. గురువారం ఉదయం మేకపాటి శిరీష ఇంట్లో టీ పెడుతుండగా గ్యాస్ లీకైంది. ఆమె బయట నుంచి ఇంట్లోకి వచ్చి లైట్ వేసేందుకు స్విచ్ వేయడంతో మంటలు చెలరేగి శిరీషకు అంటుకున్నాయి. దీంతో పెద్దగా కేకలు పెడుతూ ఇంట్లో ఉన్న శిరీష మామ మేకపాటి మాల్యాద్రి దగ్గరకు వెళ్ళింది. మంటలను ఆర్పే ప్రయత్నంలో ఆయన గాయపడ్డాడు. తీవ్రంగా గాయపడిన శిరీషను చికిత్స నిమిత్తం గుంటూరుకు తరలించారు. మాల్యాద్రి ఒంగోలులోని ప్రైవేటు వైద్యశాలలో చికిత్స పొందుతున్నాడు.

లారీని ఢీకొట్టిన ఆర్టీసీ బస్సు

- 9మందికి గాయాలు

ఒంగోలు క్రైం, ఆగస్టు14(ఆంధ్రజ్యోతి): ముందు వెళుతున్న లారీ సడన్ బ్రేక్ వేయడంతో వెనుక ఉన్న ఆర్టీసీ బస్సు ఢీకొంది. దీంతో బస్సులో ప్రయాణిస్తున్న 9 మంది ప్రయాణికులకు గాయాలయ్యాయి. ఈ సంఘటన ఒంగోలు శివారుప్రాంతంలోని త్రోవగుంట సమీపంలో గురువారం తెల్లవారుజామున జరిగింది. విజయవాడ నుంచి కనిగిరి వెళుతున్న ఆర్టీసీ బస్సుకు ఈ ప్రమాదం జరగడంతో అందులో ప్రయాణిస్తున్న తొమ్మిది మందికి స్వల్పగాయాలయ్యాయి. ఈ మేరకు ఒంగోలు తాలుకా పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేసున్నారు.

రైతన్నలకు న్యాయం చేసే ప్రభుత్వం టీడీపీనే

త్వరలోనే వెలిగొండ పూర్తి, మార్కాపురం జిల్లా ఏర్పాటు

ఎమ్మెల్యే నారాయణరెడ్డి

మార్కాపురం, ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి) : రైతులకు న్యాయం చేసేది ప్రజా ప్రభుత్వం మాత్రమేనని ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి అన్నారు. అన్నదాత సుఖీభవ పథకం రాష్ట్ర ప్రభుత్వం అమలు చేసిన నేపథ్యంలో కృతజ్ఞతగా నియోజకవర్గంలోని అన్ని మండలాలకు చెందిన రైతన్నలు గురువారం పట్టణంలో ట్రాక్టర్లతో ర్యాలీ నిర్వహించారు. స్థానిక అల్లూరి పోలేరమ్మ దేవస్థానం నుంచి సాయంత్రం 4.00 గంటలకు ట్రాక్టర్ల ర్యాలీని ఎమ్మెల్యే కందుల ప్రారంభించారు. అక్కడ నుంచి కరెంట్ ఆఫీసు, ఆర్టీసీ బస్టాండ్, గడియార స్తంభం, సప్తగిరి సెంటర్ల మీదుగా వ్యవసాయ మార్కెట్ కమిటీ వరకు ట్రాక్టర్ల ర్యాలీ జరిగింది. సుమారు 500కు పైగా ట్రాక్టర్లు ర్యాలీలో పాల్గొన్నాయి. ఏఎంసీ కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు ముఖ్యమంత్రి చంద్రబాబు అన్ని పథకాలను అమలు చేస్తున్నారన్నారు. సూపర్‌సిక్స్ పథకాల్లో ఒకటైన



ట్రాక్టర్ నడుపుతున్న ఎమ్మెల్యే నారాయణరెడ్డి

అన్నదాన సుఖీభవ ద్వారా రైతుల బ్యాంకు ఖాతాల్లో నగదు జమ చేశారన్నారు. రాష్ట్ర ఆర్థిక పరిస్థితి సహకరించకపోయినా ప్రజల సంక్షేమం కోసం ఇచ్చిన హామీలన్నింటినీ అమలు చేస్తున్నా ప్రతిపక్ష నాయకులు కడుపుమంటతో విమర్శలు చేయడం హేయమన్నారు. వెలిగొండ ప్రాజెక్టును పూర్తి చేయకుండానే జగన్‌రెడ్డి జాతికి అంకితం చేసి ప్రజలను మోసం చేశారన్నారు. ప్రజా ప్రభుత్వం అధికారంలోకి రాగానే వెలిగొండ ప్రాజెక్టుపై ప్రత్యేక దృష్టి సారించడంతో పనులు చురుగ్గా జరుగుతున్నాయన్నారు. త్వరలోనే ప్రాజెక్టును పూర్తిచేసి ఈ ప్రాంత ప్రజల నీటి కష్టాన్ని ముఖ్యమంత్రి చంద్రబాబు తీర్చుతారని చెప్పారు. మార్కాపురం జిల్లా విషయాన్ని గత వైసీపీ నేతలు విస్మరించారన్నారు. చంద్రబాబు ఇచ్చిన హామీ మేరకు మార్కాపురాన్ని జిల్లాగా ప్రకటించి ఈ ప్రాంత ప్రజల ఆకాంక్షను నెరవేర్చుతున్నారన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ వాణిజ్య విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వక్కలగడ్డ మల్లికార్జున్, పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి తాళ్లపల్లి సత్యనారాయణ, మార్కాపురం, పొదిలి ఏఎంసీ చైర్మన్‌లు మాలపాటి వెంకటరెడ్డి, డాక్టర్ ఇమామ్ సాహెబ్, మార్కాపురం, మిట్టమీదిపల్లి సొసైటీ ప్రెసిడెంట్లు జవ్వాజి రామాంజులరెడ్డి, గొలమారు నాసర్‌రెడ్డి, మార్కాపురం పట్టణ, మండల, తర్లుపాడు మండలాల పార్టీ అధ్యక్షులు పఠాన్ ఇబ్రహీంఖాన్, కాకర్ల శ్రీనివాసులు, ఉడుముల చిన్నపరెడ్డి పాల్గొన్నారు.

రైతు సంక్షేమం టీడీపీతోనే

వైపాలెం ఇన్‌చార్జి ఎరిక్షన్‌బాబు

ఎర్రగొండపాలెం : రైతుల సంక్షేమం కోరేది టీడీపీ ప్రభుత్వమని, వారికిచ్చిన మాటను అన్నదాత సుఖీభవ అమలుతో ముఖ్యమంత్రి చంద్రబాబు నిలుపుకున్నారని టీడీపీ వైపాలెం ఇన్‌చార్జి గూడూరి ఎరిక్షన్‌బాబు అన్నారు. నియోజకవర్గంలోని రైతులు ట్రాక్టర్లతో ఎర్రగొండపాలెంలో బుధవారం అన్నదాత సుఖీ భవ కృతజ్ఞతా ర్యాలీని నిర్వహించారు. పార్టీ కార్యాలయం నుంచి ప్రారంభమైన ర్యాలీ ఏఎంసీ కార్యాలయం వరకు సాగింది. ఈ సందర్భంగా జరిగిన సభలో ఎరిక్షన్‌బాబు మాట్లాడుతూ రైతులకు తొలివిడత పెట్టుబడి సాయాన్ని ముఖ్యమంత్రి చంద్రబాబు అందించారన్నారు. 2014 నుంచి 2019 వరకు రైతులకు సబ్సిడీపై 24 వేల ట్రాక్టర్లను సంపిణీ చేసిన ఘనత టీడీపీదేనన్నారు. 90 శాతం సబ్సిడీపై 7 డ్రోన్ స్ప్రేయర్లను ఇటీవల పంపిణీ చేసినట్లు తెలిపారు. పులివెందులలో జరిగిన ఎన్నికల్లో విజయకేతనం ఎగురవేసిన విధంగా స్థానిక సంస్థల ఎన్నికల్లో పచ్చ టీడీపీ ప్రభంజనం సృష్టించాలని కోరారు. ఏఎంసీ చైర్మన్ చేకూరి సుబ్బారావు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో టీడీపీ మండల పార్టీ అధ్యక్షుడు ప్రసాదరావు, యేర్వ మల్లికార్జునరెడ్డి, మేకల వళరాజు, ఎం.శ్రీనివాసరెడ్డి, టీడీపీ ద్వితీయ శ్రేణి నాయకులు శనగా నారాయణరెడ్డి, చిట్యాల వెంగళరెడ్డి, వేగినాటి శ్రీను, కాకర్లకోటయ్య, కంచర్ల సత్యనారాయణగౌడ్, షేక్ మాబు, జడి లక్ష్మయ్య, సొసైటి అధ్యక్షులు, రైతునాయకులు, రైతులు పాల్గొన్నారు.



ట్రాక్టర్ల ర్యాలీలో పాల్గొన్న ఎరిక్షన్‌బాబు

నేటి నుంచి ఒంగోలులో పుస్తక మహోత్సవం

ఒంగోలు కలెక్టరేట్, ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి) : ఒంగోలులోని పీవీఆర్ బాలుర పాఠశాల ఆవరణలో శుక్రవారం నుంచి ఈనెల 24వ తేదీ వరకు ఒంగోలు పుస్తక మహోత్సవాన్ని నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. విజయవాడ బుక్‌ఫెస్ట్ సొసైటీ, ఆంధ్రప్రదేశ్ సాంస్కృతికశాఖ, ఆంధ్రప్రదేశ్ గంటలయ పరిషత్ ఆధ్వర్యంలో ఈ ప్రదర్శన జరుగుతుందన్నారు. స్థానిక పీవీఆర్ బాలురపాఠశాల ఆవరణలో గురువారం సాయంత్రం ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఎమెస్కో ప్రచురణల ప్రతినిధి విజయకుమార్ మాట్లాడుతూ మారుతున్న పరిస్థితుల నేపథ్యంలో అందరూ పుస్తక పఠనానికి దూరమవుతున్నారన్నారు. సెల్‌ఫోన్లకు, టీవలకు బానిసలుగా మారుతూ సృజనాత్మకతను కోల్పోతున్నారని తెలిపారు. ఈపరిణామాలు భవిష్యత్‌లో మరింత ప్రమాదకరంగా మారే పరిస్థితి వచ్చిందన్నారు. దీనిని నిలువరించేందుకు ప్రతి ఒక్క తల్లిదండ్రి విద్యార్థులను పుస్తకాలకు మరింత చేరువ చేసేందుకు కృషిచేయాలని కోరారు. అందులో భాగంగానే అమ్మకాలతో సంబంధం లేకుండా పిల్లలకు పుస్తకాలను మరింత చేరువ చేసేందుకు ఈ పుస్తకమహోత్సవాన్ని నిర్వహిస్తున్నట్లు ఆయనతెలిపారు. విశాలాంధ్ర బుక్ హౌస్‌మేనేజర్ మనోహర్ నాయుడు మాట్లాడుతూ ఈపుస్తకమహోత్సవాన్ని రాష్ట్రమంత్రి డాక్టర్ డీఎస్‌బీవీ స్వామి, ఎంపీ మాగుంట శ్రీనివాసుల రెడ్డి, ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్, కలెక్టర్ తమీమ్ అన్సారియా, నగర కమిషనర్ వెంకటేశ్వరరావులు ప్రారంభిస్తారన్నారు. పుస్తక మహోత్సవం ప్రతిరోజూ మధ్యాహ్నం రెండు గంటల నుంచి రాత్రి 9 గంటల వరకు కొనసాగుతుందని చెప్పారు. ప్రజాశక్తి బుక్‌హౌస్ జనరల్ మేనేజర్ లక్ష్మయ్య మాట్లాడుతూ పుస్తక మహోత్సవం సందర్భంగా ప్రతిరోజూ సాహితీ సభలు, పుస్తక పరిచయాలు, సైన్స్ ఆవిష్కరణలు, సాంస్కృతిక కార్యక్రమాలు, చిన్నారుల కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. జేవీవీ నాయకులు సీఏ ప్రసాద్, సాహితీవేత్త పొన్నూరు శ్రీనివాసులు, జయప్రకాష్, వెంకటేష్ తదితరులు ఉన్నారు.



మాట్లాడుతున్న విజయ్‌కుమార్

ఆపదలో ఉన్న వారికి సాయం చేయడమే సీఎం లక్ష్యం

- **మంత్రి డోలా శ్రీబాల వీరాంజనేయస్వామి**
- **121 మందికి 60.77 లక్షల సీఎంఆర్‌ఎఫ్ చెక్కుల అందజేత**

టంగుటూరు (కొండపి), ఆగస్టు14 (ఆంధ్రజ్యోతి): ఆనారోగ్యంతో ఆపదలో ఉన్నవారికి సాయం చేయడమే సీఎం చంద్రబాబు నేతృత్వంలోని కూటమి ప్రభుత్వ లక్ష్యమని రాష్ట్ర సాంఘిక సంక్షేమశాఖామంత్రి డోలా శ్రీబాలవీరాంజనేయస్వామి అన్నారు. గురువారం ఉదయం తూర్పునాయుడుపాలెంలోని తన క్యాంపు కార్యాలయంలో మంత్రి స్వామి నియోజకవర్గంలోని వివిధ గ్రామాలకు చెందిన 121 మంది అనారోగ్య బాధితులకు రూ.60.77 లక్షల సీఎంఆర్ఎఫ్ చెక్కులతోపాటు సీఎం చంద్రబాబు బాధితులు త్వరగా కోలుకోవాలని ఆకాంక్షిస్తూ పంపిన లేఖను కూడా అందజేశారు. మంత్రి మీడియాతో మాట్లాడుతూ ఇప్పటి వరకు నియోజవకర్గంలో 631 మందికి రూ.5.73 కోట్లు ఆర్థిక సాయం అందించామన్నారు.



సీఎంఆర్‌ఎఫ్ చెక్కు అందజేస్తున్న మంత్రి స్వామి

- **డ్రోన్ పంపిణీ....**

జరుగుమల్లి మండలంలోని చతుకుపాడు గ్రామానికి చెందిన తారకరామ సి.హెచ్.సి గ్రూపునకు సబ్సిడీపై మంజూరయిన కిసాన్ డ్రోన్‌ను మంత్రి స్వామి పంపిణీ చేశారు. యూనిట్ విలువ రూ.9.80 లక్షలు కాగా ఇందులో రూ.7.84 లక్షలు సబ్సిడీ పోను గ్రూప్‌వాటాగా రైతులు రూ.1.96 లక్షలు చెల్లించారని మంత్రికి అధికారులు వివరించారు.

మట్టి గణపతిని పూజిద్దాం

టంగుటూరు (కొండపి), ఆగస్టు14 (ఆంధ్రజ్యోతి): పర్యావరణ హిత మట్టిగణపతిని పూజిద్దామని మంత్రి డోలా శ్రీబాలవీరాంజనేయస్వామి పిలుపునిచ్చారు. గురువారం తూర్పునాయుడుపాలెంలోని తన క్యాంపు కార్యాలయంలో మంత్రి వాలంటీర్ ఎన్విరాన్‌మెంట్ ఆర్గనైజేషన్ ప్రచురించిన 'మట్టి గణపతే - మహా గణపతి' వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరించారు.

గురుకుల విద్యార్థినికి ప్రోత్సాహంగా రూ.లక్ష అందజేసిన మంత్రి

కొండపి(సింగరాయకొండ), ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వం కష్టపడి చదువుకునే పేద విద్యార్థులకు అన్ని సౌకర్యాలు కల్పిస్తున్నదని మంత్రి డోలా శ్రీబాలవీరాంజనేయస్వామి అన్నారు. సింగరాయకొండ పాఠశాల ఇంటర్ విద్యార్థి సూరపోగు డెలీషియా యూఎస్ఏలో కెన్నడీ లుగర్ యూత్ ఎక్స్ఛేంజ్ అండ్ స్టడీ పథకం కింద ఉన్నత విద్య అభ్యసించడానికి అరుదైన అవకాశం పొందగా ఆమెకు మంత్రి స్వామి ప్రోత్సాహంగా లక్ష రూపాయల చెక్‌ను గురువారం పాఠశాల ఆవరణలో జరిగిన కార్యక్రమంలో అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రోత్సాహకాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో గురుకుల సంస్థ అదనపు కార్యదర్శి సునీల్‌రాజ్‌కుమార్, అకడమిక్ సంయుక్త కార్యదర్శి సంజీవరావు, డీసీవో, కళాశాల ప్రిన్సిపాల్ పాల్గొన్నారు.

విద్యార్థికి ఆర్థికసాయం



ఆర్థిక సాయం అందిస్తున్న క్షీరపురి క్లబ్ సభ్యులు

చీరాల, ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి) : చీరాల గౌతమీ కాలేజీలో విద్యాభ్యాసం పూర్తి చేసి ఉన్నత చదువులు అభ్యసించేందుకు వెళుతున్న నిరుపేద విద్యార్థి పల్లా యోగానంద్‌కు రోటరీ క్లబ్ ఆఫ్ క్షీరపురి వారి ఆధ్వర్యంలో రూ.40 వేలు ఆర్థిక సాయం అందజేశారు. దాతలు బండారుపల్లి హేమంత్ కుమార్, అడ్డగడ మల్లికార్జున, మద్దుల నాగేశ్వరరావు, ఆలపాటి వినయ చౌదరి మాట్లాడుతూ విద్యతోనే బంగారు భవిష్యత్తు ఉంటుందని, అయితే ఆర్థికసరమైన సమస్యలతో ఎవ్వరి చదువుకు ఆటంక కాకూడదని చెప్పారు. కార్యక్రమంలో నాగమల్లేశ్వరరావు, వంశీకృష్ణ, విజయ్‌కుమార్, రమణ, దేవరాజ్, వెంకటేశ్వరరావు, గౌతమి విద్యా సంస్థల అధినేత వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

తప్పిపోయిన తల్లి, కుటుంబ సభ్యుల చెంతకు..

- బీహార్ నుంచి చీరాలకు వస్తున్న కుమారుడు

కొత్తపేట(చీరాల), ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి) : తప్పిపోయి వచ్చి ఆంధ్రాలో యాచిస్తున్న తల్లిని నేడు కుమారుడు కలవనున్నాడు. బీహార్‌కు చెందిన సుమారు 50 ఏళ్ల మహిళ తప్పిపోయి కొన్నేళ్ల క్రితం ఆంధ్రాకు చేరింది. అక్కడక్కడ నుంచి యాచనపై ఆధారపడుతోంది. కొద్ది రోజుల క్రితం చీరాల పరిధిలోని కొత్తపేట జంక్షన్‌లో యాచిస్తూ చీరాల శక్తి టీం ఎస్సై హరిబాబు కంట పడింది. దీంతో తెలుగు తెలియని ఆమెతో స్థానిక బీహారీల సహకారంతో ఎట్టకేలకు బీహార్‌లోని ఆమె కుమారుడికి ఫోన్ ద్వారా సమాచారం చేరవేశారు. దీంతో ఆయన శుక్రవారం ఉదయం చీరాలకు చేరుకుని తల్లిని కలవబోతున్నాడు. దీంతో ప్రజలు చీరాల శక్తి టీం పోలీసులను అభినందిస్తున్నారు.

టిడిపీ నాయకుల సంబరాలు

ఇంకొల్లు,ఆగస్టు 14,(ఆంధ్రజ్యోతి) : పులివెందుల, ఒంటి మిట్ట జడ్పీటిసి స్థానాల ఉపఎన్నికలలో టీడీపీ అభ్యర్థులు అత్యధిక మెజార్టీతో విజయం సాధించడంతో ఇంకొల్లులో ఇంకొల్లులో ఆ పార్టీ శ్రేణుల సంబరాలు చేసు కున్నాయి. ఈ సందర్భంగా మిఠాయిలు పంచారు. కార్య క్రమంలో పర్చూరు మార్కెట్ యార్డు చైర్మన్ గుంజి వెంకట్రావు, ఇంకొల్లు పీఏసీఎస్ చైర్మన్ కరి శ్రీనివాసరావు, ఇంకొల్లు టౌన్ పార్టీ అధ్యక్షులు వలేరు మార్క్, బోడావు శివయ్య, స్థానిక నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

డెంగ్యూ నివారణకు చర్యలు

ఇంకొల్లు, ఆగస్టు 14,(ఆంధ్రజ్యోతి) : దోమలువృద్ధి చెందకుండా డెంగ్యూ వ్యాప్తి నివారణకు తగు జాగ్రత్తలు తీసుకుంటున్నట్లు ఇంకొల్లు పిహెచ్‌సి డాక్టర్ అంజలి అన్నారు. మండలంలోని ఇంకొల్లు, ఇడుపులపాడు, పూసపాడు సచివాలయాల పరిధిలోని నీటి నిల్వలలో గాంబూసియా చిన్న చేపలను విడిచి పెట్టారు. ఇది దోమల లార్వాలను తింటాయన్నారు.

స్త్రీ శక్తికి.. సిద్ధం

(5వ పేజీ తరువాయి)

అవగాహన కల్పించేలా అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. ఫ్లెక్సీల రూపంలో డిస్‌ప్లే చేశారు. మహిళల ఉచిత ప్రయాణానికి పల్నాడు జిల్లాలో 399 బస్సులను ఆర్టీసీ సిద్ధం చేసింది. చీరాల బస్టాండ్ వేదికగా శుక్రవారం సాయంత్రం స్త్రీశక్తి పథకాన్ని మంత్రి గొట్టిపాటి రవికుమార్ ప్రారంభించనున్నారు. జిల్లా వ్యాప్తంగా 87 రూట్లలో ఆర్టీసీ సర్వీసులు నడుస్తుండగా, 90 శాతం రూట్లలో స్త్రీశక్తి పథకం అమలుకానుంది.

రద్దీ దృష్ట్యా భద్రతపై ప్రత్యేక శ్రద్ధ..

శుక్రవారం నుంచి మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం అమలవుతున్న దృష్ట్యా భద్రతపై ఆర్టీసీ ప్రత్యేక శ్రద్ధ పెట్టనున్నది. గతంతో పోలిస్తే బస్సుల్లో ప్రయాణించే మహిళల సంఖ్యలో దాదాపు 25 శాతం పెరుగుదల నమోదు కానుందనే అంచనాలు ఉన్నాయి. దీనిని దృష్టిలో పెట్టుకుని అటు బస్సుల్లో, ఇటు డిపోలు, బస్టాండ్ ప్రాంగణాల్లో కూడా పెరిగే రద్దీని సమర్థంగా నిర్వహించడానికి సిబ్బందికి ఇప్పటికే కొన్ని సూచనలు చేసినట్లు ఆర్టీసీ అధికారులు తెలిపారు. మహిళల భద్రతతో పాటు వారితో మర్యాదపూర్వకంగా వ్యవహరించాలని సిబ్బందికి చెబుతున్నారు. ఆరంభంలో అవగాహన లేక అనుమతి లేని బస్సుల్లో కూడా మహిళలు ఎక్కే అవకాశం ఉందని, సంయమనంతో ఉండి వారికి సమాధానం చెప్పాలని ప్రభుత్వం సిబ్బందికి సూచిస్తోంది.

ఉచిత ప్రయాణం వర్తించే బస్సులు..

స్త్రీ శక్తి పథకంలో భాగంగా ఆర్టీసీలో ఐదు రకాల బస్సులకు మహిళలకు ఉచిత ప్రయాణం వర్తించేలా ప్రభుత్వం ఇప్పటికే జీవో జారీ చేసింది. పల్లెవెలుగు, అల్ట్రా పల్లెవెలుగు, సిటీ ఆర్డినరి, మెట్రో ఎక్స్‌ప్రెస్, ఎక్స్‌ప్రెస్ సర్వీసుల్లో మహిళలకు ఉచిత ప్రయాణం కల్పించనున్నట్లు స్పష్టం చేశారు. ఈ మేరకు పల్లెవెలుగు, అల్ట్రా పల్లెవెలుగు బస్సుల్లో మహిళల రద్దీ 20 నుంచి 30 శాతం మేరా పెరిగే అవకాశం ఉందని ఆ మేరకు ఏర్పాట్లు చేశారు. పల్లె వెలుగు బస్సుల్లో ఫుట్‌బోర్డు విస్తరణ, లోపల నిల్చొన్న మహిళలు పట్టుకునేలా హ్యాండిల్ స్లింగ్స్, అత్యవసర ద్వారం వంటి ఏర్పాట్లు చేశారు.

స్వాతంత్ర్య వేడుకలకు సర్వం సిద్ధం

అవీఇవీ

ముస్తాబైన పోలీసు పరేడ్ గ్రౌండ్

జాతీయ పతాకాన్ని ఆవిష్కరించనున్న మంత్రి స్వామి

400 మందికి ప్రశంసాపత్రాలు



ఒంగోలులోని పోలీస్ పరేడ్ గ్రౌండ్‌లో చురుగ్గా సాగుతున్న ఏర్పాట్లు

ఒంగోలు కలెక్టరేట్, ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి) : స్వాతంత్ర్య దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించేందుకు భారీ ఏర్పాట్లు జరిగాయి. జిల్లా స్థాయి వేడుకలకు ఒంగోలులోని పోలీసు పరేడ్ గ్రౌండ్ ముస్తాబైంది. రాష్ట్ర సాంఘిక సంక్షేమశాఖ మంత్రి డాక్టర్ డోలా శ్రీ బాలవీరాంజనేయస్వామి శుక్రవారం ఉదయం 9.00 గంటలకు జాతీయ పతాకాన్ని ఆవిష్కరించనున్నారు. అనంతరం పోలీసుల నుంచి గౌరవ వందనం స్వీకరించనున్నారు. ఈ సందర్భంగా అక్కడ పలు కార్యక్రమాలను ఏర్పాటు చేస్తున్నారు. జిల్లావ్యాప్తంగా 400 మందికిపైగా అధికారులు, ఉద్యోగులు, సిబ్బందితోపాటు వివిధ రంగాల్లోని ప్రముఖులకు ప్రశంసాపత్రాలను అందజేయనున్నారు. ప్రభుత్వ పథకాలను వివరిస్తూ స్టాల్స్, శకటాల ప్రదర్శన ఉంటుంది. మరోవైపు విద్యాశాఖ ఆధ్వర్యంలో విద్యార్థులతో సాంస్కృతిక ప్రదర్శనలకు ఏర్పాట్లు చేశారు. ఈ సందర్భంగా స్వాతంత్ర్య సమరయోధులను సత్కరించనున్నారు. వేడుకలకు హాజరయ్యే ప్రజాప్రతినిధులు, అధికారులు, వివిధ రంగాల ప్రముఖుల కోసం ప్రత్యేకంగా సీటింగ్‌ను ఏర్పాటు చేశారు. తిలకించేందుకు తరలివచ్చే ప్రజలు ఎలాంటి ఇబ్బందులు పడకుండా చర్యలు తీసుకున్నారు. స్వాతంత్ర్య వేడుకలను పురస్కరించుకొని జిల్లా పరిపాలన భవన్ (కలెక్టరేట్)ను విద్యుత్‌దీపాలతో అలంకరించారు. వర్షం కురిస్తే ప్రత్యామ్నాయంగా పోలీసు పరేడ్ గ్రౌండ్ పక్కనే ఉన్న కల్యాణ మండపంలో వేడుకలు నిర్వహించనున్నారు.

భారీ వర్షం.. నష్టం.. కష్టం

(7వ పేజీ తరువాయి)

నీరు ప్రవహించడంతో రాకపోలకు అంతరాయం ఏర్పడింది. క్రోసూరు మండలంలోని దొడ్లేరులో గృహాల్లోకి నీరు చేరి ప్రజలు ఇబ్బందులకు గురయ్యారు. అమరావతి మండలంలో నరుకుళ్లపాడు, ఎండ్రాయి వాగుల వెంబడి వరదనీరు భారీగా ప్రవహిస్తుంది. వరద ప్రభావంతో నరుకుళ్లపాడు వద్ద అమరావతి గుంటూరు రహదారి పక్కన మట్టి కొతపడింది. వరదనీటిలో ఉన్న మొక్కలు నల్లబడుతూ మొక్కలు ఎండిపోయే పరిస్థితి నెలకుంది. తుంగభద్ర, కొల్లిమర్ల డ్రైయిన్‌తో పాటు చేబ్రోలు మండలంలోని గుంటూరు నల్లడ్రెయిన్ ఉధృతి రెండో రోజు కూడా కొనసాగింది. డ్రెయిన్‌పై నుంచి వచ్చే వరద నీటితో పొన్నూరు, చేబ్రోలు మండలాల్లోని వరి పొలాల్లోని వాన నీరు బయటకు వెళ్లే అవకాశం లేకుండా పోయింది. తాడికొండ మండలంలో భారీ వర్షానికి 11,461 ఎకరాల్లో పంటలు నీటమునిగినట్లు వ్యవసాయశాఖ అధికారులు నివేదికలు సిద్ధం చేశారు. గురువారం కూడా కొండవీటి వారు, ఎర్రవాగు ఉధృతంగా ప్రవహించాయి.

కృష్ణానదికి పోటెత్తిన వరద

కృష్ణానదిలో వరద ఉధృతంగా ప్రవహిస్తుంది. అమరావతి వద్ద కృష్ణానదిలో సుమారు 5 అడుగుల ఎత్తులో నీటి ప్రవాహం కొనసాగుతోంది. నదిలో నీటి మట్టం పెరగడంతో లోతట్టు ప్రాంతాలు జలమయం అవుతున్నాయి. గంట గంటకు వరద ఉధృతి పెరుగుతూ లోతట్టు ప్రాంతాలను వరద నీరు ముంచెత్తుతోంది. కొల్లూరు మండలంలోని చింతల్లంక, పోతార్లంక గ్రామాల వద్ద లోతట్టు ప్రాంతాల్లోని వాణిజ్య పంటలు ముంపునకు గురయ్యాయి. అరవింద వారధి ఎగువన ఉన్న గండిలో నుంచి నీరు పెసర్లంక గ్రామాన్ని చుట్టుముట్టి కొల్లూరు కరకట్టను తాకింది. వరద ఉధృతి మరింత పెరిగితే లంక గ్రామాల్లోని ప్రజలను ఏ క్షణమైన ఖాళీ చేసేందుకు అధికార యంత్రాంగం సమాయత్తమైంది. ప్రభుత్వ పాఠశాలల్లో పునరావాస కేంద్రాలను సైతం ఏర్పాటు చేసేందుకు అధికారులు చర్యలు చేపట్టారు. రేపల్లె ఆర్డీవో రామలక్ష్మి, కొల్లూరు తహసీల్దార్ కార్యాలయంలో మకాం వేసి అధికారులను సమీక్షిస్తూ ముందస్తు చర్యలకు సిద్ధమవుతున్నారు.

వెద వెతలు

గుంటూరు, బాపట్ల, పల్నాడు జిల్లాల్లో తొలుత వర్షాభావ పరిస్థితుల్లో ఖరీఫ్‌లో వరి సాగు విషయంలో అధికశాతం రైతులు వెద పద్ధతి వైపే మొగ్గు చూపారు. ఎకరానికి రూ.పది వేల వరకు ఖర్చు చేశారు. గత నెలలో, ప్రస్తుతం కురిసిన భారీ వర్షాల ధాటికి వరి నష్టపోయినట్లు రైతులు వాపోతున్నారు. పెట్టిన పెట్టుబడి మొత్తం వర్షార్పణమైనట్లేనని అన్నదాతలు ఆవేదన చెందుతున్నారు. వరిపైరు లేత దశలో ఉందని ఇప్పటికే 48 గంటల నుంచి నీళ్లలోనే ఉందని, అది కుళ్లిపోవడం ఖాయమని, పెట్టిన పెట్టుబడి అంతా నష్టపోవడమేననే రైతులు వాపోతున్నారు. వరుణుడు గురువారం శాంతించినా రెండు రోజుల నుంచి పైర్లు ముంపులోనే ఉండడంపై రైతులు తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పూర్తిస్థాయిలో నష్టం తేలడానికి మరో రెండు రోజుల సమయం పడుతుందని వ్యవసాయశాఖ చెబుతోంది. పొలాల్లో నిలిచిన నీళ్లను బయటకు పంపడానికి ఉన్న అన్ని అవకాశాలను పరిశీలిస్తున్నామని, రైతులకు కూడా ఈ విషయంలో ఎప్పటికప్పుడు అప్రమత్తం చేస్తున్నామని అధికారులు చెబుతున్నారు.

బాపట్ల జిల్లాలో 16,309 హెక్టార్లు ముంపు

గురువారం బాపట్ల జిల్లా వ్యాప్తంగా 13 మీమీ. సగటు వర్షపాతం కురవగా అత్యధికంగా కారంచేడు మండలంలో 23 మీమీ. వర్షం కురిసింది. వర్షాల ధాటికి జిల్లా వ్యాప్తంగా ముంపు బారిన పడిన పైర్ల విస్తీర్ణంపై వ్యవసాయశాఖ ప్రాథమిక అంచనాలు రూపొందించింది. 9 మండలాల పరిధిలోని 69 గ్రామాలపై కుండపోత వర్షాల ప్రభావం ఉన్నట్లు తేల్చారు. వరి 16,197, వేరుశనగ 112 హెక్టార్లలో ముంపునకు గురికాగా 21,108 మంది రైతులపై ప్రభావం చూపినట్లు అధికారులు ప్రభుత్వానికి నివేదించారు. ఇవి ప్రాథమిక అంచనాలేనని, పొలాల్లో వరద తగ్గుముఖం పట్టాక కచ్చితత్వంతో కూడిన గణన ఉంటుందని అధికారులు తెలిపారు.

రోటరీ క్లబ్ అవయవదాన కమిటీ ఆధ్వర్యంలో నేత్రదానం

ఇంకొల్లు, ఆగస్టు 14,(ఆంధ్రజ్యోతి) : ఇంకొల్లు రోటరీ అవయవదాన కమిటీ ఆధ్వర్యంలో గురువారం నేత్రదానం జరిగింది.బోదవాడ గ్రామానికి చెందిన కొమ్మారెడ్డి వీరారెడ్డి(98) మృతి చెందగా కుటుంబసభ్యులు అంజిరెడ్డి,రమాదేవి,గాదె అంజమ్మ సహకారంతో శంకర కంటి వైద్యులు మృతుని నేత్రాలను సేకరించారు.నేత్రదానంకు సహకరించిన కుటుంబసభ్యులను రోటరీ అవయవదాన కమిటీ సభ్యులు సోమేపల్లి రామ్మోహనరావు,జెట్టి స్వామి,రోటరీ క్లబ్ అధ్యక్ష కార్యదర్శులు బలగం కోటేశ్వరరావు,అలవల రాఘవరెడ్డి,సభ్యులు అభినందించారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

- పర్చూరు - చీరాల రోడ్డులో ఘటన

పర్చూరు, అగస్టు 14 (ఆంధ్రజ్యోతి) : రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి చెందిన ఘటన పర్చూరు - చీరాల రోడ్డులోని స్థానిక జీవిఎం పాలిటెక్నిక్ కళాశాల సమీపంలో గురువారం చోటుచేసుకుంది. ఈప్రమాదంలో పర్చూరుకు చెందిన షేక్.ఇమాంస(42) మృతి చెందారు. గ్రామానికి చెందిన ఇంమాంస వృత్తి రీత్య టైలర్‌గా పనిచేస్తూ జీవనం సాగిస్తున్నారు. ఆయన తన ద్విచక్ర వాహనంపై చీరాల వెళ్లి తిరిగి వస్తుండగా బైక్ జారిపడటంతో తలకు బలమైన గాయాలయ్యాయి. క్షతగాత్రుడిని 108 వాహనం ద్వారా చీరాల తరలిస్తుంగా మృతి చెందాడు. మృతునికి భార్య కుమార్తె, కుమారుడు ఉన్నారు. కుటుంబానికి ఆదారం అయిన భర్త చనిపోవటంతో కుటుంబ సభ్యుల రోదనలు మిన్నంటుకున్నాయి. పోలీసులు ఘటన స్థలానికి చేరుకొని వివరాలు సేకరించారు.

అవీ..ఇవీ..

తాటివారిపాలేనికి మూడుబోర్లు మంజూరు


తాటివారిపాలెం గ్రామంలో వేస్తున్న బోరు

మార్టూరు, ఆగస్టు14 (ఆంధ్రజ్యోతి): మండలంలోని తాటివారిపాలెం గ్రామంలో ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు మూ డు బోర్లు మంజూరు చేయించారు. దాంతో మాజీ సర్పంచ్ వజ్జా వీరాంజనేయులు ఆధ్వ ర్యంలో గురువారం మూడు బోర్లు ఏర్పాటుకు శంకుస్థాపన చేశారు. గ్రామంలో గతంలో వేసిన కొన్ని బోర్లు వట్టిపోగా, మరి కొన్ని చోట్ల ప్రజల అవసరం కోసం చేతిపంపులు ఏర్పాటు చేయాలని టీడీపీ నాయకులు భావించారు. వారు ఈ విషయాన్ని ఎమ్మెల్యే ఏలూరి దృష్టికి తీసుకువెళ్లగా ఆయన మూడు బోర్లను మంజూరు చేయించారు.

దివ్యాంగులకు ప్రత్యేక వసతులు కల్పించండి

● ఎంపీడీవోకు వినతిపత్రం

వేటపాలెం(చీరాల), ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి) : సమస్యల పరిష్కారం కోసం ప్రభుత్వ కార్యాలయాలకు వచ్చే దివ్యాంగులకు ప్రత్యేక సౌకర్యాలు ఏర్పాటు చేయాలని నవ్యాంధ్ర వికలాంగుల హక్కుల సేవా సమితి ప్రతినిధులు వేటపాలెం ఎంపీడీవో రాజేష్‌బాబును కోరారు. గురువారం ఎంపీడీవోను కలిసి వినతిపత్రం అందజేశారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ దివ్యాంగుల స్థితిగతులను దృష్టిలో ఉంచుకుని జాతీయ దివ్యాంగుల హక్కుల చట్టం -2016 ప్రకారం నిధులు కేటాయించినట్లు వివరించారు. ఈ ప్రకారం నిరాశ్రయులైన దివ్యాంగులపై దృష్టి సారించాలని కోరారు. అందుకు ఎంపీడీవో సానుకూలంగా స్పందించారు. కాలేషా, రమేష్, రవితేజ, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

మూడు ద్విచక్రవాహనాలు స్వాధీనం

అద్దంకి, ఆగస్టు14(ఆంధ్రజ్యోతి): పలు సందర్భాలలో మూడు ద్విచక్ర వాహనాలను చోరీ చేసిన ఇద్దరు వ్యక్తులను పోలీసులు గురువారం అరెస్ట్ చేశారు. సీఐ సుబ్బరాజు కథనం మేరకు కొరిశపాడు మండలం మేదరమెట్ల కు చెందిన కుంచాల ఏసుకుమార్, పల్నాడు జిల్లా సత్తెనపల్లికి చెందిన ఉప్పాల శివయ్యలు అద్దంకి పట్టణంలో 2023 డిసెంబర్ 9న అద్దంకికి చెందిన అంజలి, 2024 జూన్24న రమేష్‌ల స్కూటీలను, అద్దంకి మండలం ధేనువకొండ కు చెందిన 2025 జూన్9న గుంజి అంకమ్మల మోటార్ సైకిల్‌ను దొంగలించారు. గురువారం ఎస్సై నరసింహులు, సిబ్బంది వాహనాల తనిఖీ చేస్తుండగా ఇరువురు పట్టుబడ్డారు. ఇరువురిని అరెస్ట్ చేసి రెండు స్కూటీలు, ఒక మోటార్ సైకిల్ స్వాధీనం చేసుకున్నట్లు సీఐ సుబ్బరాజు వివరించారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడు మృతి

● ఆర్‌టీసీ బస్సు- మోటారు సైకిల్ ఢీకొనడంతో ఘటన

మేదరమెట్ల, ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి) : విజయవాడ నుంచి ఒంగోలు వెళుతున్న ఆర్టీసీ బస్సు - తమ్మవరం నుంచి వెంపరాల వెళుతున్న మోటారు సైకిల్ ఢీకొన్న ఘటనలో యువకుడు మృతిచెందారు. బుధవారం రాత్రి విజయవాడ నుంచి ఒంగోలు వస్తున్న ఆర్టీసీ బస్సు అద్దంకి మండలం వెంపరాలకు చెందిన షేక్ జిలానీ బాషా(27)ను మేదరమెట్లలోని ఓ ప్రైవేటు పాఠశాల ఎదురుగా ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన జిలానీబాషాను స్థానిక పోలీసులు మేదరమెట్ల పీహెచ్‌సీకి తరలించారు. అప్పటికే ఆయన మృతిచెందినట్లు వైద్యులు నిర్ధారించారు. బాషా తమ్మవరంలో వేడుకకు హాజరై వెంపరాల తిరిగి వస్తుండగా ఘటన జరిగింది. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని విచారిస్తున్నారు.

ఆగి ఉన్న కారును ఢీకొన్న మరో కారు

మేదరమెట్ల : జాతీయ రహదారిలో గుడిపాడు- వెంకటాపురం మధ్య ఆగి ఉన్న కారును మరో కారు ఢీకొన్న ఘటనలో ముగ్గురు గాయపడ్డారు. గురువారం పర్చూరు నుంచి ఒంగోలు వెళుతున్న కారు డ్రైవర్ నిద్రమత్తులోనికి జారడంతో స్థానిక రాజస్తాన్ దాబా ఎదురుగా రోడ్డు అంచులో ఆగి ఉన్న కారును ఢీకొంది. కారులోని ముగ్గురు వ్యక్తులకు తీవ్ర గాయాలయ్యాయి. వారిని 108 వాహనంలో అద్దంకి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. మేదరమెట్ల పోలీసులు కేసు నమోదు చేసి విచారిస్తున్నారు.

ఈ రోడ్డులో ప్రయాణం అంటే హడలే

● బల్లికురవ- మార్టూరు దారిలో మోకాటి లోతు గోతులు
● వర్షపునీరు నిలిచి ప్రమాదాలు

బల్లికురవ, ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని బల్లికురవ మార్టూరు ఆర్‌అండ్‌బీ రోడ్డులో ప్రయాణం అంటే ప్రయాణికులు హడలి పోతున్నారు. ఈ రోడ్డున కొత్త వ్యక్తులు ఎవరైన వస్తే గోతులలో ఉన్న వర్షపు నీటిలో పడి ప్రమాదాల బారిన పడుతున్నారు. అడుగడుగుకు మోకాటి లోతు గోతులు ఉండడంతో ప్రజలు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. కొందరైతే గోతుల వద్ద ఫోటోలు తీసి సోషల్ మీడియాలో పోస్టులు చేస్తున్నారు. అధికారులు, ప్రభుత్వం వెంటనే స్పందించి మరమ్మతులు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.


నక్కబొక్కలపాడు- నాగరాజుపల్లి గ్రామాల మధ్య రహదారి

బల్లికురవ నుంచి వయా నాగరాజుపల్లి మీదుగా వెళ్లే మార్టూరు రోడ్డు 10 కిలోమీటర్ల ఉంది. ఈ రోడ్డును గతంలో టీడీపీ ప్రభుత్వం అధికారంలో ఉండగానే ఆరు కిలోమీటర్ల మేర డబుల్ రోడ్డుగా అభివృద్ధి పరిచారు. అనంతరం ఏడేళ్ల నుంచి మిగిలిన ఆ నాలుగు కిలో మీటర్ల మేర ఉన్న రోడ్డు గురించి ఎవరూ పట్టించుకో వడం లేదు. దీంతో రోడ్డు మొత్తం గోతలమయమైంది. నిత్యం వందల గ్రానైట్ లారీలు ముడిరాయిని తీసుకుని గ్రానైట్ ఫ్యాక్టరీలకు ఈ రోడ్డున రాకపోకలు సాగిస్తున్నాయి. ఈ గోతుల్లో పడి నిత్యం ఏదో ఒక లారీ బోల్తా


తటాకాన్ని తలపిస్తున్న బల్లికురవ-మార్టూరు రోడ్డు

పడుతోంది. ఇక ఆటోలలో ప్రయాణించే వారు, నిత్యం పాఠశాలకు బస్సుల్లో వెళ్లే వారు మరింత ఆందోళన చెందుతున్నారు. ఎదైన ప్రమాదం సంభవిస్తే విద్యార్థుల ప్రాణాల కు ముప్పు పొంచి ఉందని పేర్కొంటున్నారు. వర్షాకాలంలో సమస్య మరింత తీవ్రంగా ఉంటోందని ఇప్పటికైనా అధికా రులు స్పందించి రోడ్డు అభి వృద్ధికి నిధులు మంజూరయ్యే వరకు పెద్ద గోతుల మరమ్మతు లు అయిన చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.

సూపర్ సిక్స్ పథకాల అమలుతో ప్రజల మన్ననలు

రాష్ట్ర విద్యుత్‌శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్

పంగులూరు, ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో ప్రజాకూటమి ప్రభుత్వం ముఖ్యమంత్రి చంద్రబాబు నాయకత్వంలో సూపర్ సిక్స్ పథకాలను అమలుచేయడం ద్వారా ప్రజల మన్ననలు పొందుతోందని రాష్ట్ర విద్యుత్‌శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ అన్నారు. సామాజిక పింఛన్లు పెంచడంతో పాటు మూడునెలల మొత్తాన్ని ఏక కాలంలో లబ్ధిదారులకు ఒకేసారి చల్లిస్తున్నట్లు తెలిపారు. ఎంతమంది పిల్లలుంటే అంతమందికి తల్లికివందనం అందజేస్తున్నట్లు పేర్కొన్నారు. రైతులందరికీ అన్నదాత సుఖీభవ అమలు, ఉచితగ్యాస్ సిలిండర్లు పంపిణీచేస్తున్నట్లు వివరించారు. మహిళలకు ఉచితబస్సు పథకం అమలుకు నేడు శ్రీకారం చుట్టడంద్వారా ఇచ్చిన హామీలను ప్రభుత్వం నిలబెట్టుకొంటోంద న్నారు. రాష్ట్రంలో 1500 కొత్తబస్సులు ప్రవేశపెట్టడం ద్వారా ఆర్‌టీసీకి పూర్వవైభవం తీసుకొచ్చినట్లు తెలిపారు. రాష్ట్రంలో అనారోగ్య బాధిత కుటుంబాలకు ఇప్పటివరకు రూ.400 కోట్ల సీఎం సహాయనిధిని అందజేసినట్లు వివరించారు. నియోజకవర్గంలో ఇప్పటివరకు 1021 మందికి సీఎంఆర్‌ఎఫ్ అందజేశామన్నారు. అదేవిధంగా ప్రభుత్వం చేపడుతున్న పలు అభివృద్ధి కార్యక్రమాలను వివరించారు.

స్ఫూర్తిదాయకంగా హర్‌ఘర్ తిరంగా ర్యాలీలు

ఉత్సాహంగా పాల్గొన్న ప్రజలు, చిన్నారులు

చీరాల, ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి) : హర్‌ఘర్ తిరంగా కార్యక్రమంలో భాగంగా గురువారం చీరాలలో భారీ జాతీయ జెండా ప్రదర్శన నియోజకవర్గ టీడీపీ అధికార ప్రతినిధి డా.మహేంద్రనాథ్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా 79 అడు గుల జాతీయజెండాతో 'హర్ ఘర్ తిరంగ ర్యాలీ నిర్వహించారు. పట్టణంలో పలు ప్రధా న వీధుల్లో జెండాతో ర్యాలీ నిర్వహించగా పెద్ద ఎత్తున ప్రజలు, పలు పాఠశాలల చిన్నా రులు ఉత్సాహంగా పాల్గొన్నారు. ఎంతోమంది మహనీయులు త్యాగఫలితం దేశ స్వాతంత్ర్య మని అటువంటి అమర వీరుల త్యాగాలను గుర్తు చేసుకోవాల్సిన అవసరం ఉందన్నారు. ఆయన వెంట మున్సిపల్ ఛైర్మన్ సాంబశివరావు, కమిషనర్ అబ్దుల్ రషీద్, డీఈ రఘురామ్, కౌన్సి లర్లు, కూటమి నాయకులు, కార్యకర్తలు, ప్రజలు పాల్గొన్నారు.

సంతమాగులూరు : భారత జాతీయ పతకాన్ని ప్రతి భారతీయుడి ఇంటిపై ఎగరవేసి దేశభక్తిని, జాతీయ సమైక్యతను చాటాలని ఏల్చూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు మాధవి తెలిపారు. గురువారం మండలంలోని ఏల్చూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు జాతీయ జెండాతో హర్ ఘర్ తిరంగ ర్యాలీని గ్రామంలో నిర్వహించారు. ఈ ప్రదర్శనతో యువతకు, విద్యార్థులకు దేశభక్తి భావన పెరుగుతోందన్నారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్ వైజర్ ప్రమీల, మహిళా పోలీసులు మహా లక్ష్మి, అమీన్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.


చీరాలలో 79 అడుగుల భారీ జాతీయ జెండా ప్రదర్శన

శ్మశాన వాటిక వద్ద శివుని విగ్రహ ప్రతిష్ఠ

సంతమాగులూరు ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి) : సంతమాగులూరు మండలంలోని సంతమాగులూరు పాత మాగులూరు గ్రామ హిందువుల శ్మశాన వాటిక ముఖద్వారంలో ఆధ్యాత్మికత శోభిల్లే విధంగా రమారమి పది అడుగుల ఎత్తైన ఏకరాతి మహాశివుని విగ్రహానికి జీవప్రతిష్ఠ గురువారం నిర్వహించారు. వేద పండితులు ముందుగా నిర్ణయించిన ముహూర్తం ప్రకారం గురువారం ఉదయం 10:48 నిమిషాలకు శివాలయ ప్రధాన అర్చకులు కూరపాటి సత్యనారాయణ ఆధ్వర్యంలో వేదమంత్రోచ్చారణ నడుమ శివుని విగ్రహాన్ని ప్రతిష్ఠించి ప్రత్యేక అలంకరణతో జీవ ప్రతిష్ఠ చేశారు. కార్యక్రమంలో సంతమాగులూరు గ్రామ నాయకులు కర్మశాల నిర్మాణ సమన్వయకర్త అట్లా పెద్ద వెంకటరెడ్డి కుటుంబ సభ్యులు పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. ప్రత్యేక భారీ వాహనంలో తీసుకొచ్చిన శివుని విగ్రహానికి విశేష పూజలు చేశారు. కార్యక్రమంలో సంతమాగులూరు పాత మాగులూరు గ్రామానికి చెందిన కూటమి నాయకులు, టీడీపీ నాయకులు చేవూరు వాసురెడ్డి ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.


పూజల్లో పాల్గొన్న దాతలు

వైభవంగా విగ్రహ ప్రతిష్ఠలు

పెద్దఎత్తున హాజరైన భక్తులు

బల్లికురవ, ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కొత్తూరు గ్రామంలో గురవారం అంగరంగ వైభవంగా పోలేరమ్మతల్లి, అంకమ్మ తల్లి దేవాలయాలు, మరియు వెంకటేశ్వర స్వామి శంకు చక్రాల నామాల ప్రతిష్ఠ కార్యక్రమం జరిగింది. గ్రామస్థులు సమష్టి కృషితో పెద్ద ఎత్తున విరాళాలు సేకరించి గ్రామంలో నూతన దేవాలయాలను నిర్మించారు. గత మూడు రోజుల నుండి గ్రామంలో ప్రతిష్ఠ పూజా కార్యక్రమాలు జరుగుతున్నాయి. వేద పండితులు కృష్ణ శర్మ పర్యవేక్షణలో ప్రతిష్ఠా కార్యక్రమంను నిర్వహించారు. ఈసందర్భంగా గ్రామంలో పండగ వాతావరణం నెలకొంది. శ్రావణ మాసం అమ్మవారి విగ్రహాల ప్రతిష్ఠ కావటంతో పలు గ్రామాల నుండి భక్తులు తరలి వచ్చి ఈ కార్యక్రమాలలో పాల్గొన్నారు. ప్రతిష్ఠ అనంతరం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. సాయంత్రం నుండి కొత్తూరు గ్రామంలో గ్రామోత్సవం నిర్వహించారు.



అంకమ్మ, పోలేరమ్మ విగ్రహాలు


ప్రతిష్ఠ సందర్భంగా పూజల్లో పాల్గొన్న భక్తులు

కూకట్లపల్లిలో నిరుపేద రైతుల ఆందోళన

రికార్డులో పేరు నమోదు చేయకపోవడంపై ఆగ్రహం


రైతులతో మాట్లాడుతున్న తహసీల్దార్ రవినాయక్

బల్లికురవ, ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి): తమకు భూములు, పట్టాదారు పుస్తకాలు కూడా ఇచ్చి రికార్డులో నమోదు చేయలేదని దీంతో తాము ప్రభుత్వ పథకాలను పొందలేక పోతున్నామని కూకట్లపల్లి గ్రామానికి చెందిన ఎస్సీ, ఎస్సీ రైతులు గురువారం ఆందోళన చేపట్టారు. బల్లికురవ తహసీల్దార్ కార్యాలయం వద్ద వారు సీఐటీయూ నేత గంగయ్యతో కలిసి ఆందోళన చేస్తుండగా తహసీల్దార్ రవినాయక్ వారి వద్దకు వచ్చి మీ సమస్య ఉంటే తెలియజేస్తే విచారణ చేసి న్యాయం చేస్తామని హామీ ఇచ్చారు. మీ వద్ద ఉన్న పత్రాలను అందజేయాలని కోరారు. దీంతో వారు వెంటనే ఆందోళన విరిమించారు.

నూరు శాతం అక్షరాస్యులుగా తీర్చిదిద్దాలి

బల్లికురవ, ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి): గ్రామాలలో నిరక్షరాస్యులను గుర్తించి వారికి అక్షరాస్యులుగా తీర్చి దిద్దేలా ప్రత్యేక కార్యక్రమం చేపడుతున్నామని ఎంపీడీవో జి, పాంగురంగస్వామి తెలిపారు. గురువారం జిల్లా కేంద్రం నుండి వచ్చిన వయోజన విద్య పర్యవేక్షకులు శ్రీనివాసరావు ఎంపీడీవోతో సమావేశం అయ్యారు. బల్లికురవ మండలంలో 3700 మంది నిరక్షరాస్యులు ఉన్నారని వారిని బ్యాచ్‌లుగా విభజన చేసి వలంటీర్లను ఏర్పాటు చేసి వారిని అక్షరాస్యులుగా తీర్చి దిద్దేలా చర్యలు చేపట్టాలని కోరారు. అక్షర ఆంధ్ర అనే పేరుతో ఈ కార్యక్రమాన్ని ఏర్పాటు చేశామని, పొదుపు సంఘాలలో ఉన్న వారిని ఉపాధి కూలీలను ఈ కార్యక్రమంలో భాగస్వామ్యం చేయాలని కోరారు.


ఎంపీడీవోకు ప్రణాళికను వివరిస్తున్న శ్రీనివాసరావు

దాతల సహకారంతో సభావేదిక నిర్మాణం

ఇంకొల్లు, ఆగస్టు 14, (ఆంధ్రజ్యోతి) : ఇంకొల్లు పంచాయితీ ఆవరణలో దాతల సహకారంతో 3లక్షలతో సభావేదిక నిర్మాణం చేయనున్నట్లు పంచాయితీ కార్యదర్శి అడ్డగడ్డ వెంకటేశ్వర్లు తెలిపారు.ఇంకొల్లుకు చెందిన వ్యాపారవేత షేక్ మబ్బులుసాహెబ్ ఇటీవల మృతి చెందగా ఆయన జ్ఞాపకార్థం వారి కుమారులు నజీర్ అహ్మద్,బషీర్ అహ్మద్ పంచాయితీ ఆవరణలో సుమారు 3 లక్షలతో సభావేదిక నిర్మాణం చేపట్టనున్నట్లు తెలిపారు. గురువారం నిర్మాణపు పనులు ప్రారంభించగా మాజీ వైస్ సర్పంచ్ మాబాష,పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

వాలీబాల్ పోటీలలో విద్యార్థినుల సత్తా

వేటపాలెం(చీరాల), ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి) : విజయవాడలో ఈ నెల 18 నుంచి జరిగే రాష్ట్రస్థాయి వాలీబాల్ పోటీలకు వేటపాలెం బాలికల పాఠశాలకు చెందిన గాయత్రి, బిందు ఎంపికయ్యారు. ఇటీవల ప్రకాశం జిల్లా త్రోవగుంటలో నిర్వహించిన పోటీల్లో సత్తాచాటి వీరు అర్హత సాధించారు. అయితే రాష్ట్రస్థాయి పోటీల్లో కూడా ప్రతిభ కనబరిస్తే డిసెంబర్ 4 నుంచి 13 వరకు చైనాలో జరిగే వరల్డ్ స్కూల్ వాలీబాల్ ఛాంపియన్ షిప్ పోటీల్లో పాల్గొంటారన్నారు. ఈ క్రమంలో గురువారం స్కూల్లో నిర్వహించిన సమావేశంలో ప్రధానోపాధ్యాయురాలు సరోజని, వ్యాయామ ఉపాధ్యాయులు శ్రావణి, దేవభిక్షం ప్రత్యేకంగా అభినందించారు.

వైభవంగా విమాన కలశ పునఃప్రతిష్ఠ



కలశాన్ని తీసుకెళుతున్న దాతలు, ప్రతిష్ఠిస్తున్న అర్చకులు, భక్తులు

అద్దంకి, ఆగస్టు14 (ఆంధ్రజ్యోతి): శింగరకొండ లక్ష్మీనరశింహస్వామి దేవాలయం విమాన కలశ పునఃప్రతిష్ఠ గురువారం వైభవంగా నిర్వహించారు. మంగళవారం నుంచి ప్రత్యేక పూజలు, హోమాలు నిర్వహించి గురువారం దాతలు కోనేటి అనిల్, సాహిత్య, శేఖర్, శైలజ దంపతులు సహకారంతో విమాన కలశ ప్రతిష్ఠ నిర్వహించారు. భక్తులు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు. ధర్మకర్తల మండలి ఛైర్మన్ గుంజి శ్రీనివాసరావు, ఈవో మద్దినేని శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు. భక్తులకు అన్నదానం నిర్వహించారు.

నేటి స్వాతంత్ర్య నినాదం క్విట్ ట్రంప్

చీరాల, ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి) : నేడు ప్రతిఒక్కరూ నినందించాల్సిన స్వాతంత్ర్య నినాదం 'క్విట్ ట్రంప్ - క్విట్ పాకిస్తాన్' అని సామాజికవేత్త సర్విశెట్టి సుబ్బరామయ్య పేర్కొన్నారు. పాకిస్తాన్‌కు ట్రంప్ తోడై భారతదేశ మూలాలను ఇబ్బందులకు గురి చేయాలని చూస్తున్నట్లు చెప్పారు. 'మేక్ ఇన్ ఇండియా' నినాదంతో స్వదేశీ వస్త్రాలను ధరించాలని సుబ్బరామయ్య ఒక ప్రకటనలో కోరారు.

రోటరీ భవన నిర్మాణానికి భూమి పూజ


భూమిపూజ చేస్తున్న ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు

మార్టూరు,ఆగస్టు14(ఆంధ్రజ్యోతి): మార్టూరులో రోటరీ భవన నిర్మాణానికి గురువారం ఎమ్మెల్యే ఏలూరి సాంబశి వరావు భూమి పూజ చేశారు. పట్టణంలో పడమర బజారున సాయిబాబా వాటర్‌ప్లాంట్ నుంచి ప్రభుత్వ జూనియర్ కళాశాలకు వెళ్లే రోడ్డులో ప్రభుత్వ స్థలంలో భవనం నిర్మించనున్నారు. ఇంచుమించు 5 సెంట్లు విస్తీర్ణంలో భవన నిర్మాణం చేస్తున్నట్లు తెలిపారు. ఈ మేరకు ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు భవన నిర్మాణానికి రోటరీ సభ్యులు ఏర్పాటుచేసిన శంకుస్థాపన కార్యక్రమంలో ఎమ్మెల్యే పాల్గొని పనులు ప్రారంభించారు. కార్యక్రమంలో రోటరీ అధ్యక్షులు మాదాల సాంబశివరావు, చెరుకూరి నాగేశ్వరరావు, ఇంటూరి ఆంజనేయులు, ఎఫర్ట్ సంస్థ డైరెక్టర్ జాష్టి వెంకట మోహనరావు, చెరుకూరి అంజిబాబు, జాష్టి సాంబశివరావు, పార్టీ నాయకులు షేక్ రజాక్, తాటి నాగేశ్వరరావు, చెన్నుపాటి బసవరాములు తదితరులు పాల్గొన్నారు.

ఛైర్మన్‌గా శ్రీనివాసరావు బాధ్యతల స్వీకరణ


శ్రీనివాసరావును సన్మానిస్తున్న విక్రం నారాయణ, టీడీపీ నేతలు

చినగంజాం, ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని చింతగుంపల్లె ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘం త్రీమెన్ కమిటీ సభ్యులు గురువారం ప్రమాణ స్వీకారం చేశారు. గొనసపూడి గ్రామంలోని చింతగుంపల్లె పీఏసీఎస్ క్యాష్ కౌంటర్ కార్యాలయంలో పీఏసీఎస్ సీఈవో జి.శేఖర్ ఛైర్మన్ బత్తుల శ్రీనివాసరావు, సభ్యులు సందు శ్రీనివాసరావు, యాదాల నాగేశ్వరరావులతో ప్రమాణ స్వీకారం చేయించారు. మండల పరిధిలోని టీడీపీ నాయకులు నూతనంగా ఎంపికైన ఛైర్మన్, సభ్యులను సన్మానించి అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో యువ పారిశ్రామికవేత్తలు విక్రం నారాయణరావు, అజయ్‌బాబు, టీడీపీ నాయకులు కొండ్రగుంట శ్రీహరి, రాయని ఆత్మారావు, పర్వతరెడ్డి సత్యనారాయణ, అబ్దుల్‌కలాంఅజాద్, టీ.జయరావు, మోటుమర్రి రామసుబ్బారావు, నరహరి శ్రీనివాసరావు, దివ్వకోలు రాము, వడ్లమూడి సత్యనారాయణ, పట్టాభి వెంకటేశ్వర్లు, దండుప్రోలు తిరుపతిరావు, దేవతోటి నాగరాజు, కేశనపల్లి శ్యాంబాబు, గంటా వెంకటనారాయణ, పీ.లక్ష్మీనారాయణ, పీ.వి.శ్రీనివాసరావు, కే.ఉదయ్‌భాస్కరరావు, టి.తిరుపతిరావు, ఎస్.లక్ష్మణ్‌రావు, కావూరి శారద, టీడీపీ ఇంకొల్లు మండల అధ్యక్షులు నాయుడు హనుమంతరావు, పీఏసీఎస్ సిబ్బంది ఎస్.నాగబాబు, ఎం.వీరయ్యలు, బీజేపీ నాయకలు ఉలిచి ఏసుబాబులు పాల్గొన్నారు.

కార్యకర్త పోస్టు కేటాయింపులో అన్యాయం

● అద్దంకిలో మహిళలు, టీడీపీ నాయకుల నిరసన


నిరసన తెలియజేస్తున్న మహిళలు

అద్దంకి,ఆగస్టు14 (ఆంధ్రజ్యోతి): టీడీపీ ఆవిర్భావం నుండి పార్టీలో ఉండి, పార్టీ కోసం ఎంతో కష్ట పడ్డా అంగన్‌వాడీ కార్యకర్త పోస్టు కేటాయింపులో అన్యాయం జరిగిందని, తెలుగుదేశం నాయకులు, మహిళలు గురువారం మండలంలోని తిమ్మాయపాలెం లో టీడీపీ జెండా వద్ద నిరసన వ్యక్తం చేశారు. వైసీపీ కార్యకర్త కు అంగన్‌వాడీ కార్యకర్త పోస్టు కేటాయించారని ఆరోపించారు. ఇప్పటికైనా టీడీపీ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ ప్రత్యేక దృష్టి సారించి పార్టీ కోసం కష్టపడ్డ కార్యకర్తలకు న్యాయం జరిగేలా అంగన్‌వాడీ కార్యకర్త పోస్టు కేటాయింపు తగు న్యాయం చేయాలని కోరారు. టీడీపీ నేతలు పరిటాల శ్రీనివాసరావు,నాగరాజు, పలువురు మహిళలు పాల్గొన్నారు.

'సోమశిల'లో 43.776 టీఎంసీల నిల్వ

అనంతసాగరం (ఆంధ్రజ్యోతి): సోమశిల జలాశయానికి ఎగువ నుంచి వస్తున్న వరద ప్రవాహం పెరుగుతోంది. బుధవారం 23,088 క్యూసెక్కులు వస్తుండగా గురువారానికి 30,871 క్యూసెక్కులకు పెరిగింది. డ్యాంలో 43.776 టీఎంసీల నీరు నిల్వ ఉన్నట్లు అధికారులు తెలిపారు. దిగువ డెల్టాకు 1,850, వరద కాలువకు 7,200, ఉత్తర కాలువకు 340 క్యూసెక్కులు సరఫరా చేస్తున్నారు.

● **రాపూరు :** కండలేరు డ్యాంలో 27.17 క్యూసెక్కుల నీరు ఉందని ఏఈ అనీల్‌కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. సోమశిల నుంచి 6600 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వస్తుండగా, 1935 క్యూసెక్కుల నీరు అవుట్ ఫ్లో ఉందని తెలిపారు.



నెల్లూరు : పోలీస్ పరేడ్ మైదానంలో రూపుదిద్దుకున్న స్వాతంత్ర్య దినోత్సవ సభా వేదిక



విద్యుద్దీప వెలుగుల్లో కలెక్టరేట్

స్వాతంత్ర్య వేడుకలకు విస్తృత ఏర్పాట్లు

● ముస్తాబైన పోలీసు కవాతు మైదానం ● 332 మందికి ఉత్తమ సేవా అవార్డులు
● విద్యుద్దీప వెలుగుల్లో ప్రభుత్వ కార్యాలయాలు

నెల్లూరు (హరనాథపురం), ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి) : 79వ స్వాతంత్ర్య దినోత్సవ వేడకలకు జిల్లా ముస్తాబయ్యింది. జిల్లా కేంద్రమైన నెల్లూరులోని పోలీసు పెరేడ్ మైదానంలో ఈ వేడుకలు శుక్రవారం ఉదయం 9గంటలకు ప్రారంభమవుతాయి. రాష్ట్ర పురపాలక పట్టణాభివృద్ధిశాఖ మంత్రి పొంగూరు నారాయణ జాతీయ పతాకాన్ని ఆవిష్కరిస్తారు. అనంతరం పోలీసు గౌరవ వందనం స్వీకరిస్తారు. ప్రజలను ఉద్దేశించి ప్రసంగిస్తారు. వివిధ ప్రభుత్వ శాఖలు తమ పనితీరును చాటుతూ శకటా లను ప్రదర్శించనున్నాయి. అలాగే, విద్యార్థులు కూడా సాంస్కృతిక ప్రదర్శనలు నిర్వహిస్తారు. ఇందు కోసం జిల్లా యం త్రాంగం అన్నీ ఏర్పాట్లు పూర్తి చేసింది. విశిష్ట సేవలు అందించిన ప్రభుత్వ అధికారులు, ఉద్యోగులు 332 మందికి మంత్రి నారాయణ చేతుల మీదుగా పురస్కారాలు, ప్రశంసా పత్రాలు అందచేయనున్నారు. వీఐపీలు, అవార్డు గ్రహీతలు, విద్యార్థులు కూర్చోడానికి అన్నీ ఏర్పాటు చేశారు. స్వాతం త్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకుని కలెక్టరేట్‌తోపాటు అన్నీ ప్రభుత్వ కార్యాలయాలను విద్యుత్‌దీపాలతో అలంకరించారు. నగరపాలక సంస్థ అధికారులు మంచినీటి వసతి ఏర్పాట్లు చేసింది.



అమ్మకానికి మువ్వన్నెల జెండాలు



అవ్వో ఎంతబాగున్నాయో...

● **ఏర్పాట్లను పరిశీలించిన ఎస్పీ**

నెల్లూరు (స్టోన్‌హౌస్‌పేట) : పోలీస్ కవాతు మైదానంలో జరుగుతున్న ఏర్పాట్లను ఎస్పీ కృష్ణకాంత్ గురువారం పరిశీలించారు. కవాతు పరిశీలించి ఇంతే ఉత్సాహంతో స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల్లోనూ చేయాలని సిబ్బందికి సూచించారు. భద్రతా పరంగా తీసుకోవాల్సిన చర్యలపై దిశా నిర్దేశం చేశారు. ముఖ్య అతిథులకు గౌరవార్థం ఇచ్చే వందన సమర్పణ విషయంలో అప్రమత్తంగా ఉండాలన్నారు. అదనపు అదనపు ఎస్పీ సౌజన్య, ఎస్‌బి, ఎఆర్ డీఎస్పీలు ఎ శ్రీనివాసరావు, ఎస్ చంద్రమోహన్, ఆర్‌ఐలు అంకమరావు, రాజారావు, హరిబాబు, పాల్‌రాజు, శ్రీనివాసుల రెడ్డి, పాల్గొన్నారు.

'స్త్రీశక్తి'కి సర్వం సిద్ధం!



ఆర్టీసీ బస్సుకు రంగులు అద్దుతున్న కార్మికులు

● నేటి నుంచే మహిళలకు ఉచిత ప్రయాణం
● సీఎం ప్రారంభించిన తర్వాత అమలులోకి..
● సాయంత్రం నుంచి అందుబాటులోకి..
● గుర్తింపు కార్డు చూపితే జీరో టికెట్

నెల్లూరు (స్టోన్‌హౌస్‌పేట), ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి) : ఆర్టీసీ బస్సులు ఇక మహిళల సొంత బస్సుల్లా మారనున్నాయి. 'స్త్రీశక్తి' పేరుతో బస్సుల్లో ఎంచక్కా బస్సుల్లో ఉచితంగా ప్రయాణించనున్నారు. ఎన్నికల హామీల అమల్లో భాగంగా శుక్రవారం నుంచి రాష్ట్ర ప్రభుత్వం ఈ సౌకర్యం కల్పించనుంది.

● **సాయంత్రం తర్వాతే ఉచితం**

రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు విజయవాడలో సోమవారం సాయంత్రం ఈ పథకాన్ని ప్రారంభించనున్నారు. ఇక నెల్లూరులోని ఆర్టీసీ ప్రధాన బస్టాండులో మంత్రి పొంగూరు నారాయణ, కలెక్టర్ ఓ ఆనంద్, నెల్లూరు జోనల్ చైర్మన్ సన్నపురెడ్డి సురేశ్‌రెడ్డిలు సాయంత్రం 5 గంటలకు మహిళల ఉచిత ప్రయాణానికి పచ్చజండా ఊపనున్నారు. ఆ తర్వాతే మహిళలకు ఉచిత ప్రయాణం అందుబాటులోకి రానుంది. మహిళల వద్ద గుర్తింపు కార్డును పరిశీలించి టిమ్ మిషన్ ద్వారా కండక్టర్లు జీరో టికెట్‌ను అందజేస్తారు. అంటే శుక్రవారం ఉదయం నుంచి సాయంత్రం వరకు బస్సుల్లో ప్రయాణించే మహిళలు టికెట్టు కొనాల్సిందే.

● **మరోసారి బస్సుల కండీషన్ పరిశీలిస్తూ**

'స్త్రీశక్తి' పథకాన్ని రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా తీసుకుంది. రెండు నెలల నుంచి ఆర్టీసీ అధికారులతో ప్రభుత్వ పెద్దలు నిరంతరం సమావేశాలు నిర్వహిస్తూ అప్రమత్తం చేస్తున్నారు. మార్గమధ్యంలో బస్సులు ఆగకూడదని, మహిళలతో మర్యాదపూర్వకంగా మెలగాలని, బస్సులు కండీషన్‌లో ఉండేలా చూడాలని ఇలా పలు అంశాలపై రోజూ చర్చిస్తున్నారు. అధికారులు సైతం ఆయా డిపోల పరిధిలో సిబ్బందికి అవగాహన కల్పిస్తూ సమావేశాలు నిర్వహించారు.

మరుభూమి కోసం.. 'మరణ' యాతన!

● మనిషికి దక్కని మరణానంతర గౌరవం ● శ్మశానాల్లో కానరాని కనీస సౌకర్యాలు

మనిషి జీవించి ఉన్నప్పుడే కాదు.. మరణంలోనూ గౌరవం ఇవ్వాలని మత విశ్వాసాలు నిర్దేశిస్తున్నాయి. ఒక్కో మతంలో ఒక్కో పేరుతో పిలుచుకున్నా.. అన్నింటి భావం మాత్రం ఒక్కటే. తెలుగులో అంతిమ సంస్కారాలు అంటారు. మనిషి జీవించినప్పుడు ఎలా హక్కులు కలిగి ఉంటాడో... మరణానంతరం మట్టిలోనో, మంటలోనో కలిసే వరకు అంతే హక్కులు కలిగి ఉంటాడు. స్వాతంత్ర్యం సిద్ధించిన తరువాత రాజ్యాంగం కల్పించిన హక్కుల విషయంలో చాలా ప్రగతి కనిపించింది. సాంఘిక దురాచారాలు అంటరానితనం, బాల్య వివాహాలు, మూఢనమ్మకాలు దాదాపుగా లేవనే చెప్పాలి. అయితే 78 ఏళ్ల స్వాతంత్ర్య భారతావనిలో ఇంకా అక్కడక్కడ మరణానంతర గౌరవం మాత్రం దక్కడం లేదు. జిల్లాలో ఇంకా పాడె మోసుకొని వెళ్లడానికి దారిలేని గ్రామాలు ఎన్నో ఉన్నాయి. శవాన్ని పాతిపెట్టడానికి ఆరడుగుల జాగా దొరకని పల్లెలూ ఉన్నాయి. తెలుగుదేశంలో చంద్రబాబు శకం ఆరంభమైన తొలిరోజుల్లో జన్మభూమి పథకంతో ప్రజల్లో రగిలిన స్ఫూర్తి చాలా గ్రామాల్లో శ్మశాన వాటికలకు కొత్త రూపు ఇచ్చింది. ఆ దశలో ప్రభుత్వం స్పందించి శ్మశానాలకు భూమి, అక్కడకు వెళ్లేందుకు దారుల సౌకర్యం కల్పించింది. అప్పుడు మొదలైన ఈ ఉద్యమం ఆ తరువాతి ప్రభుత్వాలు కూడా కొనసాగించాయి. అయినా ఇంకా కొన్ని గ్రామాలు ఈ అదృష్టానికి నోచుకోలేదు. స్వాతంత్ర్యం వచ్చి ఏడున్నర దశాబ్దాలు దాటుతున్నా.. అక్కడ మరణించిన వారికి దక్కాల్సిన చివరి హక్కులు దక్కడం లేదు. అలాంటి వాటికి ఉదాహరణలే ఈ గ్రామాలు...



స్థలాలు లేక అధ్వానంగా...

మనుబోలు : మండలంలోని చాలా పంచాయతీల్లో శ్మశానాలకు సరైన స్థలాలు లేవు. గత టీడీపీ ప్రభుత్వంలో (2014-19) కొన్ని పంచాయతీలకు శ్మశానాల బాగుకోసం నిధులు కేటాయించారు. అంటే ఒక్కో పంచాయతీకి రూ. పదేసి లక్షలు మంజూరు చేశారు. ఆ తరువాత అధికారంలోకి వచ్చిన వైసీపీ శ్మశానాల బాగోగులపై దృష్టి పెట్టలేదు. కనీసం స్థలాలు కేటాయించలేదు. అయితే రెవెన్యూ రికార్డులలో మాత్రం భూములు ఇచ్చినట్లు నమోదు చేశారు. మండల కేంద్రమైన మనుబోలులోని కోదండరామపురంలో శ్మశానం సరిగాలేదు. దీంతో ఉన్న స్థలంలోనే శవాలు పూడ్చి, దానిపైనే కర్మక్రతువులు చేసే పరిస్థితి. ఇక జట్లకొండూరు పంచాయతీలో చెరువుకట్ట కింద ఆరడుగుల స్థలంలో దహన కార్యక్రమాలు చేస్తుంటారు. గురివిందపూడి, బద్దెవోలు, కొండూరు సత్రం గ్రామాల్లోనూ ఇదే పరిస్థితి.



శవాలు పూడ్చాలంటే గగనమే..

వెంకటాచలం : సర్వేపల్లి పంచాయతీ పరిధిలోని యాదవ, కుమ్మరి, మంగలి, చాకలి తదితర బీసీ కులస్థులు, ఓసీలైన బలిజ కులస్థులు ఎవరైనా చనిపోతే వారిని కొత్తగుంట శ్మశాన వాటికలో ఖననం చేస్తారు. కానీ వర్షాకాలంలో మాత్రం శవాన్ని మోకాలిలోతు నీళ్లలో మోసుకుంటూ ఎక్కడ గట్టు కనిపిస్తే అక్కడ పూడ్చుకునే పరిస్థితి. అలాగే సర్వేపల్లి పంచాయతీ పరిధిలోని లింగంగుంట గిరిజనులకు శ్మశాన స్థలం లేక చెరువు కట్ట కిందే ఖననం చేసుకుంటున్నారు.



వాగు దాటితేనే..!

సీతారామపురం : మండల కేంద్రమైన సీతారామపురంలోని ముస్లింలు, హిందువులు అంతిమయాత్ర సమయంలో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. గొట్లదిన్నె ప్రాంతంలో ఉన్న ముస్లింల శ్మశాన వాటికకు దారి లేకపోవడంతో మృతదేహాన్ని ఖననం చేయాలంటే వాగు దాటాల్సిన పరిస్థితి ఏర్పడుతోంది. అలాగే పడమటి వీధిలోని హిందువుల శ్మశాన వాటిక వాగు సమీపంలో ఉంది. వర్షాకాలంలో వాగులోకి నీరొచ్చి సమాధులతో సహా కొట్టుకుపోతున్నాయి. ఈ సమస్యను పలుమార్లు ప్రజాప్రతినిధులు, అధికారుల దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకునే నాధులే కరువయ్యారని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

వర్షాలు రానున్నాయ్.. అప్రమత్తంగా ఉండండి!

● అధికారులకు జేసీ కార్తీక్ ఆదేశం
● 1077, 7995576699 నెంబర్లతో కంట్రోల్‌రూం

నెల్లూరు (హరనాథపురం), ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి) : భారీవర్షాల హెచ్చరికల నేపథ్యంలో ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అధికారులు అప్రమత్తంగా ఉండాలని జాయింట్ కలెక్టర్ కార్తీక్ ఆదేశించారు. గురువారం కలెక్టరేట్ శంకరన్ హాలులో ప్రకృతి వైపరీత్య కమిటీ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా జేసీ మాట్లాడుతూ మోస్తరు నుంచి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని అమరావతి వాతావరణ కేంద్రం హెచ్చరికలు జారీ చేసిందని తెలిపారు. గతంలో ఏ ప్రాంతాలు ముంపునకు గురయ్యాయో ఆ ప్రాంతాలపై దృష్టి పెట్టాలన్నారు. దెబ్బతిన్న విద్యుత్ స్తంభాలకు వెంటనే మరమ్మతు చేయించాలని, గ్రామాలలో తాగునీటి ఇబ్బందులు లేకుండా చూడాలని పేర్కొన్నారు. 1077, 7995576699, 0861-2331261 నెంబర్లతో కాల్ సెంటర్ ఏర్పాటు చేశామని, వర్షాల కారణంగా ఇబ్బందులు తలెత్తినప్పుడు ఈ నెంబర్లకు ఫోన్ చేయాలని కోరారు.

● **సీఎం వీడియోకాన్ఫరెన్స్**



కమిటీ సమావేశంలో మాట్లాడుతున్న జేసీ కార్తీక్

జిల్లాలో రైతులకు ఎలాంటి ఇబ్బంది లేకుండా సాగునీటి వ్యవస్థను సమర్థవంతంగా నిర్వహించాలని కలెక్టర్, ఇంజనీరింగ్ అధికారులను సీఎం చంద్రబాబు ఆదేశించారు. గురువారం అమరావతి నుంచి సీఎం వీడియోకాన్ఫరెన్స్ ద్వారా కలెక్టర్లకు, ఇంజనీరింగ్ అధికారులకు పలు సూచనలు చేశారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో కలెక్టరేట్ నుంచి కలెక్టర్ ఆనంద్ తదితరులు పాల్గొన్నారు. జిల్లాలో కాలువల్లో పూడికతీత పనులు, చెక్‌డ్యామ్‌లు, చెరువుల మరమ్మతు పనులు తదితరాలను చేపట్టాలని ముఖ్యమంత్రి ఆదేశించారు.



ముందస్తు సంబరం

శ్రీకృష్ణుడి వేషధారణ, గోపికల వేషధారణలో చిన్నారులు మురిపించారు. శనివారం కృష్ణాష్టమి సందర్భంగా జిల్లావ్యాప్తంగా అన్ని విద్యాసంస్థల్లో గురువారం ముందస్తు పండుగ సంబరాలు జరిగాయి. తలపై కిరీటం, చేతిలో పిల్లనగ్రోవి, మెడలో హారాలు, పంచెకట్టుతో బాలలు ఆకట్టుకున్నారు. అదేస్థాయిలో బాలికలు కూడా గోపికల వేషధారణలో మురిపించారు.

'అన్నదాత సుఖీభవ'కు మరో అవకాశం

నెల్లూరు (వ్యవసాయం, ఆంధ్రజ్యోతి) : అన్నదాత సుఖీభవ పథకం మొదటి విడతలో లబ్ధి పొందని రైతుల నుంచి దరఖాస్తులను స్వీకరిస్తున్నట్లు జిల్లా వ్యవసాయాధికారి (డీఏఓ) పి.సత్యవాణి ఒక ప్రకటనలో తెలిపారు. అర్హత ఉండి లబ్ధి పొందని రైతులు ఈ నెల 20వ తేదీలోగా రైతు సేవా కేంద్రాల్లో సంప్రదించాలని పేర్కొన్నారు. అక్కడ అర్హతను నిర్ధారించే పత్రాలు, గుర్తింపు కార్డు, భూమికి సంబంధించిన పత్రాలు, ఆధార్, బ్యాంకు ఖాతా తదితర పత్రాలను అందజేయాలని తెలిపారు. ఎన్‌పీసీఐ లింకు కానివి, మ్యాప్ కానివి బ్యాంకుల్లో సరిచేసుకోవాలని సూచించారు. రైతులు వారికి సంబంధించిన ఆధార్‌కు భూమి లింక్ కాని వారు, మరొకరి ఆధార్ లింక్ అయిన వారు, చనిపోయిన రైతుల వారసులు మ్యుటేషన్‌కు అధికారులను సంప్రదించి సరిచేసుకోవాలని తెలిపారు.

చికెన్ ధరలు

నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్

	కిలో (రూ.లలో)
బాయిలర్ లైవ్	118
స్కిన్ చికెన్	216
స్కిన్‌లెస్	240
కోడిగుడ్ల ధర (100):	520

292 పొగాకు బేళ్ల తిరస్కరణ

కలిగిరి, ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి): స్థానిక పొగాకు వేలం కేంద్రానికి గురువారం రైతు లు మొత్తం 512 పొగాకు బే ళ్లు అమ్మకానికి తీసుకొచ్చారు. వేలంలో ఎనిమిది కంపెనీల ప్రతినిధులు పాల్గొని 220 బేళ్లు కొనుగోలు చేశారు. నోసేల్-11, నోబిడ్-261, సీఆర్-8, జంపింగ్‌లాట్స్-12 కారణాలతో 292బేళ్లు తిరస్కరణకు గురయ్యాయి. కిలో పొగాకు గరిష్ఠ ధర రూ.280, కనిష్ఠ ధర రూ.140, సగటు ధర రూ.185.33గా నమోదైనట్లు వేలం నిర్వహణాధికారి శివకుమార్ తెలిపారు.

వెరికోస్ వీన్స్ వ్యాధిపై అవగాహన

కావలి(టౌన్) ఆగస్టు14 (ఆంధ్రజ్యోతి): వెరికోస్ వీన్స్‌కు అధునిక చికిత్స అందు బాటులో ఉందని నెల్లూరు మెడికవర్ ఆసుపత్రికి చెందిన వెరికోస్ వీన్స్ వైద్యనిపు ణుడు డాక్టర్ వై సుదర్శన్‌రెడ్డి పేర్కొన్నారు. గురువారం కోఆపరేటివ్ కాలనీలోని శ్రీచైతన్య డిగ్రీ కళాశాలలో దిఫూర్ పీపుల్స్ ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో వెరికోస్ వీన్స్ వ్యాధిపై అవగాహన, ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. కార్యక్రమంలో కళాశాల డైరెక్టర్ జానికిరామ్, ఆర్గనైజేషన్ అధ్యక్షుడు చేవూరి చిన్న తదితరులు పాల్గొన్నారు.

ఇష్టానుసారంగా జాతీయ రహదారి పనులు

● వాహనదారుల అవస్థలు


కలిగిరిలో ప్రమాదకరంగా టిప్పర్ల ప్రయాణం


రహదారిపై చెల్లాచెదురుగా పడిఉన్న కంకర

కలిగిరి, ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి): కావలి నుంచి దుత్తలూరు వరకు జరుగుతున్న జాతీ య రహదారిపనులు ఒక విధానం లేకుండా ఇష్టానుసారంగా చేస్తుండడంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. ముఖ్యంగా కలిగిరి-కావలి, కలిగిరి-వింజమూరు మార్గాల్లో కలిగిరి శివారు ప్రాంతాల్లో రహదారి పనులు నెలలతరబడి నత్తనడకన సాగుతున్నాయి. జనసంచారం లేని ప్రాంతాల వద్ద యుద్ధప్రాతిపదికన రహదారి పనులు పూర్తికాగా పట్టణ ప్రాంతాల వద్ద పనులు మందకొడిగా సాగుతున్నాయి. ముఖ్యంగా కలిగిరి పట్టణంలో తహసీల్దారు కార్యాలయం నుంచి కెనరాబ్యాంక్, బ్యాంక్ ఆఫ్ బరోడా శాఖల వరకు కేవలం అరకిలో మీటరు పనులు ఆరు నెలల నుంచి సాగుతున్నాయి. పనులు జరుగుతున్న ప్రాంతంలో కంకర రోడ్డుపై చెల్లాచెదురుగా పడి ప్రమాదకరంగా ఉన్నా పట్టించుకున్న దాఖలాలే లేవు. ఈ ప్రదేశం వివిధ పనులపై కార్యాలయాలకు, ప్రయాణాలు చేసేవారితో రద్దీగా ఉంటుంది. పాదచారులు, ద్విచక్ర వాహనదారులు ఈ ప్రదేశంలో భయపడుతూ వెళ్ళాల్సి వస్తోందని, టిప్పర్లు అతివేగంతో ప్రయాణించడం వలన తరుచూ ప్రమాదాలు జరుగుతున్నా పట్టించుకునే వారే లేరని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తు న్నారు. ఈక్రమంలో గురువారం కెనరాబ్యాంకు ఆవరణలో పార్క్ చేసిన మేనేజరు కారు, వేగంగావెళ్తున్న టిప్పర్ దాటికి రోడ్డుపై పడిఉన్న కంకరరాళ్ళు కారు అద్దంపై పడి పగిలిపో యింది. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి జాతీ య రహదారి పనులు త్వరగా పూర్తిచేసి ప్రమాదాలు నివారిం చాలని ప్రజలు, వాహనదారులు కోరుతున్నారు.



రహదారిపైఉన్న కంకర తగిలి పగిలిన కారు అద్దం

కావలి(టౌన్), ఆగస్టు14 (ఆంధ్రజ్యోతి): జై జవాన్.. జై కిసాన్ అంటూ ఎన్సీసీ విద్యార్థులు తిరంగా జెండాలు చేతపట్టి గురువారం నిర్వహించిన ర్యాలీ పట్టణ ప్రజలను ఆకట్టుకుంది. పాతూరు మున్సిపల్ ఉన్నత పాఠశాల ఎన్సీసీ అధికారి మస్తాన్‌వలి పర్యవేక్షణలో జరిగిన ర్యాలీని ముందుగా పాఠశాల వద్ద ప్రధానోపాధ్యాయిని సుజాత ర్యాలీ ప్రారంభించారు. ఆమె మాట్లాడుతూ విద్యార్థులు చిన్నతనం నుంచే దేశభక్తి పెంపొందించుకోవాలన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు దయాలత, శ్రీదేవి, లక్ష్మీపావని, రోహిణి, ఎన్సీసీ కేడెట్లు తదితరులు పాల్గొన్నారు.

● కొండాపురం, ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో గురువారం హర్ ఘర్ తిరంగా ర్యాలీ ఘనంగా నిర్వహించారు. మండల బీజేపీ అధ్యక్షుడు మాలేపాటి మల్లికార్జున ఆధ్వర్యంలో స్థానిక ఆదర్శ పాఠశాల నుంచి బస్టాండు కూడలి వరకు ర్యాలీ నిర్వహించి మానవహారం ఏర్పాటుచేశారు. జాతీయ జెండా ప్రాముఖ్యతను ఆదర్శ పాఠశాల ప్రిన్సిపాల్ ఖాదర్‌బాష విద్యార్థులకు వివరించారు. ఈ కార్యక్రమంలో బీజేవైఎమ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఓరుగంటి మాధవరావు, ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.


త్రివర్ణ పతాకాలు చేతపట్టి ర్యాలీ నిర్వహిస్తున్న ఎన్సీసీ విద్యార్థులు

ఘనంగా హర్ ఘర్ తిరంగా ర్యాలీ

యుద్ధప్రాతిపదికన విద్యుత్ సరఫరా

బిట్రగుంట, ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి): బోగోలు మండలం చెంచులక్ష్మీపురంలో బుధవారం విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ పేలిన విషయం తెలుసుకున్న మండల విద్యుత్ ఏఈ జడరాయ వెంటనే స్పందించి గ్రామంలో యుద్ధప్రాతిపదకన విద్యుత్ సరఫరా చేయించారు. విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ పేలిన విషయం ఆంధ్రజ్యోతికి తెలిసిన వెంటనే అధికారులను అప్రమత్తం చేయడం జరి గింది. ప్రజలు ఇబ్బందులు పడకుండా యుద్ధప్రాతిపదికన ఏఈ సిబ్బందితో రాత్రి 10గంటు లోపు విద్యుత్ సరఫరా అందచే శారు. అందుకు స్థానికులు ఏఈ, సిబ్బందితో పాటు ఆంధ్రజ్యోతికి కృతజ్ఞతలు తెలియచేశారు.

రాష్ట్ర వాలీబాల్ పోటీలకు చాకిచర్ల విద్యార్థులు

ఉలవపాడు, ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి) : స్కూల్ గేమ్స్ అండర్-15 వాలీబాల్ రాష్ట్రస్థాయి పోటీలకు చాకి చర్ల గ్రామం జడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులు బీ. రాజేష్, వీ. మహేష్‌లు ఎంపికైనట్లు ప్రధానోపాధ్యా యుడు కే జనార్దన్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రకాశం జిల్లా త్రోవగుంట జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలలో బుధవారం జరిగిన జిలాస్థాయి వాలీబాల్ పోటీల్లో ఆరుగురు విద్యార్థులు ప్రతిభ కనబరచగా, అందులో ఇద్దరు చాకిచర్ల ఉన్నత పాఠశాల విద్యార్థులు ఉండడం విశేషమన్నారు. ఈనెల 18న వీరు విజయవాడలో జరిగే రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొంటారని వ్యాయామ ఉపా ద్యాయుడు ఓగుబోయిన శ్రీనివాసులు పేర్కొన్నారు. ఉపాధ్యాయులు, గ్రామపె ద్దలు, తల్లిదండ్రుల కమిటీ చైర్మన్ సుధాకర్ విద్యార్థులను అభినందించారు.


రాష్ట్రస్థాయి వాలీబాల్ పోటీలకు ఎంపికైన రాజేష్, మహేష్

ట్రాక్టర్ల ర్యాలీకి తరలివెళ్లిన రైతులు

గుడ్లూరు, ఆగస్టు 14 (ఆంధ్ర జ్యోతి) : 'అన్నదాత సుఖీభవ - పీఎం కిసాన్' పథకాల ద్వారా రైతులకు తొలివిడత పెట్టుబడి సాయం అందిన సందర్భంగా కందుకూరులో తెలుగుదేశం పార్టీ ఆధ్వర్యంలో నిర్వహించిన భారీ ట్రాక్టర్ ర్యాలీ, బహిరంగ సభకు గుడ్లూరు మండలం నుంచి గురువారం అధికసంఖ్యలో రైతులు తరలివెళ్లారు. తెలుగుదేశం పార్టీ మండలాధ్యక్షుడు జనిగర్ల నాగరాజు టీడీపీ జెండా ఊపి ర్యాలీని ప్రాంభించారు. రైతన్నల కష్టాలను గుర్తించిన కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పెట్టుబడి సాయం అందించడం శుభపరిణామమని నాయకులు పేర్కొన్నారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు చిత్తారి మల్లికార్జున, పువ్వాడి వేణుగోపాల్, రావూరి వేణు, గుడ్లూరు గ్రామ పార్టీ అధ్యక్షుడు ఉన్నం వెంకటేశ్వర్లు, మేకపోతుల రాఘవయ్య, అక్కెలగుంట ప్రకాశం, పఠాన్ మస్తాన్ తదితరులు పాల్గొన్నారు.


ట్రాక్టర్లతో కందుకూరుకు తరలి వెలుతున్న గుడ్లూరు రైతన్నలు

పులివెందులలో టీడీపీ గెలుపు ప్రజావిజయం

నెల్లూరు (వైద్యం)/సిటీ, ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి) : పులివెందుల జడ్పీటీసీ ఉప ఎన్నికల్లో టీడీపీకి చారిత్రాత్మక విజయం నమోదయిందని ఎమ్మెల్సీ బీద రవిచంద్ర గురువారం ఒక ప్రకటనలో హర్షం వ్యక్తం చేశారు. జడ్పీటీసీగా ఎన్నికయిన మారెడ్డి లతారెడ్డికి శుభా కాంక్షలు తెలియచేశారు. కాగా పులివెందులలో గత 30 ఏళ్ల తరువాత అక్కడ ఓటర్లు స్వే చ్ఛగా తమ హక్కును వినియోగించుకున్నారని రాష్ట్ర పురపాలక శాఖ మంత్రి పొంగూరు నారాయణ ఓ ప్రక టనలో తెలిపారు. అక్కడ వైసీపీ అభ్య ర్థికి డిపాజిట్లు కూడా రాకపోవడాన్ని జగన్ గుర్తించి తన అహంకారాన్ని తగ్గించుకోవాలని నారాయణ పేర్కొన్నారు.

నేడు శ్రావణ శుక్రవారం వేడుకలు

నెల్లూరు (సాంస్కృతికం) ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి): జిల్లా వ్యాప్తంగా అమ్మవా రి ఆలయాల్లో శ్రావణ శుక్రవారం వేడుకలకు ఏర్పాట్లు చేశారు. ఈ సందర్భంగా నగరంలోని రాజరాజేశ్వరి ఆలయంలో ఉదయం లక్ష కుంకుమార్చన, సాయంత్రం పూలంగిసేవ, పల్లకీసేవ నిర్వహించనున్నట్లు ఆలయ సహాయ కమిషనర్ కోవూరు జనార్దన్‌రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు.

● ఇరుగాళమ్మ ఆలయంలో ఉదయం 6గంటలకు మూలవర్లుకు అభిషేకాలు, 8గంటలకు స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా జెండా వందనం ఉంటుందని ఈవో వీ.గిరికృష్ణ ఒక ప్రకటనలో తెలిపారు. 9గంటలకు వాసన్ కేర్ ఆసుపత్రి ఆ ధ్వర్యంలో ఉచిత కంటివైద్య శిబిరం నిర్వహిస్తామని, సాయంత్రం 4గంటలకు గ ణపతి, శ్రీరుద్ర, మహాలక్ష్మీ హోమాలు, ఉత్సవమూర్తులకు తిరుమంజనం సేవ, రాత్రి పుష్పయాగం నిర్వహిస్తామన్నారు.

● కన్యకా పరమేశ్వరి ఆలయంలో ఉదయం సామూహిక కుంకుమ పూజ, సాయంత్రం పూలంగిసేవ, రాత్రి పసుపు కుంకుమల పంపిణీ ఉంటుందని ఆలయ కార్యనిర్వాహక అధ్యక్షుడు షేగు షణ్ముఖరావు తెలిపారు.

నేడు వరలక్ష్మీ వ్రతం : నగరంలోని తల్పగిరి రంగనాథస్వామి ఆలయంలో శుక్రవారం ఉదయం 10గంటలకు వరలక్ష్మీ వ్రతం నిర్వహిస్తున్నట్లు ఈవో ఆళ్ల శ్రీనివాసరెడ్డి తెలిపారు.

పేదల పెళ్లిళ్లకు మాలేపాటి కుటుంబం పెద్దదిక్కు


దగదర్తి (బిట్రగుంట) ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి): దగదర్తి మండలంలోని పేదల ఇంట పెళ్లిలకు మాలేపాటి కుటుంబం పెద్దదిక్కుగా నిలిచి మంగళసూత్రం అందచేయడం ఆనవాయితీ అని మాజీ జడ్పీటీసీ మాలేపాటి పద్మావతి అన్నారు. దగదర్తి మండలం తురిమెల్ల పంచాయతీ లక్ష్మీనారాయణపురానికి చెందిన గంగపట్ల అంజయ్య, ఇందుల కుమారుడు అవినాష్ వివాహానికి గురువారం మంగళసూత్రం అందచేసి ఆమె ఆశీర్వదించారు.

ఫ్లోరోసిస్ నివారణకు చర్యలు తీసుకోవాలి

● జిల్లా ఫ్లోరోసిస్ కన్సల్టెంట్ దివ్య

లింగసముద్రం, ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి) : ఫ్లోరోసిస్ నివారణకు అన్ని విధాలా చర్యలు తీసుకోవాలని జిల్లా ఫ్లోరోసిస్ కన్సల్టెంటు డా. దివ్య పేర్కొన్నారు. లింగసముద్రం మండల ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో గురువారం ఉదయం సీహెచ్‌ఓ శ్రీనివాసులు అధ్యక్షతన ఆరోగ్య సిబ్బంది, ఆశా వర్కర్లకు ఫ్లోరోసిస్ వ్యాధిపై అవగాహన కల్పించారు. ఫ్లోరైడ్ అధికంగా ఉన్న భూగర్భ జలాలు, టీ కషాయం, బ్లాక్ సాల్ట్, సుపారీ, సోడియం ఫ్లోరైడ్ బిళ్లలు, గనుల తవ్వకం, బొగ్గును కాల్చడం వల్ల ఫ్లోరోసిస్ వస్తుందన్నారు. ఈ వ్యాధి ఎక్కువగా పిల్లలు, పెద్దలు, గర్భిణీలు, పాలిచ్చే తల్లులు, గుండె, కిడ్నీ సంబంధిత జబ్బులు ఉన్న రోగులకు వస్తుందన్నారు. రక్షిత తాగునీరు, పాలు, పెరుగు, జున్ను, బెల్లం, పచ్చటి ఆకు కూరలు, జీలకర్ర, మునగకాయలు, పప్పుధాన్యాలు, చిరుధాన్యాలు, జామ, నిమ్మ, ఉసిరి, నారింజ, టమోటా మొదలైనవాటిలో ఫ్లోరోసిస్ నుంచి రక్షించే ఔషధ గుణాలు ఉంటాయన్నారు. ఫ్లోరైడ్ శాతం అధికంగా ఉన్న నీరు, ఆహారంతో పాటు పొగాకు సేవించడం వల్ల ఈ వ్యాధి బారిన పడే ప్రమాదం ఉందన్నారు. ఈ కార్యక్రమంలో ఎల్‌టీ అనిత, ఎంఎల్‌హెచ్‌పీలు, ఏఎన్ఎంలు, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.


అవగాహన కల్పిస్తున్న జిల్లా ఫ్లోరోసిస్ కన్సల్టెంట్ డా.దివ్య


వలేటివారిపాలెంలో విద్యార్థులను పరీక్షిస్తున్న డాక్టర్ దివ్య

ఫ్లోరోసిస్ వ్యాధి పై అవగాహన

వలేటివారిపాలెం: వలేటివారిపాలెం ప్రాథమిక ఆరోగ్య కేద్రంలో ఫ్లోరోసిస్ వ్యాధి లక్షణాలపై గురువారం జిల్లా నేషనల్ ఫ్లోరోసిస్ సర్వేలెన్స్ అధికారిణి డాక్టర్ దివ్య అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు పరీక్షలు నిర్వహించారు. అనంతరం స్థానిక వైద్యాధికారి శివశిద్దప్ప అధ్యక్షతన అవగాహన సదస్సు నిర్వహించారు. డాక్టర్ దివ్య మాట్లాడుతూ ఫ్లోరోసిస్ సోకితే పిల్లలకు దంతాలు పచ్చగా మారడం, కాళ్లు వంకర్లు పోవడం తదితర లక్షణాలు కనిపిస్తాయన్నారు. అలాంటి పిల్లలకు చికిత్స చేసే విధానంపై అవగాహన కల్పించారు. అనంతరం పోకూరు, బడేవారి పాలెం పాఠశాలల్లో విద్యార్థుల దంతాలు, కాళ్లు చేతులను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో వైద్యాధికారి శివశిద్దప్ప, సీహెచ్‌ఓ శివరామయ్య, ఎంఎల్‌హెచ్‌పీలు, ఏఎన్ఎమ్‌లు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

మున్సిపల్ కార్యాలయంలో జెండా దిమ్మె ఏర్పాటు

కావలి, ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి): కావలి మున్సిపల్ కార్యాలయంలో జాతీయ జెండా ఆవిష్కరణ కోసం దిమ్మెను ఏర్పాటు చేశారు. గతంలో స్వాతంత్ర్య దినోత్సవం, రిపబ్లిక్‌డే రోజు న జాతీయజెండా ఆవిష్కరించాలంటే మున్సి పల్ కార్యాలయం పైన రెండో అంతస్తు పైభా గాన గోడకు ఒక జెండా కర్రను ఏర్పాటుచేసి దానికి జాతీయ జెండా కట్టి ఆవిష్కరించేవారు. దీంతో మున్సిపల్ కార్యాలయంలో జెండా వం దనం కార్యక్రమం అంటే పాల్గొనేందుకు ప్రజ లు వెనుకాడేవారు. దీనిని గుర్తించిన మున్సిపల్ అధికారులు జాతీయ జెండా ఆవిష్కరణ కార్య క్రమం కిందనే జరిపితే అందరికీ అనుకూలంగా ఉంటుందని భావించి కార్యాలయం ముందు భాగాన జాతీయ జెండా దిమ్మెను నూతనంగా ఏర్పాటు చేశారు. దీంతో శుక్రవారం స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలకు నూతన దిమ్మె వద్ద జెండా ఆవిష్కరణ జరిపేందుకు సిద్ధమయ్యారు.


మున్సిపల్ కార్యాలయంలో నూతనంగా ఏర్పాటు చేసిన జెండా దిమ్మె

స్వాతంత్ర్య వేడుకలకు రంగం సిద్ధం

అల్లూరు: మండలంలో స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలకు ఏర్పాట్లు పూర్తిచేశారు. తహసీల్దారు, ఎంపీడీఓ, సబ్ రిజిస్ట్రారు, కమిషనర్ కార్యాలయాలతోపాటు పోలీసు స్టేషన్, సచివాలయాలు, పాఠశాలలు, ప్రభుత్వ రంగ కార్యాలయాల్లో మువ్వన్నెల జెండా రెపరెపలాడనుంది. ఉదయం 8 గంటలకే జెండాను ఎగురవేసేందుకు అధికారులు రంగం సిద్ధం చేశారు.


బ్రాహ్మణుల అభ్యున్నతి టీడీపీతోనే : గంగు

కావలి(టౌన్), ఆగస్టు 14 (ఆంధ్ర జ్యోతి): బ్రాహ్మణుల అభ్యున్నతి టీడీపీతోనే సాధ్యమని టీడీపీ నాయ కుడు, బ్రాహ్మణ సంఘం ఉపాధ్యక్షుడు గంగు వెంకటచంద్రశేఖర్ పేర్కొన్నారు. గురువారం పాతూరులోని శివాలయం వద్ద ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో మాట్లాడుతూ ఆంధ్రరాష్ట్ర తొలి ముఖ్యమంత్రి బ్రాహ్మణ కులానికి చెందిన టంగుటూరి ప్రకాశం పంతులు విగ్రహం కావలిలో ప్రతిష్ఠించేలా బ్రాహ్మణ సంఘం పెద్దలందరూ కలిసి ఎమ్మెల్యే కృష్ణారెడ్డిని కోరనున్నామన్నారు. బ్రాహ్మణుల సంక్షేమానికి పెద్ద పీట వేసింది చంద్రబాబు నాయుడేనన్నారు. విజయవాడ గొల్లపూడిలో బ్రాహ్మణ కార్పొరేషన్ కార్యాలయంలో అన్ని రకాల సదుపాయాలు, భోజన సదుపాయం ఉందని, పనుల నిమిత్తం విజయవాడ వెళ్ళే బ్రాహ్మణులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

తైక్వోండో శిక్షణతో శత్రువుల నుంచి రక్షణ


తైక్వోండో విద్యార్థులకు బెల్ట్స్ అందచేస్తున్న ఎస్ఎస్ యాదవ్

బిట్రగుంట, ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి): తైక్వోండో మార్షల్ ఆర్ట్ నేర్చుకోవడం వలన తనకుతానుగా శత్రువుల నుంచి రక్షించుకోవచ్చని వాకర్స్ మాజీ అధ్యక్షుడు ఎస్ఎస్ యాదవ్ అన్నారు. బిట్రగుంట రైల్వే ఫుట్‌బాల్ క్రీడామైదానంలో గురువారం ఇంటర్ నేషనల్ మాస్టర్ ఈ రవిగస్ తైక్వోండో విద్యార్థులకు పరీక్ష నిర్వహించారు. విద్యార్థులకు స్వాతంత్ర్య దినోత్సవం పురస్కరించుకుని బెల్ట్స్ అందచేస్తున్నట్లు ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో బిట్రగుంట వాకర్స్ అధ్యక్షులు బీ బర్నాడ్, వాకర్స్ సభ్యులు స్వర్ణన్‌రాజు, పీ జీవన్‌కుమార్, తదితరులు పాల్గొన్నారు.


పాతూరులో పంట కాలువ వద్ద ప్రమాదకరంగా ఉన్న కల్వర్టుపై రంధ్రం

కల్వర్టుపై రంధ్రం

● పొంచి ఉన్న ప్రమాదం

కావలి, ఆగస్టు14 (ఆంధ్రజ్యోతి): కావలి పట్టణం పాతూరులోని అక్కమ్మబావి సెంటర్ సమీపంలో పంటకాలువ వద్ద నాలుగు రోడ్ల కూడలిలో కల్వర్ట్‌ను పగుల కొట్టడంతో అక్కడ పెద్ద రంధ్రం పడి ప్రమాదం పొంచి ఉంది. ఆ కల్వర్ట్ కింద ఉన్న మంచినీటి పైపులైన్ లీకేజీ అవుతుండటంతో దాని మరమ్మతుల కోసం కల్వర్ట్‌ను మధ్యలో పగులకొట్టారు. ఈప్రాంతంలో ప్రజలు, వాహనాల రాకపోకలు నిత్యం రద్దీగా ఉంటాయి. దీంతో రాత్రి పూట ప్రమాదాలు జరిగే అవకాశాలు ఉన్నాయి. అధికారులు స్పందించి రంధ్రాన్ని త్వరగా పూడ్చి ప్రమాదాలు నివారించాలని ప్రజలు కోరుతున్నారు.

బైక్ చోరీపై కేసు నమోదు

నెల్లూరు (క్రైం) ఆగస్టు 14(ఆంధ్రజ్యోతి): బైక్ చోరీపై వేదాయపాలెం పోలీసులు కేసు నమోదు చేశారు. తిరుపతి జిల్లా ఏర్పేడు మండలం సదాశివపురానికి చెందిన పీ. మునిశంకర్ ఈ నెల 9న నెల్లూరుకి వచ్చారు. హెచ్ఆర్ కల్యాణమండపం సమీపంలోని హోటల్ వద్ద పార్క్ చేసిన బైక్ కనిపించలేదు. దీంతో బాధితుడు వేదాయపాలెం పోలీసులకు గురువారం ఫిర్యాదు చేశాడు.

సరిలేరు.. సరితకెవ్వరు!



ఆ యువతిది చిన్న పల్లెటూరు. పాడిపంటలే ఆమె తల్లిదండ్రులకు జీవనాధారం. అలాంటి కుటుంబానికి చెందిన సరిత చిన్ననాటి నుంచి తల్లిదండ్రులకు పొలం పనుల్లో చేదోడుగా ఉండటమే కాదు. చదువులోనూ రాణించేది. క్రీడల్లో మేటిగా నిలిచి బంగారు పతకాలు సాధించి నేటి యువతకు రోల్ మోడల్‌గా నిలిచింది.

- కలిగిరి, (ఆంధ్రజ్యోతి)

కరాటేలో బంగారు పతకాలు

రైతు ఇంట మెరిసిన క్రీడాకుసుమం

కలిగిరి మండలం వీరనకొల్లు పంచాయతీలోని చిన్న కుగ్రామమైన బసిరెడ్డిపాలెంలో బోరెడ్డి సుబ్బారెడ్డి, రమణమ్మ దంపతులకు ఇద్దరు కుమార్తెలు. మొదటి కుమార్తె సంధ్య, సాఫ్ట్‌వేర్ చదువుతో ఉద్యోగం సంపాదించి వివాహం చేసుకొని అత్తారింటికి వెళ్లింది. రెండవ కుమార్తె సరిత. ఆ దంపతులు తమకు కుమారులు లేకపోయినా చిన్న కుమార్తె సరితలో కొడుకును చూసి మచ్చటపడేవారు. దీనికితోడు అమ్మమ్మ సంతతిలో ఎక్కువమంది పోలీస్ విభాగం లో ఉండటంతో సరిత కూడా వారిలా పోలీస్ కావాలని, ఫైటింగ్ చేయాలని చిన్నతనం నుంచే బలమైన కోరిక ఉండేది. 1 నుంచి 5వతరగతి వరకు స్వగ్రామంలోనే సాగింది. అనంతరం ఏపీ మోడల్‌లో స్కూల్లో 6వ తరగతిలో చేరిన తరువాత సరిత రోల్ పూర్తిగా మారిపోయింది. 8వ తరగతి చదివే సమయంలో స్థానికంగా ఉన్న



సినీనటుడు సుమన్ చేతుల మీదుగా బంగారు పతకం అందుకుంటున్న సరిత

కరాటే మాస్టర్ సుమన్ శ్రీనివాస్ కలిగిరిలో కరాటే డెమో క్లాసులు ఇవ్వడంతో తానూ కరాటే క్లాసులకు వెళతానని తల్లిని కోరగా సరితలోని పట్టుదల గమనించి ప్రోత్సహించింది. దీంతో నాటి నుండి కఠోర దీక్షతో కరాటే నేర్చుకోవడంతోపాటు స్థానికంగా, జిల్లా, రాష్ట్రస్థాయి పోటీల్లో ప్రతిభ కనబరుస్తూ జాతీయస్థాయిలో బంగారు పతకాలు సాధించే స్థాయికి చేరుకుంది.

ప్రతిభ PRATIBHA

● మొదటిసారి..

హైస్కూల్‌స్థాయిలో మొదటిసారి కావలి సమీపంలోని తుమ్మలపెంట వద్ద జరిగిన కరాటే పోటీల్లో బంగారు పతకం సాధించింది. ఇంటర్ మొదటి సంవత్సరం చదివే సమయంలో బ్లాక్‌బెల్ట్ సాధించింది. ఇంటర్ ద్వితీయ సంవత్సరం చదివేటపుడు గోవాలో జరిగిన నేషనల్‌స్థాయి పోటీల్లో పాల్గొని మెడల్స్ సాధించింది. 2015, 2016లో వింజమూరు హైస్కూల్‌లో జరిగిన పోటీల్లో సరిత ప్రతిభను గుర్తించిన ఓ వ్యక్తి ఆమె కోరిక మేరకు ఏపీ మోడల్ స్కూల్‌లో మొత్తం 400మంది విద్యార్థులకు స్పోర్ట్స్ డ్రస్‌లు అందజేశారు. 2017లో హరిద్వార్‌లో జరిగిన పోటీల్లో రజిత పతకం సాధించింది. 2025లో తంజావూరులో జరిగిన 3వ ఇంటర్ నేషనల్ ఓపెన్ కరాటే చాంపియన్‌షిప్‌లో ప్రథమ స్థానంలో నిలిచి బంగారు పతకం సాధించింది.

● జాతీయస్థాయి పోటీలకు అవకాశం వచ్చినా...

పలుమార్లు జాతీయస్థాయిలో జరుగుతున్న పోటీల్లో పాల్గొనడానికి అవకాశం వచ్చినా ఆ సమయంలో పరీక్షల షెడ్యూలు ఉండటం వలన పాల్గొనలేకపోయింది. సరిత ఇంటర్ ద్వితీయ సంవత్సరం చదువుతున్న సమయంలోనే రుద్రమదేవి సెల్ఫ్‌డిఫెన్స్ అకాడమీలో కోచ్‌గా నియమించారు. అప్పటి నుంచి బాలికలు స్వీయరక్షణ ఎలాపొందాలి అనే అంశంపై జిల్లాలోని అన్ని కేజీబీవీ స్కూల్స్‌లో మహిళా ఉపాధ్యాయినిలతోపాటు విద్యార్థినిలకు శిక్షణ ఇచ్చింది. అదే విధంగా రాష్ట్రంలో ఎక్కడ పోటీల్లో పాల్గొనాలన్నా తన కిష్టమైన పల్సర్ బైక్‌లోనే తల్లితో కలిసి వందల కిలోమీటర్లు ప్రయాణం చేసి పోటీల్లో పాల్గొనేది.

150 అడుగుల జెండాతో ర్యాలీ

హర్ ఘర్ తిరంగాలో భాగంగా రాపూరులోని జెమ్స్ ఇంగ్లీషు మీడియం స్కూల్ విద్యార్థులు 150 అడుగుల మువ్వన్నెల జెండాతో ర్యాలీ నిర్వహించారు. కాపువీధి, సిద్ధలయ్య సెంటర్, పడమటి వీధి, పాత బస్టాండ్, బాలాజీ కాంప్లెక్స్ మీదుగా మేరా భారత్ మహాన్ నినాదాలతో ఈ ర్యాలీ సాగింది. ఈ కార్యక్రమంలో సర్కిల్ ఇన్‌స్పెక్టర్ సత్యనారాయణ, రాపూరు ఎంఈవో



శ్రీనివాసులు, జేమ్స్ అధినేత మునేంద్ర తదితరులు పాల్గొన్నారు.

- రాపూరు, (ఆంధ్రజ్యోతి)

రావి ఆకుపై త్రివర్ణ పతాకం!



స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకుని గురువారం వీరంపల్లి జడ్పీ ఉన్నత పాఠశాల 8వ తరగతి విద్యార్థిని గోనుపల్లి అలకనంద రావి ఆకులపై వేసిన జాతీయపతాకం చిత్రం అందరిలోనూ దేశభక్తిని రగిలిస్తోంది. శనివారం కృష్ణాష్టమి కావడంతో రావి ఆకుపై చిన్ని కృష్ణుడు ఉన్నట్లు నీటిరంగులతో చిత్రాలను అందంగా తీర్చిదిద్దింది. ఈ రెండింటి ద్వారా ఆ విద్యార్థిని రెండు పండుగలకు తన అద్భుతమైన చిత్రాల ద్వారా శుభాకాంక్షలు తెలిపింది. తెలుగు పండి తుడు సోమా పద్మారత్నం చిత్రాలను గీయడంలో అలకనందకు మెళకువలు నేర్పించారు. త్రివర్ణ పతాకం, శ్రీకృష్ణుని చిత్రాలు విద్యార్థుల హృదయాల్లో భక్తినీ, దేశభక్తినీ నింపుతాయని ఉపాధ్యాయులు విద్యార్థినిని అభినందించారు.

- మనుబోలు, (ఆంధ్రజ్యోతి):

సర్వీస్ హోమ్‌ల తనిఖీ

నెల్లూరు(హరనాథపురం), (ఆంధ్రజ్యోతి): ఐసీడీఎస్ పీడీ హేనాసుజన్ గురువారం జిల్లాలోని సర్వీస్ హోమ్‌లను తనిఖీ చేశారు. నగరంలోని గాంధీ నగర్‌లో ఉన్న సర్వీస్ హోమ్‌ను ప రిశీలించారు. భోజనం, సరుకుల నాణ్యత, నీటి వసతిపై అ క్కడ ఆశ్రయం పొందుతున్న వారిని అడిగి తెలుసుకున్నారు. హోమ్‌లో కూరగాయల తోటలను పరిశీలించారు. పీడీ వెంట మహిళా సంరక్షణ అధికారి టీ. అరుణ ఉన్నారు.

18న చలో కరేడు

నెల్లూరు (వైద్యం), ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి): ఈ నెల 18న చలో కరేడు కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు వామపక్ష నేతలు వెల్లడించారు. గురువారం నగరంలోని సీపీఎం జిల్లా కార్యాలయంలో సీపీఎం జిల్లా కార్యదర్శి మూలం రమేష్ మాట్లాడారు. ఉలవపాడు మండలం కరేడు గ్రామంలో ఇండోసోలార్ ఏర్పాటుకు 8400 ఎకరాలు కావాలని ప్రభుత్వం ప్రయత్నిస్తోందన్నారు. అయితే అక్కడి రైతులు తాము భూములు ఇచ్చేది లేదంటూ తెగేసి చెప్పారన్నారు. సీపీఐ జిల్లా కార్యదర్శి దామా అంకయ్య మాట్లాడుతూ బలవంతపు సేకరణపై అవసరమైతే రాష్ట్రవ్యాప్త ఉద్యమం చేపడతామని హెచ్చరించారు. అనంతరం చలో కరేడు పోస్టర్లను విడుదల చేశారు. రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు షాన్ వాజ్, సీపీఎం నేతలు చంద్ర రాజగోపాల్, మాదాల వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

17న జిల్లా క్రికెట్ జట్టు ఎంపిక

నెల్లూరు(విద్య), (ఆంధ్రజ్యోతి) : జిల్లా క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈనెల 17న నగరంలోని ఏసీ సుబ్బారెడ్డి స్పోర్ట్స్ కాంప్లెక్స్‌లోని క్రికెట్ క్రీడా ప్రాంగణంలో అండర్-23 మెన్ జిల్లా జట్టు ఎంపికలను నిర్వహిస్తున్నట్లు అసోసియేషన్ అధ్యక్ష, కార్య దర్శులు ఎస్.రాజశేఖర్ రెడ్డి, కే.శ్రీనివాసులు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎంపికలకు హాజరయ్యే క్రీడాకారులు ఆధార్, జనన ధ్రువీకరణ పత్రాలతోపాటు సొంత కిట్స్‌తో, వైట్ అండ్ వైట్ డ్రస్ కోడ్‌తో 17న ఉదయం 8 గంటలకు స్టేడియంలో హాజరు కావాలని వారు తెలిపారు.

అధునాతన వసతులు... అరకొర వైద్యం

● ఎంఆర్ఐ స్కానింగ్ మిషన్ లేక ఇక్కట్లు ● 150 ఉండాల్సి ఉండగా 100 పడకలే దిక్కు

● రోగులకు తప్పని అవస్థలు

ఆత్మకూరు, ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి): మెట్టప్రాంత ప్రజలకు మెరుగైన వైద్యసేవలు అందించాలనే లక్ష్యంతో ఆత్మకూరులో ఏర్పాటు చేసిన ప్రభుత్వ జిల్లా వైద్యశాల నిరుపేదలకు వరంగా మారింది. కార్పొరేట్ హాస్పటల్‌కు దీటుగా ఈ వైద్యశాలలో అధునాతన చికిత్సలతోపాటు అన్నీ రోగాలకు మెరుగైన వైద్యసేవలు అందించే వైద్యనిపుణులు ఉండేవారు. దాంతో వైద్యశాలకు రోగుల తాకిడి అనూహ్యంగా పెరిగింది. సగటున రోజుకు 800 మందిపైబడి రోగులు చికిత్సల నిమిత్తం వస్తున్నారు. కానీ వైద్యశాలలో 150 పడకలు ఉండాల్సి ఉండగా, 100 పడకలు మాత్రమే ఉన్నాయి. దానికితోడు గత కొంత కాలంగా డాక్టర్లు, సిబ్బంది కొరత వెంటాడుతుండటంతో రోగులకు ఇబ్బందులు తప్పడం లేదు.

● ముఖ్య విభాగాల్లో డాక్టర్లేరీ ?

ఈ వైద్యశాలలో ముఖ్య విభాగాల్లో డాక్టర్లు లేక రోగులు ఇబ్బందులు పడుతున్నారు. 6 డాక్టరు పోస్టులు ఖాళీగా ఉన్నాయి. అందులో సివిల్ అసిస్టెంట్ సర్జన్ పోస్టులు 4 , డిప్యూటీ సివిల్ అసిస్టెంట్ పోస్టులు 2 ఖాళీగా ఉన్నాయి. వాటితో పాటు సీనియర్ ఫార్మసీ ఆఫీసర్ పోస్టు ఖాళీగా ఉంది. దాంతో ఫార్మసీ విభాగంలో పని వత్తిడి అధికంగా ఉంది. గైనకాలజీ విభాగంలో ముగ్గురు డాక్టర్లు ఉండాల్సి ఉండగా ఇద్దరు మాత్రమే ఉన్నారు. హెడ్ నర్సుల పోస్టులు 3 ఖాళీగా ఉన్నాయి. ఈ వైద్యశాలలో నెలకు సరాసరిన 170 ప్రసవాలు జరగాల్సి ఉంది. కాని సరాసరిన 120 నుంచి 130 ప్రసవాలు జరుగుతున్నాయి. కష్టతరమైన కాన్పులను మాత్రం నెల్లూరు ప్రభుత్వ వైద్యశాలకు పంపిస్తున్నారు.



ఆత్మకూరు ఆసుపత్రిలో ఓపీ కోసం బారులు తీరిన రోగులు

● ఎంఆర్ఐ లేక ఇబ్బందులు

కొంత మంది రోగులకు ఎంఆర్ఐ స్కానింగ్ చేయాల్సి రావడం తప్పనిసరి అవుతుంది. అయితే ఇక్కడ ఎంఆర్ఐ స్కానింగ్ మిషన్ లేకపోవడంతో ఇబ్బందులు తప్పడం లేదు. బయట ల్యాబ్‌లో ఎంఆర్ఐ స్కానింగ్ తీయాలంటే రూ. 3000 వరకు ఖర్చు అవుతుంది. పేద ప్రజలు అంత ఖర్చు చేయలేక అవస్థలు పడుతున్నారు. లేదంటే వ్యయ ప్రయాసలకోర్చి నెల్లూరు ప్రభుత్వ జిల్లా వైద్యశాలకు వెళ్లి ఎంఆర్ఐ స్కానింగ్ తీయించుకోవాల్సి పరిస్థితి నెలకొని ఉంది.

ఎంఆర్ఐ స్కానింగ్ కూడా ఏర్పాటు చేస్తాం



ఆత్మకూరు ప్రభుత్వ వైద్యశాల కార్పొరేట్ వైద్యశాలకు దీటుగా ఉంది. త్వరలో ఎంఆర్ఐ స్కానింగ్ మిషన్ కూడా ఏర్పాటు చేస్తాం. రోగులకు మెరుగైన వైద్యసేవలు అందిస్తున్నాం. మందుల కొరత లేదు.

- డాక్టర్ కేవీ శేషారత్నం, సూపరింటెండెంట్

ఎర్రచందనం స్మగ్లర్‌కు ఏడాది జైలు



ఎర్రచందనం స్మగ్లర్‌ను జైలుకు తరలిస్తున్న ఫారెస్ట్ అధికారి చక్రపాణి

నెల్లూరు(వెంకటేశ్వరపురం) ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి) : జిల్లాకు చెందిన ఎర్రచందనం స్మగ్లర్‌కు జైలుశిక్ష విధిస్తూ తిరుపతిలోని ఎర్రచందనం ప్రత్యేక కోర్టు గురువారం తీర్పు నిచ్చింది. రాపూరు మండలం పంగిలి గ్రామానికి చెందిన కరిపం నరసింహులుపై 2013లో ఎర్రచందనం స్మగ్లింగ్ కేసు నమోదు చేశారు. అప్పటి నుంచి విచారణ జరిపిన తిరుపతి ప్రత్యేకకోర్టు నేర నిరూపణ కావడంతో ఏడాది జైలు శిక్షతో పాటు రూ.10 వేలు జరిమానా విధించింది. దీంతో స్మగ్లర్ నరసింహులును నెల్లూరు జైలుకు తరలించారు. నేర నిరూపణ చేయడంలో ఎంతగానో కృషి చేసిన రాపూరు ఫారెస్టు సెక్షన్ అధికారి చక్రపాణిని రేంజర్ అభినందించారు. ఈ సందర్భంగా రాపూరు రేంజర్ రవీంద్రబాబు మాట్లాడుతూ ఎర్రచందనం స్మగ్లింగ్‌కు ఎవరు పాల్పడినా వారికి శిక్ష తప్పదన్నారు.

పశువుల సంత వేలం రూ. 30లక్షలు

మనుబోలు, ఆగస్టు 14(ఆంధ్రజ్యోతి): స్థానిక పంచాయతీలో పశువుల సంత, కుడిచెరువులో చేపల వేలంపాటను గురువారం పంచాయతీ కార్యాలయంలో నిర్వహించారు. ముందుగా పశువుల సంత వేలం పాట నిర్వహించగా రూ. 5 వేలు ధరావత్తు చెల్లించి 8మంది వేలం పాట పాడేందుకు సిద్ధమయ్యారు. ప్రభుత్వం ఇచ్చిన మద్దతు ధర ప్రకారం రూ. 13.60 లక్షల నుంచి వేలంపాటను ప్రారంభించారు. వేలం పాట దారులు పోటీ పడడంతో గతేడాది కంటే ఈసారి రెండు రెట్లు అధికంగా వేలం పాట పలికింది. చివరికి రూ. 30 లక్షలకు కంటిపల్లి సుధాకర్ దక్కించుకున్నారు. అనంతరం ఆయనకు హక్కుపత్రాలను డిప్యూటీ ఎంపీడీవో నారాయణ అందజేశారు. కుడిచెరువులో చేపల వేలంపాట ప్రారంభించాల్సి ఉండగా మనుబోలు గిరిజనులు తమకు కుడిచెరువు ఇవ్వాలని కోరారు. ఇందుకు పంచాయతీ, ప్రభుత్వం అనుమతులు ఇవ్వ డంతో వేలంపాట లేకుండానే రూ. 78 వేల ఫీజు పంచాయతీకి కట్టించు కుని గిరిజనులకు అప్పగించారు.

షార్ట్ సర్క్యూట్‌తో ఇల్లు దగ్ధం

కొడవలూరు, ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని గండవరం గ్రామంలోని గాడికాయలు కాలనీలో విద్యుత్ షార్ట్ సర్క్యూట్ కార ణంగా గోళ్ల ప్రసాద్‌కు చెందిన ఇల్లు గురువారం దగ్ధమైంది. సమాచారం అందిన వెంటనే ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర పౌరసరఫరాల సంస్థ డైరెక్టర్ వేమిరెడ్డి పట్టాభిరామిరెడ్డి సంఘటన స్థలానికి చేరుకుని బాధితులను పరామర్శించారు. రూ.10వేలు ఆర్థిక సాయం అందించారు. ప్రభుత్వ పరంగా పక్కా ఇంటి నిర్మాణానికి కృషి చేస్తానన్నారు. ఆయన వెంట దేవస్థానం ఛైర్మన్ ఆలం మాలకొండయ్య, ఇరిగేషన్ ప్రెసిడెంట్ కంచి ఈశ్వర్ రెడ్డి ఉన్నారు.

రైతు సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం

● ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు

కందుకూరు, ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం రైతుల సంక్షేమమే ధ్యేయంగా పనిచేస్తోందని కందుకూరు ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు పేర్కొన్నారు. 'అన్నదాత సుఖీభవ, పీఎం కిసాన్' పథకాల అమలులో భాగంగా తొలివిడత పెట్టుబడి సాయాన్ని రైతుల ఖాతాల్లో జమ చేశారు. ఈ సందర్భంగా గురువారం సాయంత్రం కందుకూరులో రైతులు చంద్రబాబుకు కృతజ్ఞతలు తెలుపుతూ భారీ ర్యాలీ నిర్వహించారు. అనంతరం వ్యవసాయ మార్కెట్‌యార్డు ఆవరణలో జరిగిన బహిరంగ సభలో ప్రసంగించారు. రైతులకు ఇచ్చిన హామీ మేరకు తొలి విడతగా కేంద్రం విడుదల చేసిన రూ.2 వేలకు తోడు మరో 5వేలు కలిపి మొత్తం 7 వేలు రైతుల ఖాతాలకు జమ చేశారన్నారు. కందుకూరు నియోజకవర్గంలోని రైతులకు ఈ పథకం ద్వారా రూ. 22.29 కోట్లు వారి ఖాతాలకు జమయ్యాయన్నారు. రైతులకు ప్రోత్సా హకంగా సబ్సిడీపై యంత్రపరికరాలు, డ్రోన్లు అందజేశామన్నారు. రైతుల జీవనాడిగా ఉన్న రాళ్లపాడు ఆయకట్టులో చివరి ఎకరానికి కూడా సాగు నీరందిం చేలా చర్యలు తీసుకుంటున్నామన్నారు. ఎన్టీఆర్ విగ్రహానికి ఎమ్మెల్యే, టీడీపీ నాయకులు పూలమా లలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఇటీవల మృతిచెందిన రైతు నాయకులు ఎన్వీ సుబ్బారావు, గోగినేని శివరామయ్యలకు నివాళులర్పించారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు దామా మల్లేశ్వరరావు, పూరిమిట్ల గురునాథం, బుస్సారెడ్డి కృష్ణా రెడ్డి, జనిగర్ల నాగరాజు, మాదాల లక్ష్మీ నరసింహం, బీజేపీ నాయకుడు ఘట్టమనేని హరిబాబు, జనసేన నాయకులు గోకరాజు మదన్, కొణిదెల శ్రీను పాల్గొన్నారు.



కందుకూరులో ఎడ్లబండి నడుపుతున్న ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు, టీడీపీ నాయకులు

వ్యాధులు ప్రబలకుండా జాగ్రత్తలు తీసుకోవాలి

● జిల్లా మలేరియా నివారణ అధికారి హుస్సేనమ్మ

నెల్లూరు (వైద్యం) ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి) : డెంగ్యూ, మలేరియా, చికెన్‌గున్యా తదితర వ్యాధులు ప్రబలకుండా అధికారులు, సిబ్బంది ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని జిల్లా మలేరియా నివారణ అధికారి హుస్సేనమ్మ తెలిపారు. గురువారం జిల్లా వైద్య ఆరోగ్యశాఖ కార్యాలయంలో మలేరియా సబ్‌యూనిట్ అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గ్రామీణ, పట్టణ ప్రాంతాలలో ఆయా వ్యాధులు నమోదవుతున్నాయని, వెంటనే తగిన జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ప్రతి శుక్రవారం డ్రైడే కార్యక్రమాలు జరుగుతున్న సమయంలో ఆరోగ్య కార్యకర్తలు, ఆశాలకు తగిన సూచనలు చేయాలన్నారు. స్థానికంగా నివాసం ఉంటున్న వారి గృహాలను సందర్శించాలని, ఆయా నివాసాలలో నీటి నిల్వలు లేకుండా చూడాలన్నారు. ఆయా నీటి నిల్వల లోనే దోమల లార్వా పెరిగే అవకాశం ఉందని హెచ్చరించారు. నీటి గుంటలను గుర్తించి గంబూసియా చేపలు వదలాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో సహాయ మలేరియా అధికారి నాగార్జునరావు, సబ్‌యూనిట్ అధికారులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న మలేరియా నివారణ అధికారి హుస్సేనమ్మ

ఎక్కడ.. ఎవరికి వేశారు ?

● విద్యార్థులందరికీ నులిపురుగుల మాత్రలంటూ అధికారుల ప్రచారం

● ప్రైవేటు స్కూళ్లు, కాలేజీల్లో అమలుకాని డీవార్మింగ్

● 96.82 శాతం ఫలితాలు సాధించినట్లు కాకిలెక్కలు

● సొంతశాఖ ఉద్యోగులే విమర్శలు



ఆల్బెండజోల్ మాత్రలు మింగిస్తున్న వైద్యశాఖ డైరెక్టర్ డాక్టర్ పద్మావతి(ఫైల్)

నెల్లూరు (వైద్యం) ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి): కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రతిష్ఠాత్మకంగా చేపడుతున్న వైద్య, ఆరోగ్యకార్యక్రమాలకు అధికారులు తూట్లు పొడుస్తున్నారు. ఈనెల 12న జిల్లావ్యాప్తంగా డీవార్మింగ్ కార్యక్రమాన్ని చేపట్టారు. ఇందులో భాగంగా ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశా లలు, కళాశాలల్లోని విద్యార్థులకు నులిపురుగుల నివార ణకు ఆల్‌బెండజోల్ మాత్రలు మిగించాలని అధికారులు నిర్ణయించారు. ఇందుకోసం జిల్లాలోని ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలు, కళాశాలల్లో కలిపి 5,75,806 మంది విద్యార్థులను గుర్తించారు. అదే రోజు సాయంత్రానికి 96.82 శాతం మంది విద్యార్థులకు నులిపురుగుల నివారణ మాత్రలు మిగించినట్లు వైద్యాధికారులు ప్రకటించారు. అయితే అవన్నీ కాకిలెక్కలేనని కొందరు వైద్యులు, సిబ్బంది చెబుతున్నారు. కేవలం ప్రభుత్వ పాఠశాలలు, కళాశాలల్లోనే ఈ కార్యక్రమం నిర్వహించి చేతులు దులుపుకున్నట్లుగా ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి.

● సొంతశాఖలోనే విమర్శలు

జిల్లాలో 2,912 అంగన్‌వాడీలు, 2,594 ప్రభుత్వ పాఠశాలలు, 60 ప్రభుత్వ జూనియర్ కళాశాలలు ఉన్నాయి. ఇందులో 3,42,497 మంది విద్యార్థులు ఉన్నారు. ప్రైవేట్ పాఠశాలలు, కళాశాలల్లో 2,12,141 మంది విద్యార్థులు చదువుతున్నారు. డిగ్రీ మొదటి సంవత్సరంలో ప్రభుత్వ, ప్రైవేట్ కళాశాలకు సంబంధించి 24,658 మంది విద్యార్థులు డీవార్మింగ్‌కు అర్హులుగా వైద్యాధికారులు నిర్ధారించారు. అయితే కేవలం ప్రభుత్వ పాఠశాలలు, కళాశాలల్లోనే ఈ డీవార్మింగ్ నిర్వహించి, 96 శాతానికి పైగా విద్యార్థులకు డీవార్మింగ్ చేపట్టామని అధికారులు ప్రకటించటం విమర్శలకు తావిస్తుంది. అధికారులు తప్పుడు లెక్కలు చూపించి విజయవంతం చేశామని ప్రకటించిన తీరుపై సొంత శాఖ ఉద్యోగులే పెదవి విరుస్తున్నారు.

● మావైపే రాలేదు..

తమవైపే వైద్యాధికారులు రాలేదని అధికసంఖ్యలో ప్రైవేట్ స్కూళ్లు, కళాశాలల నిర్వాహకులు చెబుతున్నారు. ఏదో కొన్ని ప్రైవేట్ పాఠశాలల్లో తప్ప మరెక్కడా డీవార్మింగ్ చేపట్టలేదని తెలుస్తోంది. ఏదో మొక్కుబడిగా కార్యక్రమం నిర్వహించి లక్ష్యాలు పూర్తి చేసినట్లు అధికారులు చెప్పటంపై సర్వత్రా విమర్శలు వినిపిస్తున్నాయి.